తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 281 పేజీలు: 8+4 వెల: 6.50



సొంతింటి కల నిజం చేసుకుంటున్న 3,00,192 పేద కుటుంబాలకు శుభాకాంక్షలు!



సొంతింటి కల నిజం చేసుకుంటున్న 3,00,192 పేద కుటుంబాలకు శుభాకాంక్షలు!


మన ఇలు మన గౌరవం

ప్రధాన మంత్రీ आवास योजना Pradhan Mantri Awas Yojana

## సొంతింటి కల నిజం చేసుకుంటున్న

# 3,00,192 పేద కుటుంబాలకు శుభాకాంక్షలు!

2029 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందరికీ ఇళ్లు లక్ష్యంగా...
జూన్ 2024 నుండి ఇప్పటి వరకు 17 నెలలలో ఎన్డీఏ ప్రభుత్వం నిర్మించిన
3,00,192 ఇళ్లను పేదలకు అందించి వారిని ఇంటి యజమానులను చేసే కార్యక్రమం.

**గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి**

## శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే లబ్ధిదారులకు నేడు ఇళ్ల పంపిణీ

**తేదీ :** నవంబర్ 12, 2025
**సమయం :** ఉదయం 11 గంటలకు

**వేదిక :** దేవగుడిపల్లి, రాయచోటి నియోజకవర్గం, అన్నమయ్య జిల్లా

### జూన్ 2024 నుండి ఇప్పటి వరకు నిర్మించిన ఇళ్లు

- PMAY BLC కింద 2,28,034 ఇళ్లు
- PMAY gramin కింద 65,292 ఇళ్లు
- PMAY JANMAN కింద 6,866 ఇళ్లు
- మొత్తం 3,00,192 ఇళ్లు

### పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ సహకారం

- గతంలో గ్రామీణ ప్రాంతంలో 1.5 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 1 సెంటు స్థలం
  ఈ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్ల ఇళ్ల స్థలం
- ఉచిత ఇసుక పథకం కింద 20 టన్నుల వరకు ఇసుక
- ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, PVTG లకు రూ.1 లక్ష అదనపు ఆర్థిక సహాయం



జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఇల్లు అంటే నాలుగు గోడలు కాదు. ఒక కుటుంబానికి గౌరవం... సంతోషం... భవిష్యత్తు... భద్రత అని నమ్మే ప్రభుత్వం మనది



మంగళవారం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# ఎంఎస్ఎంఇలతో 5 లక్షల ఉద్యోగాల కల్పన

**కనిగిరి, నవంబరు 11, ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పెదఈర్లపాడులో గుంటూరు లింగన్నపాలెం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 49 పారిశ్రామిక పార్కులను వర్చువల్‌గా ప్రారంభిస్తూ, పెట్టుబడులు, ఉపాధి సృష్టి దిశగా కూటమి ప్రభుత్వం వేస్తున్న పాదాలను ఆయన వివరించారు."యువత ఆలోచనలతో ముందుకు వస్తే ప్రభుత్వం చేయూత ఇస్తుంది. ప్రతి నియోజకవర్గంలో ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో అవకాశాల తలుపులు తెరుస్తున్నాం అని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా 5 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కనిగిరి పార్కుతో పాటు 17 జిల్లాల్లో ఏర్పాటైన పార్కుల్లో భూములు పొందిన 1,597 సంస్థలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ.25,256 కోట్ల పెట్టుబడులతో 38 మెగా పారిశ్రామిక యూనిట్లు కూడా ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రారంభమయ్యాయి.

**పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి**

కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది"గత ప్రభుత్వంలో పరిశ్రమలు మూతపడగా, ఇప్పుడు పెట్టుబడులు వరదలా వస్తున్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. గూగుల్ విశాఖకు లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం. డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయెల్, సెమీకండక్టర్ పరిశ్రమలు రాష్ట్రంలో స్థాపన దశలో ఉన్నాయి" అని వివరించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఎంఓయూలు కుదురనున్నాయి, వాటితో 8 లక్షల ఉద్యోగాల అవకాశాలు సృష్టి అవుతాయని తెలిపారు. వెలుగొండ పూర్తయితే కనిగిరి కనకపట్నం అవుతుంది రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లు అందిస్తాం. కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం వంటి కరవు ప్రాంతాల రూపురేఖలు మారతాయి. శ్రీశైలం నుంచే కాక గోదావరి నీళ్లు కూడా ఈ ప్రాంతాలకు తెస్తాం అని చెప్పారు.

**సంపద సృష్టిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి**

ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త తయారై ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. రైతులు ఎఫ్‌పీఓలు ఏర్పరచుకుని పారిశ్రామికవేత్తలుగా మారండి. హార్టికల్చర్, ఆక్వా, సేవా రంగాల్లో కొత్త అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, సెక్రెటరీ యువరాజ్, కలెక్టర్ రాజాబాబు, డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, కనిగిరి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు, పారిశ్రామికవేత్తలు, జిల్లా ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే 2622 కోట్లివ్వండి

>> స్తంభాలు నేల కూలినట్లు స్పష్టం చేసింది. 2,318 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో ప్రభుత్వం తెలిపింది.మొంథా తుపాను కారణంగా పంటలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నది. మొంథా తుపాను వల్ల నష్టపోయిన 3.36 లక్షల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి ప్రభుత్వం తెలిపింది.ఈ అంశాలన్నింటి తిరిగి సీఎం చంద్రబాబు కేంద్ర బృందానికి వివరించారు.మీరు ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో వాస్తవాలు గమనించి ఉంటారు.ఈ నష్టాన్ని భర్తీ చేయడానికి ఎటువంటి ఆర్థిక అవసరతలుంటాయో తెలుసుననన్నారు.కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు తాము కేంద్రం నుంచి తక్షణ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబు తెలిపారు.కేంద్ర బృందాలు తుఫాను నష్టాలను అంచనా వేసేందుకు గోదావరి,కృష్ణా, ప్రకాశం గుంటూరు జిల్లాల్లో పర్యటించింది.తుఫాను దెబ్బ తిన్న పంట పొలాలను బృందాలు వెళ్లి పరిశీలించింది.రైతులు,ఆయా గ్రామాల ప్రజలు తమ గోడును వారికి నేరుగా విన్పించారు.అనంతరమే వారు సిఎం చంద్రబాబును కలిసారు. ఎపి ఉన్నత అధికార యంత్రాంగం సైతం కేంద్ర బృందానికి నిన్న ఆర్టీజీఎస్ ద్వారా రాష్ట్రంలో తుఫాను నష్టాన్ని వివరించింది.

**త్వరితగతిన సాయం వచ్చేలా చూడండి..**

రాష్ట్రంలో జరిగిన తుపాను నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినందున త్వరితగతిన నివేదిక ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలని సీఎం కేంద్ర బృందాన్ని కోరారు. ఎపి నుంచి రెండు రోజుల్లో తుది అంచనాలను కూడా పంపుతామని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర బృందం.. త్వరితగతిన కేంద్రానికి సిఫార్సులు చేస్తామని వెల్లడించింది. ఆర్టీజీఎస్ నుంచి ముందస్తు హెచ్చరికలు పంపి సరైన సమయంలో విలువైన ప్రాణాల్ని కాపాడగలిగారని కేంద్ర బృందం ముఖ్యమంత్రిని కొనియాడింది.భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు వచ్చి పంటలు నీట మునిగినట్టు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించామన్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిబంధనలు సవరించేలా సిఫార్సు చేయాలని సీఎం కోరారు. పత్తి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని అన్నారు.

**సముద్ర కోత నివారణ పనులకు నిధులివ్వండి..**

తూర్పు కోస్తాలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎప్పుడూ తుపాన్ల కారణంగా నష్టం జరుగుతూనే ఉందని ముఖ్యమంత్రి కేంద్ర బృందానికి తెలిపారు. సూళ్లూరు పేట నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న ప్రాంతాలు తుపాన్ల కారణంగా తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని వివరించారు. తుపాన్ల గమనాన్ని గమనించేలా సాంకేతికత వినియోగిస్తున్నా దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ఆస్కారం లేదని.. ఫలితంగా ఆస్తి నష్టం జరుగుతోందని అన్నారు. అవేర్‌తో పాటు ఇతర సాంకేతిక వ్యవస్థల ద్వారా వరద నియంత్రణను చేయగలుగుతున్నామని సిఎం పేర్కొన్నారు. సముద్రపు నీరు, నదులు, వాగుల నుంచి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా పంటలు, రహదారులు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని అన్నారు. తీరప్రాంతాల్లోని సముద్ర కోత నివారణకు వేర్వేరు చోట్ల పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందాన్ని కోరారు. కోస్టల్ సీ ఎరోజన్ మిటిగేషన్ ప్రాజెక్టులో భాగంగా కాకినాడ సమీపంలోని ఉప్పాడ వద్ద సముద్రపు కోత నివారణ కోసం చేపట్టే పనులకు రూ.323 కోట్లు, విశాఖ సమీపంలో రూ.203 కోట్లు, శ్రీకాకుళం సమీపంలో రూ.98 కోట్లు నిధులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేసింది.

# బీహార్‌లో ఎన్డీయే హవా!

>> విషయం తెలిసిందే. అయితే, చాలా సంస్థలు మళ్లీ నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం కొలువు దీరుతుందని అంచనా వేశాయి. పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్‌ను బట్టి చూస్తే, ఎన్‌డిఏ కూటమి 130 నుంచి 167 స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేశాయి. ఆర్‌జెడి- కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ (ఎంజిబి) మాత్రం 70 నుంచి 108 స్థానాలు చేజిక్కించుకోవచ్చు. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో 122 సీట్లు గెలుచుకున్న పార్టీ లేదా కూటమి అధికారం చేపట్టనుంది. నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నా, అంతిమంగా ఓటరు తీర్పు ఎలా ఉందో ఆ రోజు తేలనుంది. ఎగ్జిట్ పోల్స్‌ను అధికార ఎన్‌డిఏ నేతలు స్వాగతించగా, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ నేతలు మాత్రం కొట్టిపారేశారు. బీహార్ ఓటర్లు తమ వైపు ఉన్నారు, తమకే పట్టంకడతారని, నవంబర్ 14న తీర్పు చాలా స్పష్టంగా ఉండనుందని ఇండియా కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 18న బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నామని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్‌పై ప్రశాంత్ కిశోర్ తనదైన శైలిలో స్పందిస్తూ, మార్పు కోసమే తాము ప్రయత్నించాం, తమ పార్టీ ఈ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.



మంగళవారం థింపూలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న భూటాన్ ప్రధాని త్సెరింగ్ తొబ్గే

# వైవి సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు

>> మేరకు సుబ్బారెడ్డిని విచారణ చేయనున్నారు. కల్తీనెయ్యి బాగోతంలో పలురకాల వాదనలు వినిపించిన టిటిడి గత పాలకమండలి, అధికారులు ఇప్పుడు సిట్ ఆధారాలతో ప్రశ్నిస్తుండటంతో కేసు విచారణ కీలక మలుపుతిరిగింది. ఈ కేసులో సిట్ ఎదుటకు సుబ్బారెడ్డి వస్తుండటంతో శనివారం ఏం జరగనుందనేది మాత్రం ఇప్పటికే అర్థమైపోయింది. ఇదే సమయంలో మంగళవారం మాజీ ఇఒ ధర్మారెడ్డినుండి సేకరించిన కొన్ని వివరాలతో సుబ్బారెడ్డి అరెస్ట్ తప్పదనేది రాజకీయవర్గాల్లో చర్చ మొదలైంది. కల్తీనెయ్యి సరఫరా చేయడం వెనుక భారీ కుట్రదాగివుందని, భారీగా ముడుపులు ముట్టాయనే ఆధారాల వివరాలను సిట్ గుర్తించింది. 2022లో వైవినే కీలకమనేది దాదాపు సిట్ ఖరారుచేసింది. కల్తీనెయ్యి పాపానికి పాత్రధారులను కటకటాల్లోకి పంపిన సిట్ తదుపరి చర్యలకు సిద్దమవుతోంది. ఇప్పటి వరకు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తుచేపట్టి సిద్ధం చేసుకున్న నివేదికల మేరకు చివరగా సుబ్బారెడ్డిని విచారణకు పిలవడం కొంత ఉత్కంఠత రేపుతోంది. ఇప్పటికే సుబ్బారెడ్డి బ్యాంకు లావాదేవీలను సిట్ సేకరించింది. కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో అసలు సూత్రధారులైన టిటిడిపెద్దల అవినీతి గుట్టు రట్టయ్యేసమయం సమీపించింది.

# స్కూటర్లను ఢీకొన్న కంటైనర్

>> లిస్టును తప్పించే క్రమంలో ఆదే రహదారిపై వెళుతున్న మరో రెండు స్కూటర్లను ఢీ కొట్టింది. అతి వేగంగా రోడ్డు పక్కన మొక్కజొన్న కంకులు అమ్ముతున్న మంజుల, పక్కనే కొబ్బరి బొండాలు అమ్ముతున్న మాలకొండయ్య పైకి దూసుకెళ్లింది. వారిద్దరితో పాటు అక్కడే కంకులను కొనుగోలు చేసేందుకు నిలబడి ఉన్న స్టోన్ హౌస్ పేట ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఎలక్ట్రికల్ ఉద్యోగి అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై వెళ్తున్న నగరంలోని సిరి గార్డెన్స్ ప్రాంతానికి చెందిన తండ్రి కొడుకులు షేక్ కాజా నజీమ్ మొహిదీన్ (70), షేక్ ముజాహిద్ అలీ (35), మరో బైక్‌పై వెళుతున్న అదే ప్రాంతానికి చెందిన వై సురేష్ (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న కోటి అనే బైకర్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌లు, ఒక టాటా ఏస్ ఆటో, చక్రాల బండి ధ్వంసమయ్యాయి.

**రోడ్డు క్రాస్ చేస్తున్న బైకర్ వల్లే ప్రమాదం?**

వెనక వచ్చే వాహనాలను పరిశీలించకుండా జాతీయ రహదారిపై జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న కోటి అనే బైకర్ వలన ప్రమాదం చోటు చేసుకున్నట్లు, అదే సమయంలో అతివేగంతో వస్తున్న లారీ డ్రైవర్ బైకర్ను తప్పించే క్రమంలో మిగతా వారిపై విచక్షణ రహితంగా దూసుకెళ్లిపోవడంతో ఇంతటి విధ్వంసం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రహదారి పక్కనే ఉన్న భారీ వృక్షం యొక్క కొమ్మలు విరిగిపోయాయి అంటే ప్రమాద తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. ప్రమాద విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకున్న డిటిసి డిఎస్పి గిరిధర్ పర్యవేక్షణలో నెల్లూరు నార్త్, సౌత్ ట్రాఫిక్ సిఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, బాలాజీ నగర్, నవాబుపేట సిఐలు సాంబశివరావు, వేణుగోపాల్ రెడ్డిలు మృదుల కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ఏర్పడిన ట్రాఫిక్‌ను పునరుద్ధ రించారు.

# వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తా

>> చేశాం. మైనారిటీలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తున్నాం. మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చాం. 175 మందిని దీఎస్సీ ద్వారా ఉర్దూ ఉపాధ్యాయులుగా నియమించాం. పీఎం వికాస్ పథకం కింద రూ.11 కోట్లతో 1,500 మందికి నైపుణ్య శిక్షణ ప్రారంభించాం. రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి మైనారిటీ ఆడపిల్లలకు ఇంటర్ వరకూ ఉచితంగా చదివిస్తున్నాం. ఇమామ్‌లకు రూ.10,000, మోజన్లకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నాం. హజ్ యాత్రికుల కోసం ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన వెయ్యికి పైగా మసీదులు, చర్చి, షాదీఖానాలు, కమ్యూనిటీ హాళ్లనిర్మాణం, పునరుద్ధరణకు రూ.200 కోట్లు మంజూరు చేస్తాం. వక్ఫ్ ఆస్తులను రక్షిస్తున్నాం. అర్హత కలిగిన ఇమామ్ లందరినీ ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తాం. నూర్ బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ఖర్చు చేస్తాం" అని సీఎం తెలిపారు.

**ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డులు**

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి నగదు ప్రోత్సాహకాలను సీఎం అందించారు. మౌలానా ఆజాద్ జాతీయ పురస్కారం కింద రూ.2.5 లక్షల నగదును అవార్డు గ్రహీతకు అందించారు. అలాగే అబ్దుల్ హక్ అవార్డు కింద 1.25 లక్షలు, రైజింగ్ స్పోర్ట్స్ పర్సన్ విభాగంలో నలుగురికి లక్ష రూపాయల చొప్పున నగదు పురస్కారాన్ని సిఎం అందించారు.

# భారీ పేలుడు

>> సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. ఇది అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణ నష్టం ఎక్కువగా జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నా, ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల పార్క్ చేసిన అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వారం - వర్జ్యం

12-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
అష్టమి రా.11.03
ఆశ్లేష సా.6.40, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.11-8.51
దు.ఉ.11.29-12.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి. సంతానం నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.

**మిథునం:** మిత్రుల నుండి మీరు ఆశించిన సహాయమును పొందగలుగుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్య రూపం దాలుస్తాయి.

**కర్కాటకం :** అనేకాంశాలు మీ ఊహలకు అనుకూలంగా ఉంటాయి. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**సింహం:** విజయబాటలో పయనిస్తున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తాయి. పోటీ పరీక్షలు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కన్య:** అన్నీ అనుకూలంగా ఉన్నా గతంలో మీరిచ్చిన మాట నిలుపుకోవటానికి అడ్డంకులు వస్తాయి. పోటీ పరీక్షలు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**తుల:** ఉన్నతాధికారుల వలన వచ్చే వేధింపులను లెక్క చేయరు. స్థిరాస్తి విలువ పెరుగుతుంది. నిరుద్యోగుల శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** కృషిలో, శ్రమలో లోపం లేనంత వరకు ఎవరికీ తలవంచనవసరం లేదని భావిస్తారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**ధనుస్సు:** నూతన కార్యక్రమాలలో ఆటంకాలు కలిగినా అధిగమిస్తారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**మకరం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభం. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**కుంభం:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**మీనం :** ధనమే అన్నిటికి మూలమన్న సత్యాన్ని గ్రహిస్తారు. దైవ చింతన కలిగి వుంటారు. ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందు తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రతి అర్జీని స్వయంగా పరిశీలిస్తా

>> గురిచేశాడని, దీంతో తీవ్రంగా నష్టపోయానని సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం శిరిగారిపల్లికి చెందిన కే.రవీంద్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. మాజీ సైనికుల సేవలను గుర్తించి కడప నగరం లేదా చింతకొమ్మదిన్నె మండలంలో 250 మంది మాజీ సైనికుల కుటుంబాలకు ఉచితంగా లేదా, ప్రభుత్వ నామమాత్రపు ధరతో పదెకరాల స్థలాన్ని కేటాయించి అండగా నిలవాలని కడపకు చెందిన జై జవాన్ మాచ్యువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లా గుంతకల్లు 7వ వార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన సురేష్ మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పించడంతో పాటు విద్యా సదుపాయాలు మెరుగుపర్చాలని విన్నవించారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఏఎస్ఆర్ జిల్లా దేవీపట్నం, పూడిపల్లికి చెందిన గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

పలు రాష్ట్రాల్లో ప్రజల నుంచి పెద్దఎత్తున డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఒంగోలుకు చెందిన మైత్రి ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్ రియల్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా, మద్దికెర మండలం, పెరవలికి చెందిన ఎమ్.రంగస్వామి మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీ హయాంలో తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించడంతో పాటు కష్టాల్లో ఉన్న తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజయవాడ రాణిగారితోటకు చెందిన షేక్ గుల్జార్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. పరిశీలించి తగినచర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# మావోయిస్టుల ఎన్‌కౌంటర్

>> గాయి. కాల్పుల్లో నలుగురు మృతిచెందగా మరికొంత మంది గాయపడినట్లు తెలుస్తుంది. ఎన్ కౌంటర్ ప్రాంతంలో అగ్ర నాయకులు ఉన్నట్లు తెలిసింది.అయితే ఎన్ కౌంటర్ పై పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ధృవీకరించలేదు.. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పిఎల్ జిఏ ఒకట బెటాలియన్ కమాండర్ మావోయిస్టు అగ్రనేత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిఘా వర్గాల కళ్లుకప్పి తిరుగుతున్న మోస్ట్‌వాంటెడ్ నేత మడివి హిడ్మ ఇలాక ( పువ్వర్తి)గ్రామంలో చత్తీస్‌గఢ్ హోంశాఖ మంత్రి విజయ్ శర్మ పర్యటించారు. ముందుగా పువ్వర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపులో ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయన అక్కడ అధికారులతో సమావేశం అయిన అనంతరం సమీపంలోని హిడ్మా ఇంటికి చేరుకున్నారు.అక్కడ హిడ్మా తల్లితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆమె యోగ క్షేమాలను తెలుసుకున్న ఆయన ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

# 10 కోట్ల మంది

>> అభివృద్ధి శాఖ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య వ్యక్తిగా వచ్చానని, రైతు సేవకుడిగా వచ్చానని, వారి సేవ దైవ సేవగా భావిస్తానని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు గొప్ప ముందు చూపు గల వ్యక్తి అని, పవన్ కల్యాణ్ దృష్టి, నరేంద్ర మోడీ ఆలోచనా విధానం వలన ఈ ముగ్గురి ఆలోచనా విధానం గొప్ప సమ్మేళనంగా ఉందన్నారు. వెంగళాయపాలెం వంటి చెరువుకు దేశంలో ఇతర ప్రాంతాల్లో చేపడతామని చెప్పారు.

మహిళా స్వావలంబనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన క్రింద ప్రతి ఒక్కరూ పక్కా గృహం కలిగి ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు సర్వే నిర్వహించి ఏ ఒక్కరు గుడిసెల్లో ఉండకుండా చూడాలని సూచించారు. వివిధ కార్యక్రమాల క్రింద ఉత్పాదన పెంచే విధానం ఉందని, అందరూ మూడు పంటలు వేసుకునే విధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. చిన్న సన్నకారు రైతుకు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంచి చర్యలు చేపడుతోందని, ఇతర పంటలపై దృష్టి మార్చే విధంగా అవగాహన కల్పించడం మంచి విషయం అన్నారు. అటువంటి పంటల ఉత్పాదకాలను ఎగుమతులు చేయుటకు సహకారం అందిస్తామని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మీ శివరాజ్ సింగ్ చౌహాన్ మామ అండగా ఉంటారని చెప్పారు. పెమ్మసాని చంద్ర శేఖర్ హిందీ, హిందీ ప్రాంత వాసులను ఆలోచింపజేసే విధంగా ఉందని ప్రశంసించారు.

కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలన్నారు. 25 శాతం వర్షంపై ఆధారపడిఉన్నాయి, వీటికోసం ప్రధానమంత్రి వాటర్ షెడ్ కార్యక్రమాలు చేపట్టాలని ఆలోచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మన రాష్ట్రం ఒక భాగం కావాలని ఆలోచించారని చెప్పారు. ఈ పథకాలు బాగా అమలుచేసి ఆదర్శంగా నిలవాలని రాష్ట్రానికి తీసుకువస్తున్నామని తెలిపారు. శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయ శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు 40శాతం యూరియా సరఫరా చేశారని తెలిపారు. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మరియు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నీటిని ఒడిసి పట్టుకోకపోతే అనేక రకాలుగా నష్టపోతామన్నారు. ప్రధాన మంత్రి చక్కటి కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగమైన వివిధ సంఘాలకు చెక్కులను అందజేశారు.

# కృష్ణా జిల్లాలో మరో ప్రమాదం

## నలుగురు మృతి

**విజయవాడ, నవంబరు 11, ప్రభాతవార్తప్రతినిధి:** కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో నలుగురు యువకులు మృతి చెందిన ఘటన మంగళవారం కృష్ణా జిల్లాలో జరిగింది. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట సమీపంలో కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై పైనుంచి సర్వీసు రోడ్డులోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడ, కుందేరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులు కుందేరు, విజయవాడ వాసులుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో చింతయ్య (17), చాట్రగడ్డ రాకేష్‌బాబు(24) ప్రిన్స్‌బాబు(23), గోరిపర్తి బాపనయ్య(24)గా సంబంధిత అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు సిఎం చంద్రబాబు ఘన నివాళి

**విజయవాడ, నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సిఎం చంద్రబాబు నాయుడు శ్లాఘించారు.మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నానని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తన కార్యాలయంలోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్ర పటానికి సిఎం చంద్రబాబు అంజలి ఘటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ జాతీయ విద్యా దినోత్సవ, మైనార్టీ సంక్షేమ దినోత్సవ శుభాకాంక్షలను సిఎం చంద్రబాబు తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే విద్యారంగంలోనే అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామన్నారు.

**మౌలానా ఆజాద్ దేశంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు: మంత్రి నారా లోకేష్**

స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వినూత్న సంస్కరణల ద్వారా దేశంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కీర్తించారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని స్మరించుకుంటూ మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.

# దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డిజిఎంగా అశీష్ మెహోత్ర

**గుంతకల్లు రైల్వే, నవంబరు11, ప్రభాత వార్త:** తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డిజీఎంగా అశీష్ మెహోత్రను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం నార్ధన్ రైల్వే జోన్‌లో పనిచేస్తున్న భారతీయ రైల్వే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ క్యాడర్ కు చెందిన అనీష్ మెహోత్ర, దక్షిణ మధ్య రైల్వే ఎస్ డి జీ ఎం గా నియమితులైన ఆయన జోనల్ రైల్వే అవినీతి నిరోధక శాఖ ముఖ్య అధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

# సిఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ ముస్తాబవుతోంది : మంత్రి లోకేష్

**విజయవాడ,నవంబరు 11,పభాతవార్త ప్రతినిధి:** ఈ నెల 14,15 తేదీలలో జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం ముస్తాబవుతోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. రహదారుల అభివృద్ధి,తీరప్రాంత సుందరీకరణ,కొత్త ల్యాండ్‌స్కేప్ పనులు అన్నీ వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షించడానికి, చిరస్థాయి ముద్ర వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు ఓ వీడియోను లోకేష్'ఎక్స్'లో పోస్టు చేశారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో 37 ప్లీనరీ సెషన్లు...5 కంట్రీ సెషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. వివిధ దేశాల ప్రతినిధులు,పలు ప్రముఖ కంపెనీల సీఎక్స్‌వోలు,ఆర్థిక నిపుణులు అందులో పాల్గొననున్నారు. వివిధ దేశాల్లో వాణిజ్యానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. ప్రారంభ,ముగింపు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. వివిధ విభాగాలకు సంబంధించి 410 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకోనుంది. వాటి ద్వారా సుమారు రూ.9.76 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని అంచనా అన్నారు,



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం



సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 281 పేజీలు: 8 వెల: 6.50




## బీహార్‌లో ఎన్డీయే హవా!

| వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు | | |
|---|---|---|
| ప్రజాపోల్ అనలిటిక్స్ | ఎన్‌డిఎ 186 | ఎంజిబి 50 |
| మ్యాట్రిక్స్ ఐఎఎన్‌ఎస్ | ఎన్‌డిఎ 147-167 | ఎంజిబి 70-90 |
| పీపుల్స్ ఇన్‌సైట్ | ఎన్‌డిఎ 133-148 | ఎంజిబి 87-102 |
| జెవిసి పోల్ | ఎన్‌డిఎ 135-150 | ఎంజిబి 88-10 |

### 130-167 సీట్లు రావొచ్చని అంచనా

### ఎగ్జిట్‌పోల్స్‌లో అధికశాతం అటువైపే

**న్యూఢిల్లీ, నవంబరు 11:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రెండో విడత పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 67.14శాతం నమోదు కాగా, కిషన్‌గంజ్‌లో అత్యధికంగా 76శాతం పోలింగ్ నమోదైంది. నవంబర్ 14న జరిగే ఓట్ల లెక్కింపు జరుగనున్న >>2

# వెంటనే 2622 కోట్లివ్వండి

**తుఫాన్ సాయం మంజూరు చేయాలని కేంద్ర బృందాన్ని కోరిన సిఎం చంద్రబాబు**

**కోత దశలో మాగాణి, మెట్ట పంటలకు తీవ్ర నష్టం**

**3109 గ్రామాల ప్రజలు అతలాకుతలం**

**రూ. 5217 కోట్ల పరిహారం కోరుతూ మధ్యంతర నివేదిక ఇచ్చాం: సిఎం**



మంగళవారం సిఎం చంద్రబాబును కలిసిన కేంద్ర బృందం

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను అనుహ్యంగా ఎపిని నష్టపరిచిందని సిఎం చంద్రబాబు వెల్లడించారు. కోతకు వచ్చే దశలో మాగాణి,మెట్ట పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. వారందరిని కేంద్రం అత్యవసర సహకారాన్ని అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలో కేంద్ర బృందం ముఖ్యమంత్రిని కలుసుకుంది. రాష్ట్రంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని కేంద్ర బృందం అంచనా వేసింది. కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను కేంద్ర బృందం సందర్శించింది. రూ.5,267 కోట్ల మేర తుపాను నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి ఇప్పటికే ఓ మధ్యంతర నివేదిక రాష్ట్రప్రభుత్వం ఇచ్చింది. తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అభ్యర్థించింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుపాను కారణంగా ప్రభావితం అయ్యాయని ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుపాను, భారీ వర్షాలకు ప్రభావితం అయ్యారని ప్రభుత్వం నివేదికలో వెల్లడించింది. 9960 ఇళ్లు నీట మునిగాయని 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని ప్రభుత్వం పేర్కొంది.

తుపానుతో పాటు భారీ వర్షం కారణంగా 4566 ఇళ్లు దెబ్బతిన్నాయని స్పష్టం చేసింది 1.61 లక్షల హెక్టార్లలో పంటదెబ్బతిందని నివేదికలో ప్రభుత్వం వివరించింది. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్రానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశుసంవర్ధకం, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 4794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ >>2




## పాక్ కోర్టు వద్ద భారీ పేలుడు

### 12 మంది మృతి, 20 మందికిపైగా గాయాలు

**ఇస్లామాబాద్, నవంబరు 11:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ భారీ పేలుడుతో దద్దరిల్లింది. మంగళవారం నాడు నగరంలోని జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన శక్తిమంతమైన పేలుడులోకనీసం 12మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇది ఆత్మాహుతి దాడి అని భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల >>2

## కల్తీ నెయ్యి బాగోతం.. వైవి సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు

### 15న విచారణకు వస్తానని వెల్లడి



వైవి సుబ్బారెడ్డి

**తిరుపతి,నవంబరు 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని విచారణ చేయడానికి సిబిఐ సిట్ సిద్ధమైంది. ఈ మేరకు ఆయనను సోమవారం నోటీసులు ఇచ్చిన సిట్‌బృందం 13వతేదీ గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. అయితే తాను 15వతేదీ శని వారం హాజరవుతానని సిట్‌కు సమాధాన మిచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు పాత్రధారులైన సరఫరాదారులు, వైవి పిఎ చిన్నఅప్పన్న, అజయ్ కుమార్‌ల రిమాండ్ రిపోర్టుల్లో ఆధారాల >>2

## మరో ఆరుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

### ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న కాల్పులు

**చర్ల,నవంబర్ 11, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ అటవి ప్రాంతంలో మావోయిస్టులే లక్ష్యంగా విస్తృత కూబింగ్ జరుగుతుంది. ఒక పక్క భారీగా లొంగుబాట్లు జరుగుతుండగా మరో పక్క ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. తాజా నేషనల్ అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు మావోయిస్టుల మద్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిసింది. నేషనల్ అటవి ప్రాంతంలో మావోయిస్టులు ఉన్న రన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలకు నక్సల్ తారసపడటంతో ఇరువురిమద్య కాల్పులు జరి >>2

# వేటాడి శిక్షిస్తాం


- ఢిల్లీ పేలుడు ఘటనలో ఏ ఒక్కరినీ వదలబోమన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- కేసు ఎన్ఐఎకు అప్పగింత
- కారు నడిపిన నిందితుని సోదరులు, తల్లి అరెస్టు
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం: ఢిల్లీ సిఎం



**న్యూఢిల్లీ,నవంబరు 11:** అంతర్జాతీయంగా ఆందోళనకు గురిచేసిన ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారుబాంబు కేసులో ప్రాథమికనివేదికను కేంద్రానికి అందచేసారు. సంఘటన ప్రాంతంలో ఎన్ఐఎ, ఎన్ఎస్‌జి ఢిల్లీపోలీసులు ఇతర ఫోరెన్సిక్‌నిపుణులు చేపట్టినదర్యాప్తును క్రోడీకరించి నివేదికను హోంశాఖకు అందచేసారు. ఉగ్రదాడిగానే నిర్ధారించారు. ముందురోజు 2900 కిలోల ఐఇడి సామగ్రిని స్వాధీనంచేసుకున్న భద్రతా బలగాలు ఉగ్రనెట్‌వర్క్ బలపడుతోందన్న ఇంటెలిజెన్స్ నివేదికలు ఆధారంగానే అప్రమత్తం అయిన దశలో ఈ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఆత్మాహుతి దాడిగానే పరిగణిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు తమ నివేదికలో పొందుపరిచారు. అలాగే నిందితులు ఈ పేలుడు సామగ్రిని తీసుకెళుతుండగా ఆకస్మికంగా జరిగిన దిగా ముందు అనుమానించారు. పేలుడు సామగ్రి భారీ ఎత్తున పట్టుబడటంతో మిలిటెంట్లు తమవద్ద ఉన్న సామగ్రిని మరోప్రాంతానికి తరలించేక్రమంలోనే ఈపేలుడు జరిగిందని నిర్ధారించారు. సమగ్రదర్యాప్తుకోసం ఎన్ఐఎకు అప్పగించడంతో మొత్తం బృందాలు రంగంలోకి దిగాయి. ఇదిలా ఉంటే మంగళవారం మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీనితో 12 మంది మృతులు 25 మందికిపైగా గాయపడినట్లు ఏజెన్సీలు తమ నివేదికలో తెలిపాయి. దీనికితోడు దర్యాప్తుచేపట్టిన ఏజెన్సీలతో హోంమంత్రి అమిత్‌షా ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. కర్తవ్యభవన్‌లోని కేంద్ర హోంశాఖ కార్యాలయంలో ఈసమావేశం జరిగింది. ఢిల్లీకమిషనర్ సతీష్ గోల్చా, ఎన్ఐఎ డైరెక్టర్‌జనరల్ సదానంద్ వసంత్, జమ్ముకాశ్మీర్ డిజిపి నళిన్‌ప్రభాత్ వర్చువల్‌గా హాజరుకాగా ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తన్‌కుమార్, ఎన్ఎస్‌జి డైరెక్టర్ జనరల్లు, ఫోరెన్సిక్ ఉన్నతాధికారులు, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ డైరెక్టర్, ఈ సమీక్షకు హాజరయ్యారు. అంతేకాకుండా ఈసందర్భంగా సేకరించిన సిసిటివి ఫుటేజినికూడా సమీక్షలో వీక్షించి పార్కింగ్ ఏరియా ప్రాంతాన్ని మొత్తం తనిఖీ చేసారు. అయితే కారులో ఉన్నది ఒక్కడేనని భావిస్తున్నారు. ఆతడిని ఆత్మాహుతి దాడిగానే పరిగణించాల్సి ఉంటుందని హోంమంత్రికి వివరించారు. నాలుగు గంటలపాటు జరిగిన సమీక్ష అనంతరం ఈ పేలుడు కేసును ఎన్ఐఎ దర్యాప్తునకు ఆదేశించినట్లు హోంమంత్రి ప్రకటించారు.

**పేలుడు వెనుక ప్రతి ఒక్కర్ని వేటాడతాం...అమిత్‌షా**

సుదీర్ఘ సమీక్ష జరిగిన తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ ఈ పేలుడు ఘటన వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ వేటాడాలని హోంమంత్రి ఆదేశించారు. ఢిల్లీతోపాటు సరిహద్దు రాష్ట్రాలు, ఉగ్రకదలికలున్న రాష్ట్రాల్లో భద్రతపై హోంమంత్రి రెండు పర్యాయాలు సమీక్షనిర్వహించారు. ఈ ఘటనలోప్రమేయం ఉన్న ఏఒక్కరినీ ఉపేక్షించేది లేదని, అందరిపైనా ఉక్కుపాదంమోపుతామని అమిత్‌షా వెల్లడించారు. ఎర్రకోట పేలుళ్లకేసు దర్యాప్తును వేగవంతంచేసిన చర్యల్లోభాగంగా పోలీసులు మొత్తం ఆరుగురిని అరెస్టుచేసారు.




మంగళవారం గుంటూరులో గ్రామీణాభివృద్ధిలో భాగమైన వివిధ సంఘాలకు చెక్కులు అందజేస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

## లక్‌పతి దీదీలుగా 10 కోట్ల మంది

### మహిళా స్వావలంబనకు మరిన్ని కార్యక్రమాలు

### యేడాదికి కనీసం లక్ష ఆదాయం వచ్చేలా చర్యలు

### వాటర్‌షెడ్ మహోత్సవ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సులో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

**గుంటూరు, నవంబరు 11, ప్రభాతవార్త :** రానున్న రోజుల్లో 10 కోట్లు మందిని లక్‌పతి దీదీలుగా మార్చటానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రతి ఏడాది లక్ష రూపాయల ఆదాయం కనీసం రావాలని, ప్రస్తుతం రెండు, మూడు కోట్లుగా ఉన్న లక్‌పతి దీదీల సంఖ్య పెంచటానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వాటర్ షెడ్ మహోత్సవ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సు రెండవ రోజు గుంటూరు గ్రామీణ మండలం వెంగళాయపాలెంలో మంగళవారం జరిగింది. ఈ జాతీయ సదస్సులో కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ >>2



మంగళవారం మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

## వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తా

### రూ. 200 కోట్లతో ప్రార్ధనా మందిరాలు, షాదీఖానాల పునరుద్ధరణ

### మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సిఎం చంద్రబాబు

### ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డుల ప్రదానం

**విజయవాడ, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** మైనారిటీ సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మైనారిటీలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమదినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు హాజరయ్యారు. భారతరత్న మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "దేశభక్తికి చిరునామా మౌలానా అబుల్ కలామ్ అజాద్. ఆయన దేశంలో నాలెడ్జ్ ఎకానమీకి నాంది పలికారు. దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారు. 1951లో మొదటిగా ఐఐటీ స్థాపించారు. అజాద్ స్ఫూర్తితోవిద్యారంగంలో సంస్కరణలు తెస్తున్నాం. టీడీపీ హయాంలోనే ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూ వర్సిటీపెట్టాం. రాష్ట్ర విభజన తర్వాత కర్నూలులో ఏర్పాటు చేశాం. ఒకప్పుడు మైనారిటీ సోదరులు మక్కాకు వెళ్లేందుకు బెంగళూరు, ముంబయి వెళ్లేవారు. హైదరాబాద్‌లో అసెంబ్లీకి ఎదురుగా హజ్ హౌస్ కట్టి అక్కడి నుంచి విమానంలో మక్కా పంపాం. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ ఏర్పాటు ఘనత టిడిపిదే. ఆనాడు దూరదృష్టితో హైదరాబాద్ అభివృద్ధికి తీసుకున్న చర్యలతో చాలా మంది ముస్లింలు లబ్ధి పొందారు" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సంక్షేమంలో మైనారిటీలకు ప్రాధాన్యత**

"2025-26 బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి రూ.5,434 కోట్లు కేటాయించాం. ఎన్నికల్లో హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు >>2

## ప్రతి అర్జీని స్వయంగా పరిశీలిస్తా

### గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారందరికీ న్యాయం చేస్తాం

### తొలగించిన పెన్షన్‌లు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తాం

### 72వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్



మంగళవారం చెన్నూరికి చెందిన దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందించిన మంత్రి నారా లోకేష్

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల సమస్యలన్నింటి పరిష్కరించే దిశలో నిరంతరం ప్రభుత్వం కార్యచరణ నిర్వహిస్తుందని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ప్రజా దర్బార్‌లో ప్రజలనుంచి వచ్చే ప్రతి అర్జీని తాను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. సంబంధిత అంశం పరిష్కారమయి లబ్దిదారు సంతృప్తి చెందితేనే తనకు సంతోషం అన్నారు. గత ప్రభుత్వంలో పలువురు లబ్దిదారులకు ఎంతో కష్టం కలిగించారని, వారందరికి తాము న్యాయం చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో దౌర్జన్యానికి, దాష్టికాలకు గురయిన టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరులకు జరిగిన అన్యాయానికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 72వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను స్వయంగా కలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సాధ్యమైనంత త్వరగా అర్జీలుపరిష్కరించి అండగా నిలుస్తామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. టిడిపి సానుభూతిపరుడిననే కక్షతో వైఎస్సార్సీ హయాంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తనపై అక్రమంగా హత్య కేసు బనాయించి ఇబ్బందులకు >>2



ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ

## స్కూటర్లను ఢీకొన్న కంటైనర్

### చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై నెల్లూరు వద్ద ఘోర ప్రమాదం

### ముగ్గురు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

**నెల్లూరు క్రైమ్, నవంబరు 11, ప్రభాతవార్త:** నెల్లూరు నగర శివార్లలో చెన్నై కోలకతా 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనంతో పాటు సేకరించిన సమాచారం మేరకు చెన్నై వైపు నుండి కావలి వైపుగా వెళుతున్న చేపల కంటైనర్ లారీ నెల్లూరు ఎస్‌విజిఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్‌చేస్తున్న ఒక మోటార్ సైకి >>2

**కృష్ణా జిల్లాలో మరో ప్రమాదం : నలుగురు మృతి** 2లో


వార్త

ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు,
ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయలేరు.

-యూరిపిడెస్

# ఉగ్రవాదానికి ఊపిరి పోస్తున్నదెవరు?

దేశంలో అరాచకం ప్రబలిపోయింది. అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. అనుకోని సంఘటనలు మరీను. పెరిగిన శాస్త్రవిజ్ఞానం, సాంకేతికత దుష్టుల చేతుల్లో పడింది. వారే వీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. దుర్వినియోగం చేస్తున్నారు. డిటోనేటరు ఉపయోగించి ఢిల్లీలో ముష్కరులు కొందరు కారులో ఆత్మాహుతి పేలుడుకు రూపకల్పన చేశారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఒక్కసారిగా పేలిన కారు వలన పెద్ద విధ్వంసానికే ఒడికట్టారు. టెర్రరిస్టుల ఘాతుకమేనని తేలిపోయింది. వారు మాత్రమే ఇలాంటి దురాగతాలకు పూనుకుంటారు. తాము శత్రువుగా భావించిన దేశ ప్రజల చెడును కోరుకుంటారు. ఒకపక్క దేశ నిఘా వర్గాలు టెర్రరిస్టుల కుట్రలను భగ్నంచేసి వారి వల్ల కలిగే ఆగడాలను అరికడ్తున్న వేళ ఢిల్లీ ప్రేలుడు దుర్ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం కారులో విస్ఫోటం సంభవించగా 6 కార్లు, రెండు ఆటోలు పూర్తిగా ధ్వంసంకాగా 12మంది మృతిచెందారు. మరికొందరు ఢిల్లీ ఆసుపత్రులలో క్షతగాత్రులై చికిత్స పొందుతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటనతో దేశమంతటా 'రెడ్ అలర్ట్' ప్రకటించారు. ఈ కుట్రకు పాత్రధారులెవరో, సూత్రధారులెవరో కనుక్కునేందుకు వారి తదుపరి దుశ్చర్యల ఆటకట్టించేందుకు ఢిల్లీ యుపి, హర్యానా, జమ్మూకాశ్మీర్, పంజాబ్, హైదరాబాద్, విజయవాడలలో హై అలర్ట్ ప్రకటించారు. లాల్‌ఖిలా మెట్రో స్టేషన్ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గరకు చేరుకున్న ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. డాక్టర్ ఉమర్ మహ్మద్ అనే వ్యక్తి కారులో పేలుడు పదార్థాలుంచి ఆత్మాహుతి దాడికి సిద్ధమైనట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ పేలుడు ఘటనను దేశద్రోహం ఉపా చట్టం కింద కేసు నమోదుచేశారు. ఢిల్లీ ఘటనకు డాక్టర్ ఉమర్‌ను కీలక సూత్రధారిగా ఎంచి ఎన్ఐఎ అరెస్టు చేసింది. పేలుడు కోసం అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్‌ను ఉపయోగించినట్లు తేలింది. ఈ రసాయనిక ద్రావణం అత్యంత ప్రమాదకరమైనది. గతంలో లెబనాన్‌లో జరిగిన అతిపెద్ద పేలుడుకు ఒడలో ఉన్న అమ్మోనియం నైట్రేటే కారణం. పేలుడు తర్వాత హానికర విష పదార్థాలను విడుదల చేస్తుంది. ప్రాణాపాయకరమే. బీరుట్ నగరానికి ఆర్థికనష్టం కలిగించిన అతిపెద్ద దుస్సంఘటన అది. దాదాపు 200 మంది చనిపోయారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. ఆనాటి దుర్ఘటన తాలూకు పథకాన్ని అర్థం చేసుకుని అదే తరహాలో ఢిల్లీ కారుబాంబ్ బ్లాస్ట్‌కు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. విధ్వంసకారుల ఆలోచనలు అంతకన్నా మంచి దారిలో ఉండే అవకాశం లేదు. కాగా ప్రజల్లో అప్రమత్తత తీసుకురావడం ద్వారా అధిక ప్రాణ, మాన, ఆస్తినష్టాలు లేకుండా చూసుకోగలం. కశ్మీర్‌లోని పహల్గెం సంఘటనలో నేరుగా యాత్రికులపై కాల్పులు జరిపిన దురాగతం తర్వాత ఉగ్రవాదులు ఉన్మాదం ఎలా ఉంటుందో తెలియచేసే ఘటనగా ఈ ప్రేలుడు భావించవచ్చు. ఆత్మాహుతి దాడిగా దర్యాప్తు బృందాలు చెబుతున్నా ఉగ్రవాదానికి పరాకాష్టగా కారు పార్కింగ్‌లో రిమోట్‌తో పేల్చిఉంటారని కూడా అనుమానిస్తున్నారు. దేశంలోని ప్రధాన నగరాలన్నీ ప్రస్తుత దర్యాప్తు బృందాల నిఘా పరిశీలనలో ఉన్నారు. హైదరాబాద్‌లో కూడా ఉగ్రవాదుల మూలాలు లేదా వారి కన్నుసన్నల్లో పనిచేసే స్లీపర్ సెల్స్ ఉంటాయని గత అనుభవాలు చెబుతున్నందున హైదరాబాద్‌లో అనుమానితుల ఇండ్లల్లో పరిసర ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో జల్లెడపడ్తున్నారు. భూటాన్ వెళ్లిన ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీ ఉగ్రకుట్ర మూలాలు కనిపెట్టామని బాధాతప్త హృదయంతో చెప్పారు. ఢిల్లీకి సమీపంలోని ఫరీదాబాద్‌లో 9 మంది ఉగ్రవాదుల్ని 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్నరోజునే ఇలాంటి దుస్సంఘటన జరగడంతో 'ఉగ్ర'కుట్ర తాలూకు సమాచారాన్ని దర్యాప్తు సంస్థలు విశ్లేషిస్తున్నాయి. ఈ భారీ కుట్రకు కారకులై ఉంటారన్న అనుమానితులైన వారిని 3 రాష్ట్రాల్లో 8 మంది ఉగ్రవాదుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే మరో విధమైన కుట్రలు కూడా బయటపడ్డాయి. ఉగ్ర లింకులున్నవారంతా డాక్టర్లే కావడం విచారకరం. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ సయ్యద్ మొహియుద్దీన్ ఇంట్లోనే 'రెసిన్' అనే విషపదార్థాన్ని తయారు చేస్తున్నక్రమంలో పట్టుకున్నారు. మంచినీటి ట్యాంకుల్లో ప్రసాదాల్లో ఈ విషపదార్థాన్ని కలిపి భారీ సంఖ్యలో మనుషుల్ని చంపే పన్నాగంగా పోలీసులకు ప్రాథమిక సమాచారం లభించింది. తాజా పరిస్థితులను బట్టి ఉన్న విద్యావంతుల్లో కొందరు ఉగ్రవాదానికి ప్రోత్సాహకాలుగా బయటికొస్తున్నారు. ఈవిషయం తలుచుకోవడానికి విస్మయం కలిగిస్తోంది. ఒక చోట అత్యంత భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ మరో చోట జరుగకూడదని ఘోరం జరిగిపోయింది. ఇలా ఉగ్రవాదంవైపు ఉన్నత విద్యావంతుల్ని మరలించడమే కాదు. వారే క్రియాశీలకంగా ఉండేట్లు భారత్‌పట్ల శత్రుత్వాన్ని నూరిపోయడంలో ఉగ్రవాద సంస్థలు ఎంతకైనా తెగిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలా భారత్‌లో దొరికిన ఉగ్రవాదులు విద్యాసంస్థలకు ధాతృత్వ సంస్థలనుంచి నిధుల కోసం కృషి చేయడం కొత్త కోణంగా ఆవిష్కృతమైంది. వీరికి పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయో దర్యాప్తు సంస్థలు తేల్చిచెప్పాలి. ఇరు దాయాది దేశాల మధ్య పోరు తప్పించుకోలేక పాలకులే పరోక్షంగా చిచ్చుపెట్టడం క్షమించరానిది.



నలుగురు రావడం ఆరంభం,
నలుగురు సఖ్యతగా కలవడం
అభివృద్ధి, నలుగురు కలిసి
పనిచేయడం విజయం.

జి. ఇలియట్



నైతిక విలువలు విడిచిపెట్టి
పూజచేసినా, జపం చేసినా,
ధ్యానం చేసినా, అది భక్తి కాదు
రాక్షసభక్తి. కనుకనే
రావణాదులు నాశనమయ్యారు.

బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### ఢిల్లీలో పేలుళ్లు అమానుషం

దేశ రాజధాని ఢిల్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలో పార్క్ చేసిన రెండుకార్లలో వరుస పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 9మంది మృతి చెందారు అనేక మంది గాయపడ్డారు పేలుడు ధాటికి పలువురి శరీరాలు ఛిద్రమయ్యాయి. దీంతో ఆప్రాంతంలో భీతావహ దృశ్యాలు అక్కడివారిని కలిచివేశాయి. మరోపక్క మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు. ఢిల్లీ సహా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఉగ్రవాదులు మరో మారు పంజా విసిరారు. మరోమారు ఇలాంటి ఘటనలుజరగకుండా జాగ్రత్త తీసుకోవాలి. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి దాడి ఘటనకు ప్రణాళిక వేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి

పాఠశాలలో ఉన్న సంవత్సరానికి 220 పని దినాలలో ఒక్క రోజు కూడా పిల్లలకోసం లేదు. చాచా నెహ్రు పుట్టిన రోజైననవంబర్ 14న బాలలదినోత్సవంగా జరుపుకుంటాం. కానీ ఆ రోజుకూడా పాఠాలు రోజూ లాగే చెప్పుకుంటూ ఉంటాం. కనీసం సంవత్సరంలో ఒక్క రోజు కూడా ఆటలు, పాటలు కోసం వినియోగించము. పిల్లలు ఉన్న పాఠశాలలో రకరకాల దినోత్సవాలపేరుతో పిల్లలు, పాఠశాల సమయం వృధాచేస్తాం. పిల్లలకు సృజనాత్మక అంశాలతో కూడిన ఎజండా విడుదల చేయాలి. అంతేకాకుండా ప్రతీ సంవత్సరం పిల్లల పండుగ కడు రమ్యంగా జరిగేటట్లు చూడాలి. దీనికోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలి. పిల్లలు పండుగ నాడు పిల్లలు నచ్చే మెచ్చే అంశాలనే అమలు పరచాలి.

- రాళ్లబండి సంగం నాయుడు, విజయనగరం

### మారుతున్న విలువలు

ఇటీవలికాలంలో పట్టణ ప్రాంతాల్లో 'లివింగ్ రిలేషన్‌షిప్' అనే ధోరణి వేగంగా విస్తరిస్తోంది. వివాహం చేసుకోకుండానే ప్రేమజంట కలిసి జీవించడం అనే ఈ విధానం పాశ్చాత్య ప్రభావంతో మన సమాజంలో స్థిరపడుతోంది. కొందరు దీన్నిస్వేచ్ఛా జీవనానికి ప్రతీకగాచూస్తే, మరికొందరుసాంప్రదాయ విలువలకువ్యతిరేకంగా భావిస్తున్నారు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రజలతో ఉన్నవారికే నాయకత్వ పగ్గాలు

న్యూయార్క్ నగరానికి పిన్నవయస్కుడైన జోహ్రాన్ మందానీ ఎన్నిక కావడం చాలా కోణాల్లో శుభ సంకేతం. అంతే కాదు ఒక కొత్త చరిత్ర. వందేళ్ల తర్వాత అతి తక్కువ వయసులో ఎన్నికైన 34ఏళ్ల ఆయువకుడు ట్రంప్ విధానాలకు వ్యతిరేకం. దక్షిణాసియా మూలాలు, ఇంకా చెప్పాలంటే భారత మూలాలు కలిగి ఆ నగరంలో అత్యున్నత పదవికి ఎన్నికైన మొదటి వ్యక్తి. అక్కడి వాళ్లు ద్వేషించక పోయినా, అంతగా ఇష్టపడని మతానికి చెందినవ్యక్తి. సంపన్నులు, పెట్టుబడి దారులు శాసించే రాజకీయ రంగంలో నిలదొక్కుకున్న సాధారణ పౌరుడు. ఇన్ని విశేషాలతో గెలవడమేకాదు ఆయన ఎన్నికైతే ఫెడరల్ నిధుల్ని న్యూయార్క్ అందనివ్వనని ప్రస్తుత అధ్యక్షుడు, ప్రత్యర్థి పార్టీ పెద్ద, ట్రంప్ నేరుగా భయపెట్టినా ప్రజామోదం పొందిన నాయకుడు. ఆయన గెలుపుతో అమెరికా పౌరసమాజం ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పదనాన్ని మరోమారు చాటింది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### మితిమీరిపోతున్న వ్యక్తిగత దూషణలు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ముఖ్యమైన మూడు పార్టీలు అనగా రూలింగ్ కాంగ్రెసు, బి.జె.పి, బి.ఆర్.ఎస్. తీవ్రంగా తమ పార్టీ నిలబెట్టిన అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించారు. గెలుపు తమదే అని ధీమాగా ప్రకటనలు చేసారు. తమస్తోమత కొలది ఓటర్లకు డబ్బు పంచారని కూడా వార్తలొచ్చాయి. ఈదేశంలో ఓటర్లను కొనకపోతే గెలుపు అసంభవమని అందరికి తెలిసిందే. ముఖ్యంగా ప్రజలను కలవరపరుస్తున్నదీ, అర్థంకానిది మరొకటున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారేమంటారంటే బిజెపి కిషన్‌రెడ్డి బిఆర్ఎస్ కెటిఆర్ బ్యాడ్ బ్రదర్స్ అని అంటే కెసిఆర్ గారు రేవంత్ రెడ్డిలు బ్యాడ్ బ్రదర్స్ అని కిషన్ రెడ్డి గారంటారు. ఇకపోతే హరీష్ రావు గారి ఉవాచ ఏమంటే రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి గారిది ఫెవికాల్ బంధమట.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం

ప్రస్తుతం ఉన్న డిగ్రీ, పీజీ సిలబస్‌లో కాలానికి అనుగుణమైన మార్పులు అత్యవసరమయ్యాయి. ఉద్యోగ మార్కెట్ పెద్దఎత్తున మారిపోయింది. పరిశ్రమలు నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కోరుతున్నాయి. విద్యార్థి పుస్తక జ్ఞానంతోబయటకువస్తున్నాడు. ప్రభుత్వం ముందుగా పరిశ్రమ–విద్యా సంస్థల అనుసంధాన విధానాన్ని బలోపేతం చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రైల్వే సంస్కరణల ముసుగులో వ్యాపార ధోరణి!

*రిజర్వేషన్ పొందలేక రైలుబోగీలలో కిటకిటలాడే జనాలు, టికెట్ రేట్ల భారంతో వెనక్కు వెళ్లే విద్యార్థులు, స్టేషన్‌లో తాగునీరు లేదా టాయిలెట్ లేని పరిస్థితుల్లో ప్రయాణించే గ్రామీణ ప్రజలు ఇవన్నీ కేంద్రప్రభుత్వం గర్వంగా చెప్పుకునే 'అమృత్ కాలం'కి విరుద్ధమైన దృశ్యాలు. అంతిమంగా చెప్పాలంటే, రైల్వే సంస్కరణలు అవసరమే, కానీ అవి సేవాధోరణిని నశింపచేయకుండా ఉండాలి. స్లీపర్ కోచ్‌లు తగ్గించడం, ధరలు పెంచడం, ప్రైవేటీకరణ పెరగడం ఇవన్నీ ప్రజా సేవకుబదులు లాభదాయక వ్యాపారం వైపు తీసుకెళ్తున్న సూచనలు. ప్రజల విశ్వాసం కోల్పోతే రైల్వే గాడి తిరగదు. రైల్వేలు భారత ప్రజాస్వామ్యపు ఇనుపనాడి. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు నిజంగా అభివృద్ధి దిశగా నడుస్తున్నాయా లేక ప్రజల సేవా దిశ నుండి తప్పిపోయాయా అనే ప్రశ్నకు సమాధానం ఇప్పుడు ప్రజల అనుభవంలోనే దాగి ఉంది. రైల్వే చక్రం గిరికీడుతూ ఉండాలంటే, దాని దిశ ప్రజల వైపు ఉండాలి, లాభాల వైపు కాదు.*

అప్పన్న గొనప

భారత రైల్వేలు దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రాణాధారంగా శతాబ్దాలుగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న సంస్థ. ప్రతి రోజు సుమారు 2.3 కోట్ల మంది రైలు ద్వారా ప్రయాణం చేస్తారు. 1853లో ప్రారంభమైన ఈ వ్యవస్థ దేశ ఐక్యత, చౌకైన ప్రయాణం, గ్రామీణ ప్రగతి, కార్మిక జీవనాధారం వంటి అనేక రంగాలకు మూలస్థంభంగా నిలిచింది. కానీ గత పదేళ్లుగా కేంద్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న 'సంస్కరణలు' రైల్వే వ్యవస్థను వాణిజ్యపరమైన దిశలో మలుస్తూ, సామాన్య ప్రజల సేవల నుండి దూరం చేస్తున్నాయన్న అభిప్రాయం పెరుగుతోంది. 'సంస్కరణ' అనే పదం ఆచరణలో సాంకేతికత, సమర్థత, పారదర్శకతను సూచించాలి. కానీ భారత రైల్వేల్లో ఆ పదం ప్రస్తుతం 'ప్రైవేటీకరణ'కు సమానార్థకమైపోయింది. ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్ ఆత్మను దెబ్బతీస్తూ, రైల్వే వ్యవస్థను కార్పొరేట్ దిశగా నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్ణయాలు చూపుతున్నాయి. టికెట్ ధరల పెరుగుదల, సాధారణ స్లీపర్ కోచ్‌ల సంఖ్య తగ్గించడం, రిజర్వేషన్ సౌకర్యాల కఠినతరం, ప్రైవేట్ భాగస్వామ్యాల విస్తరణ ఇవన్నీ సాధారణ ప్రజలకు ప్రతికూలంగా మారాయి. గత 10ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే, 2014లో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ ట్రైన్‌లలో స్లీపర్ కోచ్‌ల సంఖ్య సుమారు 47,000 ఉండగా, 2024నాటికి అది 38,000కు తగ్గింది. అదే సమయంలో ఎయిర్‌కండిషన్ (ఎసి) కోచ్‌ల సంఖ్య 19,000 నుండి 32,000కు పెరిగింది. అంటే సామాన్యుడు ఉపయోగించే స్లీపర్ సీట్లు 20శాతం తగ్గి, ధనవంతులకు అనువైన ఎసి సీట్లు 68 శాతం పెరిగాయి. వందే భారత్, తేజస్, బుల్లెట్ ట్రైన్ వంటి లగ్జరీ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం ఈ మార్పుకు కారణమైంది. ఇది 'సబ్కా సాత్ సబ్కా వికాస్' అనే నినాదానికి విరుద్ధంగా ఉంది. రైల్వే బడ్జెట్ 2017లో సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం కూడా పారదర్శకతను దెబ్బతీసింది. అప్పటి నుండి రైల్వే ఆదాయం, ఖర్చులు, సామాజిక సేవా రాయితీలపై స్వతంత్ర చర్చలు జరగడం తగ్గిపోయాయి. కంప్ట్రోలర్ ఆడిటర్ అండ్ జనరల్ (కాగ్) నివేదిక ప్రకారం, ప్యాసింజర్ సేవల నుండి వచ్చేఆదాయం మొత్తం రైల్వేరాబడిలో 2014లో 43శాతం ఉండగా, 2023లో అది 29శాతానికి పడిపోయింది. ఫ్రైట్ (సరకు రవాణా) ఆదాయం 63శాతానికి పెరిగింది. అంటే రైల్వేలు ప్రజా రవాణా కంటే వాణిజ్య రవాణాపైనే దృష్టి పెట్టాయి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్టేషన్ రీ డెవలప్మెంట్' 'రైల్‌పీఎస్‌యూ మోనిటైజేషన్', ప్రైవేట్ ట్రైన్ ఆపరేటర్ స్కీమ్' వంటి సంస్కరణలు ప్రజా సేవల కంటే ఆదాయ వనరుల పెంపుపై ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. సుమారు 150 ట్రైన్‌రూట్లు ప్రైవేట్ ఆపరేటర్లకు ఇవ్వాలన్న ప్రణాళిక ఉండగా, వాటి టికెట్ ధరలు ప్రస్తుత సాధారణ రేట్లకంటే 25-35 శాతం ఎక్కువగా ఉండేఅవకాశం ఉంది. ఇక స్లీపర్ కోచ్‌ల తగ్గింపు వల్ల గ్రామీణ మధ్యతరగతి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐఆర్‌సిటిసి డేటా ప్రకారం, 2023-24 సంవత్సరంలో రిజర్వేషన్ వేటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల సంఖ్య 4.2 కోట్లకు చేరింది. ఈసంఖ్య 2015లో 2.8కోట్లుగా ఉండేది. అంటే సీట్లు తగ్గి, డిమాండ్ పెరిగిపోయింది. పేద ప్రజలు



తక్కువ ధరలో ప్రయాణించే అవకాశం కోల్పోతున్నారు. డైనమిక్ ప్రైసింగ్ విధానం(విమాన టికెట్‌ల తరహా చార్జీలు) కూడా సాధారణ ప్రజల భారం పెంచుతోంది. ఒకే రైలులో ఒకే కోచ్‌కి భిన్నమైన ధరలు వసూలు చేయడం వల్ల పేద ప్రయాణికులు వెనక్కు తగ్గుతున్నారు. సీనియర్ సిటిజన్, విద్యార్థులు, రోగులు వంటి వర్గాలకు ఇచ్చే కన్సెషన్‌లు కూడా 2020తర్వాత నిలిపివేయబడ్డాయి. గణాంకాల ప్రకారం, 2019లో 11.5 కోట్లమంది కన్సెషన్ పొందగా, 2023లో అది2.3కోట్లకు పడిపోయింది. మరోవైపు, ఉద్యోగ నియామకాల తగ్గింపు కూడా గమనార్హం. 2015లో రైల్వేలో 15.3 లక్షల మంది పనిచేస్తుండగా, 2024లో అది 12.5 లక్షలకు తగ్గింది. సుమారు 3లక్షల ఉద్యోగాలు 'నాన్‌క్రిటికల్' పేరుతో రద్దుఅయ్యాయి. స్థానంలో అవుట్‌సోర్సింగ్ పెరిగింది. ఈ చర్యలు భద్రతా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. 2023లో రైల్వే ప్రమాదాలసంఖ్య 275 కాగా, 2014లో అది160 మాత్రమే. అంటే భద్రతా అంశాలు సాంకేతిక సంస్కరణల వెనుక మరిచిపోతున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న 'వందే భారత్' ప్రాజెక్ట్‌లు దేశవ్యాప్తంగా 100రైళ్లు నడుస్తు న్నాయి. కానీ వీటిలో ప్రయాణించే వారిలో 90శాతం మంది మధ్యతరగతికి పైబడినవారు. సాధారణ స్లీపర్ ప్రయాణి కులు వీటికి దూరంగా ఉన్నారు. ఆ రైళ్ల టికెట్ ధరలు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లకంటే సగటున 60శాతం ఎక్కువగా ఉన్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం, సికిందరాబాద్ నుండి విశాఖపట్నం వందే భారత్ సీటు ధర రూ.1640 ఉండగా, అదే మార్గంలోని సాధారణ రైలు స్లీపర్ టికెట్ రూ.460 మాత్రమే. ఈ వ్యత్యాసం కేంద్ర ప్రభుత్వ రైల్వే విధానదిశను స్పష్టంగా తెలియజేస్తుంది. ప్రభుత్వం 'సంస్కరణలు' పేరుతో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల సామాన్యుడు రైలు ప్రయాణం నుండి క్రమంగా దూరమవుతున్నాడు. నేషనల్ సాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) 2023 గణాంకాల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల 62శాతం ప్రజలు రైల్వేబదులు బస్సులు లేదా ఇతర వాహనాలను ఎంచుకుంటున్నారు. 2014లో ఆ సంఖ్య 41 శాతం మాత్రమే. కారణాలు -టికెట్ ధరలు, సీట్లులభించకపోవడం, ఆన్‌లైన్ సాంకేతిక అడ్డంకులు, సౌకర్యాల లేమి. భద్రత పరంగాకూడా పరిస్థితి ఆందోళనకరం. సిగ్నల్ మానిటరింగ్, పాయింట్ మెషిన్ మెయింటెనెన్స్ వంటి విభాగాల్లో సిబ్బంది తగ్గిపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ, ప్రైవేట్ కంపెనీ లకు మెయింటెనెన్స్ కాంట్రాక్టులు ఇవ్వడం భద్రతా ప్రమాణాలను మరింత ప్రమాదంలో పడేస్తోంది. ఇక స్టేషన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల పేరుతో ప్రధాన నగరాల్లోని రైల్వే భూములను వాణిజ్య అవసరాల కోసం కేటాయించడం జరుగుతోంది. న్యూఢిల్లీ, ముంబై, లక్నో వంటి నగరాల్లో రైల్వే భూముల విలువ రూ.2.3 లక్షల కోట్లుగా అంచనా వేయబడగా, వాటిలో పెద్దభాగం కార్పొరేట్ ఒప్పందాలకు కేటాయించబడింది. ఈ విధమైన సంస్కరణలు రైల్వేలను ప్రజా సేవారంగం నుండి 'రెవెన్యూ జనరేటింగ్ కార్పొరేట్ మోడల్"గా మార్చుతున్నాయి. ఇన్ని మార్పుల మధ్య సామాన్యుడు ఎదుర్కొంటున్న దైనందిన ఇబ్బందులు ప్రభుత్వ దృష్టికి రావడం లేదు. రిజర్వేషన్ పొందలేక రైలుబోగీలలో కిటకిటలాడే జనాలు, టికెట్ రేట్ల భారంతో వెనక్కు వెళ్లే విద్యార్థులు, స్టేషన్‌లో తాగునీరు లేదా టాయిలెట్ లేని పరిస్థితుల్లో ప్రయాణించే గ్రామీణ ప్రజలు ఇవన్నీ కేంద్రప్రభుత్వం గర్వంగా చెప్పుకునే 'అమృత్ కాలం'కి విరుద్ధమైన దృశ్యాలు. అంతిమంగా చెప్పాలంటే, రైల్వే సంస్కరణలు అవసరమే, కానీ అవి సేవాధోరణిని నశింపచేయకుండా ఉండాలి. స్లీపర్ కోచ్‌లు తగ్గించడం, ధరలు పెంచడం, ప్రైవేటీకరణ పెరగడం ఇవన్నీ ప్రజా సేవకుబదులు లాభదాయక వ్యాపారం వైపు తీసుకెళ్తున్న సూచనలు. ప్రజల విశ్వాసం కోల్పోతే రైల్వే గాడి తిరగదు. రైల్వేలు భారత ప్రజాస్వామ్యపు ఇనుప నాడి. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు నిజంగా అభివృద్ధి దిశగా నడుస్తున్నాయా లేక ప్రజల సేవా దిశ నుండి తప్పిపోయాయా అనే ప్రశ్నకు సమాధానం ఇప్పుడు ప్రజల అనుభవంలోనే దాగి ఉంది. రైల్వే చక్రం గిరికీడుతూ ఉండాలంటే, దాని దిశ ప్రజల వైపు ఉండాలి, లాభాల వైపు కాదు. •

# వీధి కుక్కల నియంత్రణలో నెదర్లాండ్స్ ఆదర్శం

బసవరాజు నరేవీదర్ రావు

ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల వీధి కుక్కలున్నట్టు తెలుస్తున్నది. వీటివల్ల సంక్రమించే ప్రమాదకరమైన రేబీస్ వ్యాధి ప్రతియేటా వేలాది మందిని బలికొంటున్నది. అందువల్ల వీధి కుక్కల నియంత్రణ పలుదేశాలకొక ప్రధాన సమస్యగా పరిణమించింది. ప్రపంచంలోని దేశాలన్నీ పౌరులమీద వీధికుక్కల దాడులతో తల్లడిల్లుతన్నా , ఒక్క దేశంలో మాత్రం వీధుల్లో వీధికుక్కలు కనిపించవు. అందువల్ల కుక్కకాటు బాధితులు ఆ దేశంలో మచ్చుకయినా కనిపించరు. దీనివల్ల వీధికుక్కల సంపూర్ణ నియంత్రణలో విజయం సాధించిన తొలిదేశంగా గుర్తించబడిందా దేశం. ఆ దేశమే యూరప్‌లోని నెదర్లాండ్. అయితే ఈవిజయం ఆ దేశంలో ఒక్క రోజులో రాలేదు. దశాబ్దాలుగా ఆదేశ ప్రభుత్వాల కృషి ఈ విజయం వెనుక దాగివుంది. అంతేకాదు ఆదేశ జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ కృషికి అండగా నిలిచారు. వాస్తవంగా 18, 19 శతాబ్దాల్లో నెదర్లాండ్ సంపన్న కుటుంబాల్లో పెంపుడు కుక్కలని హోదాకు చిహ్నంగా భావించేవారు. అందువల్ల ప్రతి సంపన్న కుటుంబం కొన్ని కుక్కలని పెంచుకొనేది. అయితే 19వ శతాబ్దంలో ఆ దేశంలో కుక్కల్లో రేబీస్ వ్యాధి ప్రబలింది. దీనితో భయపడ్డ కుక్కల యజమానులు అన్నేళ్ళుగా తాము అల్లారు ముద్దుగా పెంచుకొన్న పెంపుడు కుక్కలని వీధుల్లోకి తరిమారు.. ఈ కుక్కల్లో చనిపోయేవి చనిపోగా బ్రతికిన కుక్కలు తమ సంతతని వీధికుక్కలుగా విపరీతంగా పెంచుకొన్నాయి. ఒక ఆడకుక్క ఏడాదికి పది పిల్లలని సృష్టిస్తూ అయిదు సంవత్సరాల్లో తనకుటుంబాన్నిఅయిదువేలకు పెంచుతుంది. అందువల్ల సరైన ఒక విధానం, దానితోపాటే నిరంతర కృషి వుండాలని నెదర్లాండ్ ప్రభుత్వం భావించింది. దానికనుగుణంగా కార్యాచరణ కొనసాగింది. వివిధ వర్గాలనుండి సూచనలు సేకరించిన ప్రభుత్వం చివరగాఈ సిఎన్‌విఆర్ పద్ధతిని తన విధానంగా మార్చుకొంది. వివరంగా చెప్పాలంటే, మొట్టమొదట వీధి కుక్కలని పట్టుకొని సంరక్షణ గృహాలకు తరలిస్తారు, రెండవ దశలో శస్త్ర చికిత్స ద్వారా వాటికి కుటుంబ నియంత్రణ చేస్తారు. మూడవ దశలో వాటికి వ్యాధులు సోకకుండా టీకాలు ఇస్తారు. ఆ తరువాత వాటిని ఎక్కడినుండి తెచ్చారో అక్కడే వదిలి పెడతారు. ఈ విధానం పాటించడంతో నెదర్లాండ్‌లో వీధికుక్కల నియంత్రణ సంపూర్ణ విజయవంతమైంది. నెదర్లాండ్ విధానాన్ని పరిశీలించిన వివిధ దేశాలు తమ దేశాల్లో కూడా ఈ విధానాన్ని అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక మన దేశ విషయానికొస్తే మన దేశంలో 1.53కోట్ల వీధి కుక్కలున్నాయని, వీటివల్ల సంక్రమించే రేబీస్‌తో20వేలమంది మరణిస్తున్నారని తెలుస్తున్నది. ప్రత్యేకంగా మన రాష్ట్రమ్లో 5.5 లక్షల వీధికుక్కలున్నట్టు,, వీటవల్ల రేబిస్ సోకిపదుల సంఖ్యల్లో పౌరులు మరణిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. మనకేంద్ర ప్రభుత్వం ఈవిషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ వీధికుక్కల నియంత్రణకు తగు చర్యలని చేపట్టాల్సిన అవసరముంది. అంతేకాదు అవసరమనిపిస్తే అమాత్యులతో కూడిన ఒక అధికారుల బృందాన్ని నెదర్లాండ్ పంపించి, ఆ ప్రభుత్వం అనుసరించిన విధానాలను పరిశీలించి, వాటిని మన దేశంలో అమలు పరిచి వీధి కుక్కలను నియంత్రించాల్సిన అవసరముంది. •

# 'న్యూ మల్టీ పోలార్ వరల్డ్' ఇక అసాధ్యమేనా?

సుంకవల్లి సత్తిరాజు

భారత్ పై అమెరికా వత్తిళ్లు పని చేస్తున్నాయా? అంటే కొన్నిసార్లు అవునని, మరికొన్ని సార్లు కాదనే సమాధానం మనకు లభిస్తుంది. అమెరికా భారత్‌పై ఇప్పటికే వాణిజ్య సుంకాలు పెంచి, వీసా నిబంధనలు కఠినతరం చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై విదేశాల్లోనే కాకుండా స్వదేశంలో కూడా తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. ఇటీవల యు.ఎస్‌లోని రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లోను, ఆర్థిక రాజధాని న్యూయార్క్ మేయర్ ఎన్నికలోను రిపబ్లికన్ పార్టీ చిత్తుగా ఓడిపోవడమే ఇందుకు నిదర్శనం. అయినా ట్రంప్ ధోరణిలో మార్పు రావడం లేదు. అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేయడానికి మరో పర్యాయం అవకాశం లేనందున తనకు ఇదే ఆఖరి అవకాశంగా భావించిన ట్రంప్ తన అహాన్నిబలంగా ప్రదర్శిస్తూ, నియంతలా వ్యవహరిస్తున్నాడు. ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చుతూ, యుద్ధ సమయాల్లో తనకు అనుకూలమైన దేశాలకు ఆర్థిక, ఆయుధ సహాయం చేస్తూ అమెరికా ఆర్థికంగా నష్టపోతున్న మాట వాస్తవం. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధానికి అప్పటి జోబైడెన్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వమే కారణం. రష్యా సమగ్రతను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని రెచ్చగొట్టి, భారీగా ఆయుధాలను సరఫరా చేసి, ఆర్థిక సహాయం చేసి రోజుల్లో ముగుస్తుందనుకున్న యుద్ధాన్ని సుదీర్ఘ కాలం కొనసాగేలా చేసిన అమెరికా ప్రస్తుతం శాంతి ప్రవచనాలు వల్లించడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా బహు విచిత్రంగా ఉంది. రష్యా ఉక్రెయిన్ దేశాలు ఈ యుద్ధంలో అపారమైన ప్రాణనష్టం చవిచూస్తున్నాయి. వేలాది మంది పౌరులు, సైనికులు మరణించినట్టు కొన్ని నివేదికలు సూచిస్తున్నా లక్షలాది మంది పౌరులు, సైన్యం ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఊహించిన దానికంటే భారీ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించిన దాఖలాలు కనబడుతున్నాయి. ఈ పాపం అమెరికాదే. అమెరికా జోక్యం లేకపోతే ఈ యుద్ధం ఎప్పుడో ముగిసిపోయేది. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరాలనుకోవడం, అందుకు అమెరికా, నాటో దేశాలు వత్తాసు పలకడమే ఇంతటి విధ్వంసానికి కారణం. తన పొరుగునున్న ఉక్రెయిన్‌లోకి నాటోదేశాలు ప్రవేశిస్తే, అది రష్యా సమగ్రతకు, సార్వభౌమత్వానికి పెను ప్రమాదమన్న విషయం అమెరికా, ఉక్రెయిన్ దేశాలకు తెలియదా? ఇందుకు రష్యా అంగీకరించి మిన్నకుంటుందా? అందుకే రష్యా, ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగింది. అయితే రష్యా, ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా రష్యాతోసహా పలు ప్రపంచదేశాలు మొదట్లో భావించాయి. అయితే అమెరికా, నాటో దేశాల సహాయంతోనే ఉక్రెయిన్ ఇంతకాలం బలమైన ఆయుధ సంపత్తి గల రష్యాను ధీటుగా ఎదుర్కొంటున్నది. ఈయుద్ధాన్ని ట్రంప్ మొదటి నుండి వ్యతిరేకిస్తున్న మాట వాస్తవం. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కూడా ట్రంప్ తాను అధికారంలోకి వస్తే యుద్ధాన్ని క్షణాల్లో ఆపేస్తానని ప్రకటించారు. అయితే ట్రంప్ వాగ్దానం ఇప్పటికీ ఆచరణకు నోచు



కోలేదు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు పట్టువిడుపులు లేకుండా యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ విషయంలో ఉభయ దేశాలు ట్రంప్ మాటను పెడచెవిన పెట్టి మారణహోమం కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధానికి ఆజ్యం పోసిన అమెరికా ఇప్పుడు భారత్‌ను నిందిస్తూ, భారత్‌పై వాణిజ్య సుంకాలను భారీగా పెంచుతూ, రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని హెచ్చరించడంలో హేతుబద్ధత లేదు. చైనా తర్వాత రష్యా చమురుకు భారత్ పెద్ద దిగుమతిదారుగా ఉంది. ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడినా, రష్యా భారత్‌కు తక్కువ ధరకే చమురును ఎగుమతి చేస్తున్నది. రష్యాతో భారత్‌కు చిరకాల వాణిజ్య, దౌత్యపరమైన సన్నిహిత సంబంధాలున్నాయి. రష్యాతోగల వ్యూహాత్మక రక్షణ, సాంకేతిక ఒప్పందాలు భారత్‌కు ఎంతగానో సాయపడుతున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ప్రదర్శించిన సైనిక, వైమానిక, సాంకేతిక వ్యూహాలకు పాక్ బెంబేలెత్తిపోయింది. పాక్‌కు అమెరికా సరఫరా చేసిన ఆయుధాలు కూడా ఎందుకూ కొరగాకుండా పోయాయి. పటిష్టమైన భారత్ రక్షణవ్యవస్థను చూసి అమెరికా కూడా ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే భారత్ రష్యాల మధ్య స్నేహసంబంధాలను విచ్ఛిన్నం చేయడానికి అమెరికా కుట్రలు పన్నుతున్నది. ఈప్రయత్నాల్లో భాగమే భారత్‌పై సాగిస్తున్న ట్రేడ్‌వార్, వీసా ఆంక్షలు. కెనడా కూడా అమెరికా బాటలోనే పయనిస్తూ, భారతీయులకు స్టడీ పర్మిట్లను భారీగా తగ్గించింది. ఆస్ట్రేలియాలోకూడా భారతీయులకు వ్యతిరేకంగా ఇటీవల పెద్ద ర్యాలీ జరిగిన సంగతి విదితమే. అమెరికా వత్తిడికి తలొగ్గిమరికొన్ని దేశాలు భారత్ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించాలని చూస్తున్నా, భారత్‌తో వాటికున్న వాణిజ్య అవసరాల రీత్యా వెనకడుగు వేస్తున్నాయి. అయితే అమెరికా మాత్రం మాటల్లో భారత్‌ను గొప్ప దేశం, మిత్ర దేశం అంటూ ప్రశంసిస్తూనే భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నంలో భాగమే రష్యాతో భారత్‌కు గల సంబంధాలను దెబ్బతీయడం. రష్యా వద్ద చమురు కొనుగోలు చేయవద్దనే అమెరికా ప్రయత్నం ఫలిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు భారత్ ఆయిల్ కంపెనీలు రష్యా నుండి క్రూడాయిల్ దిగుమతులను తగ్గించుకుంటున్నాయి. ఈ ఏడాది చివరికల్లా రష్యా నుండి భారత్ కు ఆయిల్ దిగుమతులు భారీగా తగ్గే అవకాశముంది. ఈ సంఘటనతో పాకిస్థాన్‌ను ఎదిరించినట్టుగా అగ్రరాజ్యమైన అమెరికాను భారత్ ఎదురించే సాహసం చేయబోదన్న వాస్తవం నిరూపితమైనది. అమెరికాతో గల సహజమైన మైత్రి, వాణిజ్య సంబంధాల దృష్ట్యా భారత్ ఏరికోరి ఇబ్బందులు కొనితెచ్చుకోలేదు. ఈ కారణంగానే అమెరికా పట్ల భారత్ గట్టిగా వ్యవహరించడం లేదన్నది వాస్తవం. ఇక 10 దేశాల సభ్యులతో కూడిన 'బ్రిక్స్ కూటమి'కూడా అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకురాలేదనే వాదన కూడా నిజమే. చైనా తన దేశ కరెన్సీ యువాన్ విలువ పెంచుకోవాలని, అమెరికా డాలర్ విలువను తగ్గించాలని ప్రయత్నిస్తున్నా భారత్ చైనాతోకలిసి ఈ సాహసం చేయబోదనే చెప్పాలి. అమెరికా జిడిపి (30.6 ట్రిలియన్ డాలర్లు)భారత్ జిడిపి (4.19ట్రిలియన్ డాలర్లు)తో పోల్చి చూస్తే సుమారు ఏడు రెట్లు అధికం. ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగినప్పటికీ2047వరకు అమెరికా ఆర్థిక వ్యవస్థను చేరుకోవడం భారత్‌కు అసాధ్యం. భారత్ కంటే అనేకవిషయాల్లో ముందంజలో ఉన్న అమెరికా ప్రస్తుతం పాక్‌తో అంటకాగుతూ భారత్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించడం హాస్యాస్పదం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగాపని చేసే అమెరికా తన స్వప్రయోజనాల కోసం పాక్‌నుచేరదీయడం అత్యంత ప్రమాదకరం. ఇటీవల రష్యా, భారత్, చైనాలు అమెరికాకు ధీటుగా బలమైన ప్రత్యామ్నాయం కాగ లవన్న నమ్మకంఏర్పడినా, భారత్ చైనాలు ఒకరినొకరు విశ్వ సించే పరిస్థితులు లేనందున ప్రపంచదేశాలు ఆశించే న్యూ మల్టీ పోలార్ వరల్డ్ ఒకమిథ్యగా మిగిలే అవకాశాలే అధికం. •

# 'ఉగ్ర'కార్యకలాపాలకు అడ్డాగా 'అల్‌ఫలా'



## ఢిల్లీ పేలుడుకు బాధ్యులుగా అనుమానిస్తున్న ముగ్గురు వైద్యులు ఆ వర్సిటీ వారే

### జైష్ ఏ మహమ్మద్ మహిళా విభాగం కమాండర్‌గా డాక్టర్ షహీన్ షహీద్

**హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ కారు బాంబు పేలుడు తరువాత హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్‌ఫలా యూనివర్సిటీ పేరు మీడియాలో పతాక శీర్షికలకు ఎక్కింది. కారు బాంబు పేలుడులో అనుమానితులుగా వున్న ముగ్గురు వైద్యులు (ఇ ందులో ఒకరు మహిళ వుంది) ఈ వర్సిటీలో వైద్యులుగా పనిచేస్తున్న వారు కావడం గమనార్హం. వీరిలో డాక్టర్ ముజమిల్ షకీల్, డాక్టర్ ఉమర్ మ హమ్మద్‌లు కాశ్మీర్‌కు చెందిన వారు కాగా మహిళా వైద్యురాలు షహీన్ షహీద్ యుపిలోని లక్నోకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఈ యూని వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్ సమీపంలోని దౌజా గ్రామంలో రెండు గదులను అద్దెకు తీసుకుని అందులో ఐఈడీ బాంబుల తయా రీకి వాడే అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థం 2950 కిలోలను నిలువ వుంచడం సంచలనం రేపింది. ఈ పేలుడు పదార్థంతో పాటు కొన్ని టై మర్లను, ఇంకొన్ని వస్తువులను ఢిల్లీ, హరియాణా పోలీసులు సోమవారం పట్టుకోవడం తెలిసిందే. ఇతనికి కాశ్మీర్‌కే చెందిన సహచర వైద్యుడు ఉమర్ మహమ్మద్ సహకరిస్తున్నట్లు తేలింది. వీరిద్దరికి తోడుగా మహిళా వైద్యురాలు షహీన్ షహీద్ కూడా సహకరిస్తోందని పోలీసులు తేల్చారు. పాక్ కేం ద్రంగా పనిచేస్తున్న నిషిద్ధ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహమ్మద్ మహిళా విభాగానికి షహీన్ షహీద్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తి ంచారు. ఆపరేషన్ సింధూర్ తరువాత జైష్ ఏ మహమ్మద్ భారత్‌లో తమ కార్యకలాపాల విస్తరణ కోసం మహిళలను రంగంలో దించుతున్నట్లు ప్ర కటించడం తెలిసిందే. ఇందులో ఆ సంస్థ అధినేత మసూద్ బంధువులు కూడా వున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే భారత్‌లో ఉగ్ర కార్యకలాపాలకు తొలిసారిగా ఒక మహిళను ఆ సంస్థ కమాండర్‌గా నియమించిందని పోలీసులు భావిస్తున్నాయి. వైట్ కలర్ టెర్రర్ మాడ్యూల్‌లో వైద్యులతో పాటు వైద్య విద్యా ర్థులను, పారా మిలటరీ సిబ్బందిని ఉగ్రవాదు లుగా తయారు చేయడం కోసం జైష్ ఏ మహమ్మద్ నిర్ణీ త కాల వ్యవధిని నిర్ణయిం చుకుని పనిచేస్తున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. ఇందుకు జైష్ ఏ మహమ్మద్ ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా వర్సి టీని అడ్డాగా మార్చుకుందని పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ సహా దేశ వ్యాప్తంగా పేలుళ్లకు జైష్ ఏ మహ మ్మద్ కుట్రలు పన్నగా వాటిని భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. ఈ సందర్భంగానే తొలిసారిగా ఉగ్ర కుట్రలో వైద్యుల పాత్ర వెలుగు చూసింది. ఐఎస్ఐ ఉగ్ర వాదుల కుట్రలో ఇప్పటి వరకు వైద్యులు నేరుగా పాలుపంచుకున్న దాఖ లాలు లేక పోవడం గమనా ర్హం. తాజాగా వెలు గు చూసిన కుట్రలో ఒక మహిళా వైద్యురాలితో పాటు ముగ్గురు వైద్యులు వుండడం, వీరంతా ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా వర్సిటీలో ఉద్యోగులు కావడంతో పోలీసులు, ఎన్ఐఎ అధికారులు అక్క డికి చేరుకుని అనుమానిత అధికారులను, వైద్యు లు, ఇతర సిబ్బందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించ సాగారు.

**పేలుడు జరిగిన కారు ఢిల్లీలో ఎక్కడెక్కడ తిరిగిందంటే:** ఇదిలావుండగా ఢిల్లీలో సం భవించిన కారు బాంబు పేలుడుకు కారణమైన ఐ 20 కారు సోమవారం నాడు ఎక్కడెక్కడ తిరిగిందనే దానిపై పోలీసు లు మంగళవారం వివరాలు విడుదల చేశారు. ఉదయ ం ఎనిమిది గంటలకు ఢిల్లీ శివార్లలోని బదర్పూర్ టోల్ బూత్ నుంచి ఢిల్లీలోకి ఎంట్రీ ఇచ్చి ంది. మధ్యాహ్నం 3.19 గంటలకు ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో వచ్చింది. సాయంత్రం 6.22 గంటలకు అక్కడి నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో కారులో కాశ్మీర్‌లోని పుల్వామకు చెందిన వైద్యుడు ఉమర్ నబీ వున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సాయంత్రం 6.52 గంట లకు మెట్రో స్టేషన్ సమీపంలో గల సిగ్నల్ వద్ద నెమ్మదిగా కదులుతూ భారీ శబ్దంతో పేలి పోయింది. ఈ పేలుడులో కారులో వున్న వ్యక్తితో పాటు మొత్తం 12 మంది మరణించారు. మృతుల్లో కారులో వున్న వ్యక్తి ఉమర్ నబీగా భావిస్తున్నారు. ఇతన్ని గుర్తించేందుకు డిఎన్ఎ పరీక్ష నిర్వహించా రు. కాగా ఈ కారు నంబర్‌ను హెచ్ఆర్ 26సిఈ 7674గా గుర్తించారు. కారులో వున్న వ్యక్తి పేలుడు జరిగే వరకు అందులోనే వున్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా ఈ కారు అనేక చేతులు మారిందని తేలింది. మొదట ఈ కారును హరియాణాలోని గురుగ్రాంకు చెందిన సల్మాన్ అనే వ్యక్తి 2025 మార్చిలో ఓఖ్లాలోని దేవేందర్ అనే వ్యక్తికి అమ్మాడు. దీని తరువాత అతను పంజాబ్‌లోని అంబాలకు చెందిన రషీద్ అనే వ్యక్తికి అమ్మగా అతను అమీర్‌కు అమ్మాడు. చివరగా కాశ్మీర్‌లోని పుల్వామకు చెందిన తారీక్ ఉమర్ చెంతకు ఈ కారుచేరింది. ఈ నేపథ్యంలో తారీక్, అమీర్, రషీద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# 41రోజుల షట్‌డౌన్‌కు తెర



## నిధుల బిల్లును ఆమోదించిన సెనేట్

### యుఎస్‌లో ఇక యధావిధిగా కార్యకలాపాలు

**వాషింగ్టన్, నవంబరు 11:** అమెరికాలో 41 రోజులుగా కొనసాగుతున్న సుదీర్ఘ ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడనుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను, ఫెడరల్ ఏజెన్సీల కార్యకలాపాలను స్తంభింపజేసిన షట్‌డౌన్‌ను ముగించేందుకు ఉద్దేశించిన కీలక నిధుల బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించింది. ఈ బిల్లు ఇప్పుడు ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఆమోదం కోసం వెళ్లనుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకంతో ఇది చట్టంగా మారుతుంది. ఈ చట్టంతో 2026 జనవరి వరకు ప్రభుత్వానికి అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తాయి. దీంతో పాటు అనేక ప్రధాన ఏజెన్సీలకు పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్‌లు కూడా కేటాయించడం జరుగుతుంది. షట్‌డౌన్ కారణంగా తాత్కాలికంగా విధులకు దూరమైన వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరడంతో పాటు వారికి రావలసిన జీతభత్యాలు కూడా అందనున్నాయి. తుది ఓటింగ్‌లో సెనేట్ 60 :40 ఓట్ల తేడాతో ఈ బిల్లును ఆమోదించింది. అంతకుముందు జరిగిన ఓటింగ్‌లో 8 మంది డెమొక్రాట్లు బిల్లుకు మద్దతు ఇవ్వడంతో ప్రతిష్ఠంభన వీడింది. ఈ రాజీ ఒప్పందంలో భాగంగా డెమొక్రాట్లు డిమాండ్ చేస్తున్న ఆరోగ్య సంరక్షణ పన్ను ప్రయోజనాల పొడిగింపుపై డిసెంబర్ మధ్యలోగా ప్రత్యేక ఓటింగ్ నిర్వహిస్తామని రిపబ్లికన్లు హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీ పట్ల డెమొక్రాటిక్ పార్టీలో కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ అంశాన్ని నేరుగా ఈ బిల్లులోనే చేర్చాలని వారు పట్టుబట్టారు. "ట్రంప్ ఆరోగ్య సంరక్షణ సంక్షోభం గురించి అమెరికా ప్రజలు ఇప్పుడు మేల్కొన్నారు. ఈ సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని మేము డిమాండ్ చేసినా, రిపబ్లికన్లు అంగుళం కూడా కదలలేదు. అందుకే అమెరికా ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమైన ఈ రిపబ్లికన్ బిల్లుకు నేను మద్దతివ్వలేను" అని సెనేట్ మైనారిటీ లీడర్ చక్ షుమర్ ఓటింగ్‌కు ముందు వ్యాఖ్యానించారు. మరోవైపు హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ ఇప్పటికే చట్టసభ సభ్యులను వాషింగ్టన్‌కు తిరిగి రావాలని పిలుపునిచ్చారు. ఈ వారం చివర్లో బిల్లుపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. హౌస్‌లో ఆమోదం లభించిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ దీనిపై సంతకం చేస్తారని రిపబ్లికన్ నేతలు తెలిపారు. యూఎస్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ఈషట్‌డౌన్ కారణంగా ఫెడరల్ సేవలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు విమాన ప్రయాణాలు, ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడిన విషయం తెలిసిందే.

# మహిళా రిజర్వేషన్ చట్టం అమలు

## కేంద్రానికి సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, నవంబరు 11:** చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం-2023 అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మహిళా రిజర్వేషన్ల అమలుపై తమ అభిప్రాయం తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బివి నాగరత్న, ఆర్.మహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. దేశంలో మహిళలు అతిపెద్ద మైనారిటీ అని ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. త్వరలో నిర్వహించే డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా, 2023 మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శోభాగుప్త వాదనలు వినిపించారు.

# స్థానికంలోనూ ఎంవిఎ కూటమి సమష్టిపోటీ

## ఎంఎన్‌ఎస్‌తో అవగాహన చర్చకు రాలేదు

### సమన్వయకమిటీ నేతలు వెల్లడి



**ముంబయి, నవంబరు 11:** మహారాష్ట్రలోని స్థానిక సంస్థల్లో ఎన్నికలకుగాను శరద్‌పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌పార్టీ, థాకరే శివసేనలు కూటమిగా ఏర్పడ్డాయి. ఇందుకోసం సమన్వయ కమిటీని కూడా ఏర్పాటుచేసుకున్నాయి. అయితే రాజ్‌థాకరే ఆద్వర్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్‌సేతో కలిసి పోటీచేసే అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రతిపాదనలు, చర్చలు రాలేదని ఎంవిఎ నేతలు తెలిపారు. ఆప్రతిపాదన అంటూ వస్తే సమిష్టిగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎన్సీపి పవార్ యూనిట్ రాష్ట్ర చీఫ్ శశికాంత్ షిండే మాట్లాడుతూ ప్రస్తుతం ఈ మూడుపార్టీలు కలిసే పోటీలో ఉంటాయన్నారు. ఎంఎన్ఎస్ లేని ఈ సమావేశంలో అవగాహనతో పోటీపై చర్చించేందుకు ఎంఎన్ఎస్ ప్రాతినిధ్యం లేనం దున చర్చలు జరగలేదన్నారు. కాంగ్రెస్‌రాష్ట్ర చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్, శివసేన థాకరే ఎమ్మెల్సీ అనిల్ పరబ్, షిండేలు సమావేశంలో చర్చలను మీడియాకు వివరించారు. అ సమ న్వయ కమిటీలోనే అవసరమైన సమయాల్లో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు కూడా స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. రానున్న ఎన్నికలను తాము సమిష్టిగా ఎదుర్కొంటామని తెలిపారు. ఎంవిఎ భాగస్వాము లంతా కూడా ఇప్పటివరకూ జరిగిన మేజర్ ఎన్నికల్లో కలిసే పోటీచేసాయని రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా అదే పోటీ ఉంటుందని తెలిపారు. ఎంఎన్ఎస్ రాజ్‌థాకరే మరాఠ్వాడా వాదం, ఉత్తరభారతీయుల వలసలు పెరగడంపై వాడివేడి నిరసనలతో ఉన్నారు. ఈ దశలో ఎంఎన్ఎస్‌తోకలిస్తే ఎంతవరకూ ఎంవి ఎకు మేలు జరుగుతుందన్న చర్చలు వచ్చాయి. అయితే ముంబయి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సోలోగానే వెళతుందని వడెట్టివార్ తెలిపారు. నాసిక్ పరంగా చూస్తే వారు ఎంఎన్ఎస్‌తో అవగాహనకు రావాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది. స్థానిక పరిస్థితులకు అనుగుణంగానే ముందుకు వెళతామన్నారు. అయితే ఎంఎన్ఎస్ రాజ్‌థాకరే నిర్వహించినసమావేశానికి వెళ్లిన నాసిక్ కాంగ్రెస్ నాయకులకు నోటీసులు జారీ చేసామని పార్టీ చీఫ్ సప్కాల్ స్పష్టం చేసారు.

# హెచ్ఆర్ పొరపాటుతో ఉద్యోగులందరికీ లే ఆఫ్ మెయిల్స్




**న్యూఢిల్లీ, నవంబరు 11:** ప్రస్తుతం అంతటా లేఆఫ్‌ల కలకలం రేగుతున్న తరుణంలో, ఓ కంపెనీ హెచ్ఆర్ విభాగం చేసిన చిన్న పొరపాటు పెద్ద గందరగోళానికి దారితీసింది. కొత్త ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తూ, ఏకంగా కంపెనీ సీఈఓ సహా ఉద్యోగులందరికీ ఉద్యోగం నుంచి తొలగిస్తున్నాం అంటూ ఈమెయిల్స్ పంపింది. ఈ ఘటన ఉద్యోగుల్లో తీవ్ర భయాందోళనలకు కారణం కాగా, సోషల్ మీడియాలో మాత్రం నవ్వులు పూయిస్తోంది. ఓ కంపెనీలో ఉద్యోగుల రాజీనామా లేదా తొలగింపు ప్రక్రియను సులభతరం చేసేందుకు హెచ్ఆర్ విభాగం కొత్త ఆఫ్‌బోర్డింగ్ సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తోంది. అయితే, సిస్టమ్‌ను టెస్ట్ మోడ్ నుంచి లైవ్ మోడ్‌కు మార్చి, తిరిగి మార్చడం మర్చిపోయారు. దీంతో ఆ సంస్థలో పనిచేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులకు వెంటనే అమలులోకి వచ్చేలా ఇదే మీ చివరి పని దినం అనే సందేశంతో ఈమెయిల్స్ వెళ్లాయి. ఈ ఊహించని మెయిల్‌తో ఉద్యోగులంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఓ మేనేజర్ అయితే, నేను నా వస్తువులు సర్దుకోవడం ప్రారంభించాలా అని సరదాగా రిప్లై ఇచ్చారు. ఈ ఘటనను ఓ ఉద్యోగి రెడ్డిట్‌లో పోస్ట్ చేయడంతో విషయం వైరల్‌గా మారింది. గందరగోళాన్ని గమనించిన ఐటీ విభాగం వెంటనే రంగంలోకి దిగింది. ఎవరినీ ఉద్యోగం నుంచి తొలగించలేదు. దయచేసి మీ బ్యాడ్జ్‌లను తిరిగి ఇవ్వకండి అంటూ అత్యవసర సందేశం పంపింది. హెచ్ఆర్ విభాగం కూడా తమ పొరపాటును అంగీకరిస్తూ, ఆటోమేషన్ టూల్ వల్ల ఇది జరిగిందని, కంగారు పడవద్దని ఉద్యో గులకు స్పష్టం చేసింది. ఇలాంటి సమయంలో నన్ను తొలగిస్తే, మూడు నెలల జీతం వస్తుంది, వెంటనే పని మానేయవచ్చు. అదృష్టం అంటే ఇదే అని కొందరు, నన్ను ఉద్యోగం నుంచి తీసేంత తెలివితక్కువ కంపెనీలో నేను పనిచే యాలనుకోను అంటూ మరికొందరు స్పందిం చారు. మొత్తానికి, ఈ హెచ్ఆర్ పొరపాటు ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



# మతమార్పిడి నిరోధక చట్టాలపై

## అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, నవంబరు 11:** మతమార్పిడి నిరోధక చట్టాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఆమోదించిన మత మార్పిడి నిరోధక బిల్లులపై పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయా పిటిషన్లను డిసెంబర్‌లో విచారణకు జాబితా చేయనున్నట్లు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్, ఎన్‌వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది.. చట్టాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సత్వరమే విచారణకు వచ్చేలా చూడాలని కోరారు. దాంతో సీజేఐ స్పందిస్తూ "అది సాధ్యం కాదు. తాను తీర్పులు రాయాలి. నవంబర్ 23న పదవీ విరమణ చేస్తున్నా" అని సిజెఐ పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మతమార్పిడి నిరోధక చట్టాలపై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు పలు రాష్ట్రాలను వైఖరి ఏంటో చెప్పాలని సుప్రీంకోర్టు కోరింది. ఈ మేరకు రాయా రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. అలాంటి చట్టాల అమలును నిలిపివేయాలని చేసిన అభ్యర్థనను సమాధానాలను సమాధానం విన్న తర్వాత పరిశీలిస్తామని సిజెఐ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ తర్వాత రాష్ట్రాలకు స్పందన చెప్పేం దుకు నాలుగువారాల సమయం ఇచ్చింది. పిటి షనర్లు రెండు వారాల తర్వాత రిజాయిండర్లు దాఖలు చేయడానికి అనుమతించింది.

# ఐఎఎస్ భర్త హింసిస్తున్నారంటూ ఐఎఎస్ భార్య ఫిర్యాదు



**జైపూర్, నవంబరు 11:** పెళ్లైన కొన్ని రోజులకే ఐఎఎస్ దంపతుల మధ్య కొట్లాటలు ప్రారంభం కావడంతో విసిగిపోయిన ఐఎఎస్ భార్య భర్తపై ఫిర్యాదులుచేసింది. ఇంతకీ భర్తకూడా ఐఎఎస్ కావడం గమనార్హం. భర్తపై గృహహింస కేసునమోదుచేయాలంటూ భర్త సీనియర్ ఐఎఎస్ అయిన అశీష్‌మోడీపై భార్య భారతీ దీక్షిత్ ఫిర్యాదుచేయడం ఐఎఎస్ వర్గాల్లో కలకలం రేపింది. ఐఏఎస్ అధికారి అయిన తన భర్త ఆశీష్ మోడీ తనపై వేధింపులకు పాల్పడుతున్నాడని ఐఏఎస్ అధికారి అయన భార్య భారతీ దీక్షిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహహింస చట్టం కింద ఆయనపై కేసు పెట్టారు. పోలీసులు వివరాల ప్రకారం రాజస్థాన్ ప్రభుత్వ ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న భారతి దీక్షిత్ భర్త వేధిస్తున్నాడంటూ జైపూర్ పోలీసులను ఆశ్రయించారు. సామాజిక న్యాయం, సాధికారత విభాగంలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తన భర్త వివాహం జరిగినప్పటి నుంచి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, ఈ మధ్య వేధిం పులు తీవ్రమయ్యాయని భారతి దీక్షిత్ ఆరో పించారు. అత్తింటివారి నుంచి తన ప్రాణాలకు హాని ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తామిద్దరం 2014 బ్యాచ్‌కు చెందిన రాజస్థాన్ కేడర్ ఐఏఎస్ అధికారులమని, అదే ఏడాది వివాహం జరిగిందని, అప్పటి నుంచి ఆశిష్ మోడీ తరచూ మద్యం సేవించి తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని ఆరోపించారు. ఆశీష్ మోడీకి పలువురు నేరస్థులతోనూ సంబంధాలున్నాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో వేధింపులు మరీ ఎక్కువయ్యాయని, గత నెలలో ఆశిష్ అతడి స్నేహితులతో కలిసి తనను ఓ ప్రభుత్వ వాహనంలో అపహరించి, చాలా గంటలపాటు నిర్బంధంలో ఉంచారని పేర్కొన్నారు. విడాకులకు అంగీకరించకపోతే తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారని ఆరోపించారు. దాంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న అతడి కోసం గాలింపు చేపట్టారు.

# నటుడు విజయ్ ఇంటికి బాంబు బెదిరింపులు

**చెన్నై, నవంబరు 11:** తమిళ చలనచిత్ర పరిశ్రమలోని అగ్రశ్రేణి నటులందరికీ ఇటీవల బాంబు బెదిరింపులు పెరిగిపోయాయి. ఇళ్లను బాంబులతో పేల్చివేస్తామంటూ వస్తున్న బెదిరింపు ఈమెయిల్స్ ఎక్కువగానే ఉన్నాయి. అగ్రనటులు కమల్‌హాసన్, ధనుష్, రజనీకాంత్ వంటి వారితోపాటు తాజాగా మరో అగ్రనటుడు విజయ్ ఇంటికిసైతం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో చెన్నైలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్, ఈసీఆర్‌లో ఉన్న నటుడు అజిత్ కుమార్ నివాసం, ఈవీపీ ఫిలిమ్ సిటీ తదితర ప్రాంతాల్లో బాంబులు ఉన్నట్లు ఈరోజు డీజీపీ కార్యాలయానికి ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు అందాయి. సమాచారం అందిన వెంటనే బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగి ఆయా ప్రాంతాలలో తనిఖీలు చేపట్టింది. తనిఖీల్లో ఎటువంటి బాంబులు లేవని నిర్ధారించారు. ఇదివరకే ఎస్వీ శేఖర్, నటి రమ్యకృష్ణ ఇళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం విదితమే. సోమవారం నాడు నటి త్రిష నివాసం, ఈడీ డైరెక్టరేట్ కార్యాలయానికి కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులకు పాల్పడుతున్నది ఎవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగానే ఉంది

## నిరంతరం వైద్యులు పర్యవేక్షిస్తున్నారు

### భార్య హేమమాలి, కుమార్తె ఇషాడియోల్ వెల్లడి



**ముంబయి, నవంబరు 11:** బాలివుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర ఆరోగ్యపరిస్థితి విషమించిందంటూ వచ్చిన ప్రచారాన్ని ఆయన భార్య ఎంపి హేమమాలినితోపాటు ధర్మేంద్ర కుమార్తె ఇషాడియోల్‌కూడా తీవ్రంగా ఖండించారు. తమ కుటుంబం చెప్పిన వివరాలను మాత్రమే ప్రసారంచేయాలని వారు విజ్ఞప్తి చేసారు. సోషల్ మీడియా వదంతులు నమ్మవద్దని కోరారు. ప్రస్తుతం ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన క్షేమంగానే ఉన్నారని, ఆయనకు చికిత్స అందుతోందని నాన్న సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించిన అందరికీ మా కృతజ్ఞతలు అని వారిరువురు పేర్కొన్నారు. ఆరోగ్యపరిస్థితి విషమించిందంటూ వచ్చిన వార్తలను భార్య హేమమాలిని కూడా తీవ్రంగా ఖండించారు. ఇలాంటి బాధ్యతారహిత వార్తలను ఎలా ప్రచారంచేస్తారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. 89 ఏళ్ల నటుడు ధర్మేంద్ర వయోభారంతో వచ్చిన సమస్యలపై ఆయన ఆసుపత్రిలో చేరారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆయన కంటికి కూడా శస్త్రచికిత్స చేయించు కున్నారు. ధర్మేంద్ర భార్య హేమమాలినితోపాటు కుమారుడు సన్నీ డియోల, బాబీ డియోల్, మనవళ్లు కరణ్, రాజ్‌వీర్‌డియోల్‌లు ఆసుపత్రికి వెళ్లి వైద్యులను వాకబుచేసారు. ధరమ్‌జీని వైద్యులు నిరంతర పర్యవేక్షణలో ఉంచారని అన్నారు.

# విదేశీ విద్యార్థులను వద్దనుకోవడం లేదు: యుఎస్ అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, నవంబరు 11:** విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వారు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిదేనని వ్యాఖ్యానించారు. దీనివల్ల ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి అమెరికాకు వస్తోన్న విద్యార్థుల సంఖ్యను సగానికి తగ్గించకూడదు. దానివల్ల మన విశ్వవిద్యాలయ, కళాశాల వ్యవస్థ నాశనం అవుతుంది. నేను అలా జరగనివ్వను. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు ఉండటం మంచిది.

నేను ప్రపంచంతో కలిసి ఉండాలని అనుకుంటున్నాను' అని ట్రంప్ వెల్లడించారు. అమెరికాకు వచ్చే వారిని సగానికి తగ్గిస్తే అది కొంతమందికి సంతోషాన్ని ఇస్తుందన్నారు. అయితే అమెరికాలో సగం కళాశాలలకు వ్యాపారం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. దేశీయ విద్యార్థులతో పోలిస్తే విదేశాల నుంచి వచ్చే వారు రెట్టింపు కంటే ఎక్కువ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్ భారత్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



**మాస్కో, నవంబరు 11:** రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబరులో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి క్రెమ్లిన్ ముమ్మ రంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సన్నాహాలు వేగంగా పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. పుతిన్ పర్యటన నేపథ్యంలో రెండు దేశాల మధ్య కార్మికుల మార్పిడి ఒప్పందం జరగనున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. దీని గురించి ప్రశ్నించగా కుదుర్చు కోవాలనుకున్న ఒప్పందాల గురించి త్వరలోనే వెల్లడిస్తామన్నారు. 2021 తర్వాత పుతిన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

## బిలియన్ డాలర్లు చెల్లించండి: బిబిసికి ట్రంప్ లేఖ



**వాషింగ్టన్, నవంబరు 11:** అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చడంలో బిబిసి చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే. దీనికి బాధ్యత వహిస్తూ ఇప్పటికే ఆ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తన ప్రసంగాన్ని మార్చినందుకు గాను పరిహారంగా బిలియన్ డాలర్లు చెల్లించాలని అమెరికా అధ్యక్షుడు బిబిసికి లేఖ రాశారు. సవరణ చేసిన డాక్యుమెంటరీని పూర్తిగా ఉపసంహించుకోవాలని ట్రంప్ లాయర్ అలెజాండ్రో బ్రిటో బిబిసికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ వార్త లు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వైరల్‌గా మారా యన్నారు. తప్పుడు ప్రచారాలు చేసి ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు బిలియన్ డాలర్లు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు శుక్రవారం వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు.

## హంగేరి రచయిత డేవిడ్‌సాలేకు బుకర్ ప్రైజ్



**లండన్, నవంబరు 11:** హంగేరికి చెందిన బ్రిటీష్ రచయిత డేవిడ్ సాలే 2025 బుకర్ ప్రైజ్ గెలుచుకున్నారు. ఫ్లెష్ అనే నవలకు గాను ఆయనను ఈ అవార్డు వరించింది. లండన్‌లో సోమవారం రాత్రి బుకర్ ప్రైజ్ వేడుక జరిగింది. భారతీయు రచయిత కిరణ్ దేశాయ్ రాసిన ద లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ నవల తీవ్ర పోటీ ఇచ్చింది. కానీ చివరకు డేవిడ్ రాసిన నవలకు అవార్డు దక్కింది. 51 యేళ్ల డేవిడ్ సాలేకు సుమారు 50 వేల పౌండ్ల నగదు పురస్కారం అందజేశారు. గత యేడాది విన్నర్ సమంతా హార్వే చేతుల మీదుగా ట్రోఫీని బహూకరించారు. కిరణ్ దేశాయ్ రెండోసారి ఈ అవార్డు కోసం పోటీ పడ్డారు. 2006లో రాసిన ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్ నవలకు ఆమెకు బుకర్ ప్రైజ్ వచ్చింది. అయితే ఈసారి కూడా ఆ అవార్డు కోసం ఆమె తీవ్రంగా పోటీపడ్డారు.

## రిపబ్లికన్ ఎన్ఆర్ఐ సిబి చంద్రయాదవ్‌కు ట్రంప్ క్షమాబిక్ష



**వాషింగ్టన్, నవంబరు 11:** అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ కార్యకర్త సీబీ చంద్ర యాదవ్‌కు ముందస్తు క్షమాభిక్ష ప్రసాదించారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు కీలక రాజకీయ నేతలతో పాటు యాదవ్‌కు కూడా ఈ క్షమాభిక్ష వర్తిస్తుంది. ఈ క్షమాభిక్షలు కేవలం ఫెడరల్ స్థాయి నేరాలకు మాత్రమే పరిమితం. దీనివల్ల భవిష్యత్తులో ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆయనపై ఎలాంటి అభియోగాలు మోప లేరు. అమెరికా న్యాయ వ్యవస్థలో ఫెడరల్, రాష్ట్రస్థాయి విచారణలు వేర్వేరుగా ఉంటాయి. అందుకే జార్జియాలో ఆయనపై నమోదైన రాష్ట్రస్థాయి కేసులకు ఈ క్షమాభిక్ష వర్తించదు. ఈ కేసులో ఆయనపై విచారణ కొనసాగే అవకాశం ఉంది.

## ఢిల్లీ పేలుళ్లపై పాక్ మీడియాలో విస్తృత కవరేజి

**ఇస్లామాబాద్,నవంబరు 11:** దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం భారీ పేలుడు ఘటనలో ఇప్పటి వరకూ 12మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పేలుడు ఘటనను భారత్‌లోని అన్ని మీడియా సంస్థలు ఫ్రంట్ పేజీలో కవర్ చేశాయి. ముఖ్యంగా దాయాది పాకిస్థాన్ మీడియా సంస్థలు ఈ ఘటనను తమ ఫ్రంట్ పేజ్‌లో కథనాన్ని ప్రచురించాయి. పాక్‌కు చెందిన మీడియా సంస్థలు డాన్,జియోన్యూస్, ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్, దన్యూస్ ఇంటర్నేషనల్, పాకిస్థాన్‌టుడే సంస్థలు ప్రచురించాయి.

# నేడు రాయచోటి నియోజకవర్గంలో సిఎం పర్యటన

**కడప, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాయచోటి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సొంత మండలం చిన్నమండెం మండలంలో ఆయన పర్యటిస్తారు. ఉండవల్లి లోని నివాసం నుంచి ఉదయం 9.10 గంటలకు బయలుదేరి 10:40 గంటలకు దేవగుడి పల్లెలో ఏర్పాటుచేసిన హెలి పాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం ఇదే గ్రామంలో గృహప్రవేశాలలో సీఎం పాల్గొం టారు. 11:50 గంటలకు చిన్నమండెం లోని ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ప్రజా వేదిక సభలో ప్రజలతో మాట్లాడి ప్రజల నుంచి ఫిర్యా దులు స్వీకరిస్తారు. పీఎంఏవైహెచ్2 కింద పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేస్తారు. తర్వాత 2.30 గంటలకు పార్టీ క్యాడర్ తో సమావేశమవుతారు. నాలుగు గంటలకు సమావేశం ముగుస్తుంది. 4.10 నిమి షాలకు బయలుదేరి 4:25 నిమిషాలకు కడప ఎయిర్పోర్ట్ కు చేరుకుంటారు. కడప నుంచి సీఎం వైజాగ్‌కు బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటన ఏర్పడను రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ దగ్గరుండి పర్యవేక్షి స్తున్నారు.

# గోదావరి పుష్కరాలు-2027 కోసం కార్యదర్శుల బృందం

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాలు- 2027 కోసం కార్య దర్శుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. 11శాఖల కార్యదర్శులతో ఈ కమి టీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. దేవాదాయ, జలవనరుల, హోమ్, పుర పాలక, రెవెన్యూ, పర్యాటక, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, ఇంధన, ఆర్థికశాఖ కార్యదర్శులు ఈ కమిటీలో ఉంటారని వెల్లడించింది. మంత్రుల బృందం తీసుకున్న నిర్ణయాల ప్రకారం, రాబోయే గోదా వరి పుష్క రాలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహిం చడానికి వీరు విధానాలు, వ్యూహాలు రూపొం దిస్తారని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్‌ను గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సిఎస్ విజయా నంద్ ఉత్తర్వులిచ్చారు.

## విపత్తుల బాధితులను ఆదుకునేందుకు యువ ఆపద మిత్ర

**విజయవాడ, నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యువ ఆపదమిత్ర పథకం ప్రారంభించిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విపత్తులు సంభవించిన సందర్భాల్లో సహాయం అందించడం, ప్రథమ చికిత్స అందించడంతోపాటు వెంటనే రక్షణ చర్యలు చేపట్టేలా సామర్థ్యాలను పెంపొందిం చడమే యువ ఆపదమిత్ర పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐదు రాష్ట్రాలకు చెందిన వాలంటీర్లకు యువ ఆపదమిత్ర పథకం ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి దన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 52 మంది వాలంటీర్లను గుర్తించి వారికి 21 రోజులు శిక్షణ ఇచ్చారని తెలిపారు. వాలంటీర్లు విపత్తుల సమయంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీస్, అగ్నిమాపక దళాలకు అండగా నిలిచేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



# పెత్తందారులకు ప్రయోజనం కోసమే అసైన్డ్ చట్టాన్ని సవరించారు

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** పెత్తందారులకు ప్రయోజనం లభించే విధంగా ఏపీ మంత్రివర్గ సమావేశం 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరించిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విమర్శించింది. దళితులు, బలహీనవర్గాలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న పెత్తందారులకు దొడ్డిదారిన 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికే ఈ సవరణ అని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. ఆక్ర మణకు గురైన 13 లక్షల అసైన్డ్ భూములను 99 ఏళ్లపాటు పెద్దలకు కట్టబెట్టేందుకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెం టనే ఉపసంహరిం చుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు.

# రాష్ట్రంలో ఒకేసారి 3లక్షల గృహ ప్రవేశాలు

## 17నెలల్లో ఇళ్లు పూర్తిచేసి లబ్దిదారులకు అప్పగిస్తున్న కూటమి ప్రభుత్వం

## అన్నమయ్య జిల్లా నుండి వర్చువల్‌గా ప్రారంభించినున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**సచివాలయం,నవంబరు 11,ప్రభాతవార్త:** ఎన్ని కల మ్యానిఫెస్టో అమల్లో బాగంగా కూటమి ప్రభుత్వం మరో హామీని నెరవేరుస్తుంది. అందరికీ ఇళ్ళు పథకంలో భాగంగా రాష్ట్రంలోని సొంతిల్లు లేని పేదలకు ఇళ్ళు ఇస్తామని ఎన్నికల్లో కూటమి పార్టీలు హామీ ఇచ్చారు. ఈ హామీ అమల్లో భాగంగా అధికారంలోనికి వచ్చిన 17నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 3ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులకు ప్రభుత్వం కేటాయించింది. నిర్మాణం పూర్తి చేసిన ఇళ్ళలో ఒకేమారు లబ్దిదారులు గృహప్రవేశాలు చేయ నున్నారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 3లక్షల ఇళ్ళల్లో లబ్ధిదారుల గృహ ప్రవేశాలు జరగను న్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం దేవగుడిపల్లి గ్రామంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో సీఎం పాల్గొనడం తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్ళను వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. లబ్దిదారులకు ఇంటి తాళాలు అందించనున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, బిఎల్సీ కింద నిర్మించిన 2,28,034ఇళ్ళు, పిఎంఏవై గ్రామీణ్ కింద 65,292ఇళ్ళు, పిఎంఏవై జన్మన్ పథకం కింద మరో 6,866ఇళ్ళలో లబ్దిదారులు గృహ ప్రవేశాలు చేయనున్నారు. మొత్తంగా 3,00,192 ఇళ్ళకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఈ గృహ ప్రవేశాలు జరగనున్నాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న ఇసుక విధానం ద్వారా దాదాపు ఉచిత ఇసుక విధానంతో దాదాపు 20టన్నుల ఇసుక ఉచితంగా పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది.

**పేదలకు గూడు కల్పించడమ కూటమి ప్రభుత్వ ప్రాధాన్య:** 2014తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం వివిధ విభాగాల్లో 8లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసింది. ప్రస్తుతం అధికారంలోనికి వచ్చిన 17నెలల కాలంలోనే 3లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గత పాలకులు పేదల సొంతింటి కలల్ని కూల్చేసింది. 4.73లక్షల ఇళ్ళు రద్దు చేసింది. 2.73లక్షల మంది లబ్దిదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని బకాయి పెట్టింది. గత ప్రభుత్వం నిలిపేసిన ఇళ్ళ నిర్మాణాలకు చెందిన బకాయి బిల్లులను దశల వారీగా కూటమి ప్రభుత్వమే చెల్లించింది. ప్రస్తుతం పూర్తి చేసిన ఈ ఇళ్ళనే కాకుండా..మరిన్ని ఇళ్ళను త్వరి తగతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 3లక్షల ఇళ్ళ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయా జిల్లాల నుంచి మంత్రులు ప్రజాప్రతినిధులు కూడా ఈ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# 'సిట్'ముందుకు కల్తీనెయ్యి సూత్రధారులు

## అంతా ధర్మకర్తలమండలి ఆదేశాల మేరకేనని చెప్పిన మాజీ ఇఒ ధర్మారెడ్డిని సుదీర్ఘంగా విచారించిన అధికారులు

### 15న మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి



**తిరుపతి,నవంబరు 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో 2020-24 మధ్యకాలంలో కల్తీనెయ్యి సరఫరా, ఉపయోగిం చారనే కేసులో సిబిఐ సిట్ విచారణకు మం గళవారం మాజీ టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి హాజ రయ్యారు. ఉదయం 11గంటల సమయంలో ఓ ప్రైవేట్‌కారులో అలిపిరిలోని పాత ఎస్వీబిసి కార్యాలయం ప్రాంగణంలోని సిట్ తాత్కాలిక కార్యాలయం చేరుకున్నారు. కారులోంచి దిగిన ధర్మారెడ్డి మీడియా కంటపడకుండా సిట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 1.30గంటల వరకు సిట్ డిఐజి మురళీరంభ పలు ప్రశ్నలు సంధించి వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. 2019వ సంవత్సరంలో రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కేంద్రసర్వీసుల నుండి ధర్మారెడ్డిని టిటిడి అదనపు ఇఒగా డిప్యూటేషన్‌పై తీసుకువచ్చారు. అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డికి అత్యంత విశ్వాసపాత్రుడుగా మెలగడంతో కొంతకాలానికి టిటిడి ఇఒగా కూడా ఈయనకే బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇఒగా పనిచేసిన హయాంలో టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌గా జగన్ బాబాయి వైవి సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా జంబో పాలకమండలి కొనసాగింది. ఆ కాలంలో తిరుమలకు 2020 నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరాచేసేందుకు టెండర్లు పిలవడం, పాల్గొన్న సంస్థలు, వాటికి నెయ్యి సరఫరాకు సామర్థ్యం ఉందా, ఎంతవరకు టెండర్లు దక్కించుకుని ఎంతకాలం సరఫరా చేశారు అనే వివరాలు ధర్మారెడ్డిని అడిగి సమా ధానాలు రాబట్టారనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి సరఫరా జరిగినా, లడ్డూల నాణ్యత లేదని, ఒకరకమైన వాసన వస్తోందని అప్పట్లోనే భక్తుల నుండి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా ఎందుకు తనిఖీ చేయలేదని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే అంతా నాణ్యతతోనే తయారైందని తెలిపినట్లు ,కరోనా సమయంలో కూడా నిబంధనలు పాటించి లడ్డూలను తయా రుచేశామని సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ఈ వివరాలన్నీ సిట్ వీడియోరికార్డు చేసినట్లు ఉంది. అదేగాక పవిత్రంగా భావించే తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి ఎంత కాలంగా కల్తీనెయ్యి వినియోగించారు?అసలు నెయ్యిసర ఫరాకు టెండర్లు చేజిక్కించుకున్న సంస్థలకు బదులు నెయ్యి కాంట్రాక్టర్ల స్థానంలో ఇతరులు సరఫరా చేసినా ఎందుకు ప్రశ్నించలేకపో యారనేది సిట్ కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఏఆర్ డైరీ నుండి నాణ్యత నెయ్యి వచ్చిందా లేదా ఎందుకు తనిఖీ చేయించలేదనే కోణంలో సిట్ వివరాలు రాబట్టింది. ఇంత దారుణానికి ఎవరు పాల్పడ్డారనే అంశంలో ,లడ్డూతయారీలో నెయ్యి, ముడిసరుకులు శనగపండి, యాలకులు, జీడిపప్పు, ఎండుద్రాక్ష నాణ్యత ఉన్న వాటిని ఎక్కడ నుండి దిగుమతిచేసుకున్నానే వివరాలు సిట్ రాబట్టింది. నెయ్యినాణ్యతలేదని దీనివల్లే ఐదేళ్ళ లడ్డూలు నాణ్యతలేదని కీలకంగా పోటు వైష్ణవబ్రాహ్మణులు సమాచారం కూడా ధర్మారెడ్డిముందు వుంచారు. కొన్నిటికీ సమా ధానాలు దాటవేశారని తెలుస్తోంది. మీ హయాం లో 2023 డిసెంబర్‌నెల నుండి2024 మేనెల వరకు టిటిడికి నెయ్యిసరఫరా చేయడానికి టెండర్లులో పాల్గొన్న సంస్థలు, సరఫరా చేసిన సంస్థలు, వారు చేసిన కల్తీ బాగోతం వివరాలను కొన్ని ఆధారాలతో చూపి సమాధానాలు రాబట్టారని తెలుస్తోంది.

ఇప్పటికే పలువురు పాత్రధారుల రిమాండ్ రిపోర్టు మేరకు ఉన్న సమాచారంతో సిట్ విచారణ చేయడం చివరకు టిటిడిలో బోర్డునే (పాలకమండలి)సుప్రీమ్ అని, బోర్డు చెప్పినట్లు చేయడం అధికారుల బాధ్యత అని సిట్‌కు పూర్వ ఇఒ ధర్మారెడ్డి సమాధానాలు ఇవ్వడంతో కొంత ఆశ్చర్యంచెందారు. అయితే ఈ కల్తీనెయ్యి వ్యవహారంపై మరికొంత సమాచారం రెండవరోజు నేడు కూడా ధర్మారెడ్డిని విచారణ చేసే అవకాశం ఉందని తెలిసింది. మరీ నేడు ఆయన నుండి ఎలాంటి సమాచారం సేకరిం చనుంది, తదుపరి చర్యలు తీసుకుంటుందా అనేది ఉత్కంఠరేపుతోంది. ఇదే కల్తీనెయ్యి కేసులో 13వతేదీ గురువారం విచారణకు రావాలని సిట్ అధికారులు టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి నోటీసులివ్వడం సంచలనంగా మారింది. కానీ నోటీసులందుకున్న ఆయన 15వతేదీ శనివారం విచారణకు వస్తానని సమాధానమిచ్చారు.

## సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు

# ప్రత్యేక బోర్డు అవసరం: డిసిఎం పవన్ కల్యాణ్

## తిరుపతి లడ్డూను స్వీట్‌గా భావించకూడదు



**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు అనేది ఉంటే కొన్ని అరాచకాలను అదుపు చేయగలమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్త హిందూ సమాజానికి కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదని, అదొక పవిత్రమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కేవలం ఒక స్వీట్ కాదు, అది మనందరి ఉమ్మడి భావోద్వేగం. స్నేహితులు, కుటుంబ సభ్యులు, చివరికి అపరిచితులతో కూడా మనం ఆ ప్రసాదాన్ని పంచుకుంటాం. ఎందుకంటే, అది మన సామూహిక విశ్వాసానికి, ప్రగాఢ భక్తికి ప్రతీక" అని వివరించారు. ఏటా సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని గుర్తుచేశారు. మా విశ్వాసానికి రక్షణ, గౌరవం ఇవ్వడంలో రాజీ పడకూడదు అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అంతకుముందు, నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో తిరుపతి లడ్డూ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. 'పాలు లేని కల్తీ నెయ్యిలో మతోన్మాదాన్ని కలపకుండా, కల్తీ రాజకీయం చేయకుండా ఇప్పటికైనా తప్పు చేసిన వాడిని శిక్షించే పని చూడండి' అంటూ ట్వీట్ చేశారు.

# సత్యసాయి శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

## 10లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా , అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి: మంత్రి అనగాని



సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను వివరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**శ్రీసత్యసాయి జిల్లా , నవంబరు10 ప్రభాత వార్త ప్రతినిధి :** భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేసే విధంగా అధికారు లందరు సమన్వయంతో కృషి చేయాలని మంత్రుల కమిటీ ఛైర్మన్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రుల కమిటీ ఛైర్మన్ రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్య ప్రసాద్ తో పాటు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ , దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుని అక్కడ నుండి ప్రత్యేక వాహన శ్రేణిలో శాంతిభవన్ చేరుకున్నారు. శాంతిభవన్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, స్థానిక శాసన సభ్యురాలు పల్లెసింధూరరెడ్డి, మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీమంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఎండి సంపత్, ప్రత్యేక ప్రధానకార్యదర్శిలు కృష్ణ బాబు, అజయ్ జైన్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎస్పి సతీష్ కుమార్, డిఐజి షిమోషి, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ లతో శాంతిభవన్లో శత జయంతి ఉత్సవాలపై సమీక్షించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ రానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లతో పాటు పట్టణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తున్న పనులపై ట్రస్టు ప్రతినిధులతో దాదాపు గంట సేపు చర్చించారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో అంత తిరిగి పరిశీలించారు. అనంతరం సాయి ఆరామంలో విలేకరులతో మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం మన అదృష్టంగా భావించాలని కార్యక్రమాలకు ప్రధానిమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, లతోపాటు ముఖ్యమంత్రులు రాష్ట్ర గవర్నర్లు, కేంద్ర,రాష్ట్ర మంత్రులతో పాటు ఇతర దేశాలకు చెందిన ప్రతినిధులు శతజయంతి ఉత్సవాలలో పాల్గొన్న నున్నందున వారికి వసతి ఏర్పాట్లతో పాటు భద్రతను కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుండి దాదాపుగా 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేయడం జరిగిందన్నారు. అందుకు తగ్గట్టుగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవంబర్ 13 నుండి 17 వ తేదీ వరకు ప్రతిరోజు 40 వేల మంది భక్తులు పుట్టపర్తికి రానున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్ 17 నుండి 23 వరకు రోజుకు లక్షల మంది భగవాన్ బాబా వారి శతజయంతి ఉత్సవాలలో పాల్గొననున్నట్లు అంచనా కలదన్నారు. 19వ తేదీ హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ప్రధాని మోడీ సభలో దాదాపు రెండున్నర గంటలపాటు గడపనున్నారన్నారు.

# కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్ వేధింపులపై డిజిపికి నోటీసు

## నెలలోగా నివేదిక పంపాలని ఆదేశాలు

**రాజంపేట, నవంబరు 11 ప్రభాతవార్త:** కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, మరికొందరు పోలీసు అధికారులు తమను వేధిస్తున్నారంటూ టి. సుధా మాధురి అనే మహిళ జాతీయ ఎస్సీ కమిషన్ చేసిన ఫిర్యాదు (ఏపీ సిఆర్/బిఇ/ ఎపి/2025/314043) మేరకు సమగ్ర నివేదిక పంపాలని కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు రాష్ట్ర డిజిపికి నోటీసులు జారీ చేశారు. పోలీసులు నిర్బంధించి తమ చేత బలవంతంగా తానా మాజీ అధ్యక్షుడు వేముల సతీష్‌కు అనుకూలంగా వీడియో రికార్డు చేయించారని సుధా మాధురి ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజంపేట టౌన్ సీఐ నాగార్జున, టౌన్ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ళు, ఓబులవారిపల్లె ట్రైనీ మహిళా ఎస్సై పై ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మీద కేసు రిజిస్టర్ అయితే తనని కూడా పోలీసులునిర్బంధించారనీ ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు.

# తిరుమల సమాచారం

# రండయ్యా.. రండి తీస్కోండి

## కాస్త వెనక్కు వెళితే వీడియో బాగావస్తుంది

## వెలుపల మీడియాతో ధర్మారెడ్డి చిట్‌చాట్



**తిరుపతి,నవంబరు 11ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి కల్తీనెయ్యి బాగోతంలో సిట్ విచారణకు మంగళవారం ఉదయం తిరుపతి అలిపిరిలోని సిట్ తాత్కాలిక కార్యాలయానికి మాజీ టిటిడి ఇఒవి ధర్మారెడ్డి హాజరయ్యారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు లోపలే ఉన్న ఆయన భోజనవిరామసమయంలో సిట్ కార్యాలయం నుండి వెలుపలకు వచ్చారు. అక్కడే అప్పటివరకు నిరీక్షిస్తున్న మీడియాకెమెరామెన్‌లు ఆయనను చిత్రీకరించేందుకు ముందుకు కది లారు. అప్పటికే ఆయన కారు ఎక్కి వెళ్ళబోతే ఆయనను చుట్టుముట్టారు. అప్పుడే అక్కడే ఆయన హుందాగా కారు నుండి దిగి రాం డయ్యా..రండి తీస్కోండి. లోగోలతో మైక్‌లు ,కెమెరాలు పెట్టడంతో అయ్యా కాస్త వెనక్కి వెళ్ళండి వీడియో బాగా వస్తుంది ఇప్పుడు ఒకేనా ఇక వీడియో తీస్కోండి అయ్యా నాకేమీ ఇబ్బంది లేదు అని ధర్మారెడ్డి మీడియా ప్రతినిధులతో చెప్పారు. అక్కడ హడావిడి లేకుండా ఆయన ముందుకు కదిలారు.




# అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి

**తిరుమల,నవంబరు 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరు మల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. మంగళవారం ఉదయం సిఎం కార్యాలయంలో అదనపు కార్యదర్శి కార్తికేయమిశ్ర, నటుడు విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్, ఎంవి నరసింహారావు ఆలయం లోనికి చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# టెన్త్ పరీక్షల ఫీజుల చెల్లింపు తుది గడవు 25

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా 2025- 26 విద్యా సంవ త్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపుల షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డివిడుదల చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13 నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లిం చవచ్చునన్నారు. రెగ్యులర్ విద్యార్థుల తోపాటు గతంలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు కూడా ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 25వ తేదీ వరకు ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు ఫీజు చెల్లించడానికి అవ కాశం కల్పించారు. రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 4 నుంచి 10 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 11 నుంచి 15 వరకు ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించారు. విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే తాము చదువుతున్న పాఠశాలల్లోని ప్రిన్సిపల్‌లకు ఫీజు రుసుమును చెల్లించాలని పరీక్షల డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి సూచించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు ముందుగానే ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. ఇక గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు పరీక్ష రాయాలనుకుంటే రూ.125 చెల్లించాలి. ఒకటి నుంచి మూడు సబ్జెక్టుల వరకు అయితే రూ.110 చెల్లించాలి. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలి. అలాగే వయసు నిర్ధారణ రుసుము కింద రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పైన పేర్కొ న్న గడువు తేదీల్లో ఏవైనా ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటిస్తే తర్వాతి పని దినాన్ని గడువు తేదీగా పరిగణించనున్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రధాన ఉపా ధ్యాయులు పాఠశాల లాగిన్ ద్వారా చెల్లించాల న్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వరకు నిర్వ హించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే త్వరలోనే టైం టేబుల్ కూడా విడుదల చేయనున్నారు.



చింతలపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

# 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనేందుకు సిద్ధం

**చింతలపూడి/ఏలూరు, నవంబర్, 11: ప్రభాతవార్త** ధాన్యం అందించిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. చింతలపూడిలో మంగళ వారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత సంవత్సరం 12 వేల 500 కోట్ల రూపాయల విలువైన 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసి, 48 గంటల లోగానే రైతుల ఖాతాకు నగదు జమచేశామ న్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించా మన్నారు. ఇందుకోసం 16 వేల మంది సిబ్బందిని నియ మిం చామన్నారు. ఉదయం 10 గంటలలోపు మిల్లర్ కు ధాన్యం తరలిస్తే, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలలోపు రైతుల ఖాతాకు ధాన్యం సొమ్ము జమచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. కార్యక్ర మంలో ప్రభుత్వ విప్ మరియు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రభృతులు పాల్గొన్నారు. పోతేపల్లిలో 208 కోట్ల రూపాయలతో ఏర్పా టుకానున్న గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌ను పనుల ను మంగళవారం ముఖ్యమంత్రి వర్చ్యు వల్‌గా శంఖుస్థాపన చేయగా, ద్వారకా తిరుమల మం డలం సిహెచ్. పోతేపల్లిలో గోద్రేజ్ ఆగ్రోవెట్ పరిశ్రమకు మంగళవారం రాష్ట్ర జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ శంఖుస్థాపన చేశారు.

# కారుణ్య మరణానికి అనుమతించాలని ఎలా కోరుతారు?

## న్యాయవాదిపై ఏపీ హైకోర్టు అసహనం

**విజయవాడ,నవంబరు 11,పభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం రాయ పూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ళ వృద్ధురాలు నెల్లూరి శేషగిరిమ్మ,ఆమె కుమార్తె వెంకాయమ్మ మనవరాలు శ్యామలల కారుణ్య మరణానికి అనుమతించాలంటూ వారి తరపున న్యాయవాది వ్యాజ్యంలో పేర్కొనడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. కోర్టులు అలాంటి అభ్యర్థనలను అనుమతించవని మీకు తెలుసుకదా? అని ప్రశ్నించింది. ఒకవేల పిటీషనర్లు ఒత్తిడి చేసి ఉంటే వ్యాజ్యం దాఖలు చేసేందుకు మీరు నిరాకరించి ఉండాల్సిందని పిటీషనర్ల తరపు న్యాయవాదిని ఉద్దేశించి వ్యా ఖ్యానించింది. ప్రచారం కోసం న్యాయస్థానాలను వేదికగా వినియోగించుకోవద్దని తేల్చి చెప్పింది.

# న్యాయసేవాధికార సంస్థ ఇసిగా జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడి(ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఈసీ)గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ నియ మితులయ్యారు. మంగళవారం ఈ విష యాన్ని ప్రభుత్వం అధికారంగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని ఈసీగా నామినేట్ చేయడం సంప్రదాయంగా వస్తోంది.


తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# కార్తికేయుని ఆలయంలో తీర్థ కావిడి ఉత్సవం..మేళ తాళాలు కలశాలతో గ్రామోత్సవం..విశేషంగా పాల్గొన్న మహిళలు

**శంఖవరం , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని కత్తిపూడిలో వేంచేసియున్న స్వయంభు శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తీర్థ కావిడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, స్వాములు, ప్రజలు భారీ సంఖ్యలో స్వామి వారి వెంట రాగా భక్తి పారవశ్యంతో కార్తికేయని నామ నామస్మరణతో తీర్థ కావిడి ఉత్సవాన్ని భక్త జనరంజకంగా ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మంగళవారం ద్వారపూడికి చెందిన వాసు గురుస్వామి బృందం పర్యవేక్షణలో కత్తిపూడికి చెందిన బర్ల అప్పారావు పవన్ కుమార్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాలదారుల బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. పంచామృత అభిషేకం గావించి షణ్ముఖి అష్టోత్తర పూజ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాములు తీర్థ కావిళ్ళతోను, పెండ్లి కాని యువతులు కలశ పూజా పాత్రలతోను, సంతాన లేమితో ఉన్న మహిళలు కుజ బిందెలతోను తీర్థాలను వెంట బెట్టుకుని తీర్థ కావిడి యాత్రను అనుసరించారు. సుందరంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఉంచి కోలాటం మేళ, తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో నృత్యాలు చేసుకుంటూ సుబ్రహ్మణ్య నామాన్ని స్మరిస్తూ తీర్థ కావిడి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో గల మూలవిరాట్ కు మహిళలు తెచ్చిన కలశాల జలంతో సుబ్రహ్మణ్య స్వామి దంపతులకు అభిషేకం గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పురోహితులు వేమకోటి సత్యనారాయణ స్వామివారిని విశేషంగా అలంకరించి అభిషేకాలు చేపట్టారు .ఆలయ కమిటీ చైర్మన్ గాబు గంగాధర్ ఆధ్వర్యంలో పూజలో



పాల్గొన్న స్వాములు మహిళలుగ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేణుమాధవ్ స్వామి ఆలయ చైర్మన్ కేళంగినూకరాజుఎంపీటీసీ సభ్యులు జీల కర్ర విష్ణు,, జీలకర్ర త్రిమూర్తులు, జిలకర లక్ష్మణ్, మల్లిపాం రమణ, మల్లిపం బాబులు మాదేపల్లి మహేష్ గ్రామస్తులు పూసపాటి చంటిబాబు తోట మణికంఠ గ్రామ సర్పంచ్ కొల్లి సత్యనారాయణకంచిపోయిన శ్రీనుస్వాము లు అయ్యప్పస్వాములు,సుబ్రహ్మణ్యేశ్వర స్వామిమాలధారులు పాల్గొన్నారు.

# మోడేకుర్రు లో శ్రీ భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం లో లక్ష పత్రి పూజ



**కొత్తపేట , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామం లో పవిత్ర కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం భక్త జనసంద్రంగా మారింది. గ్రామం లో ఉన్న ఆర్య వైశ్య సంఘం సభ్యులు స్వామి వారికీ లక్ష పత్రి బిల్వార్చన,అభిషేకాలు నిర్వహిం చారు. స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు ఓం నమఃశివాయ, హర హర మహాదేవ మంత్రం అన్ని ఆలయాలలో ప్రతిధ్వనించింది.? ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి, వారి మొక్కులను తీర్చుకున్నారు.? ఆర్య వైశ్య సంఘం సభ్యులు అన్నదానం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ పి.కామేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు బాధంపూడి తేజ శర్మ పర్యవేక్షణలో సిబ్బంది ఎలాంటి ఇబ్బంది కలగకుండా సులు వుగా దర్శనం లభించేలా ప్రత్యేక ఏర్పాటు చేసా రు. ఈ కార్యక్రమం లో ఆర్య వైశ్య సంఘ పెద్ద లు తమ్మాన వెంకట సత్యనారాయణ, కేశవరపు వెంకట సత్యనారాయణ, ఆర్య వైశ్య సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శ్రీ బాల బాలాజీ హుండీ ఆదాయం రూ.42.90 లక్షలు

**మామిడికుదురు , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 73 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ. 42,57,068 లు, అన్నప్రసాదం హుండీ నుండి నగదు రూ. 32,967 లు వెరసి మొత్తంరూ. 42,90,035 లు వచ్చినట్టు ఆలయ సహాయ కమీషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ ఆదాయం తోపాటు బంగారం.. 4గ్రాములు,వెండి.. 35 గ్రాములు సమకూరినట్టు ఈఓ పేర్కొన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమం జిల్లా దేవదాయశాఖ



అధికారి,సహాయ కమిషనర్ అమలాపురం తణిఖీదారు దేవదాయ శాఖ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగాయి. అర్చక స్వాములు, గ్రామస్థులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది,పత్రికా ప్రతినిధులు,బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ప్రయాణికులు పట్ల మర్యాదగా ప్రవర్తించాలి




**పిఠాపురం , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

ఢిల్లీ ఎర్రకోట కారులో బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవన్ ఆదేశాలు మరియు ఏఎస్పి దేవరాజ్ మనిషా పటేల్ ఉత్తర్వులతో పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ ఉప్పాడ బస్టాండ్ దగ్గర ఆటో యూనియన్ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికులు పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, ఆటోలో ప్రయాణిస్తున్న అనుమానితులను గుర్తించి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. రైల్వే స్టేషన్ నుండి, బస్ స్టేషన్ నుంచి గాని బ్యాగులు, సంచులు తీసుకొచ్చే వ్యక్తులు అనుమానంగా ఉంటే మాకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లు మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుని, కుటుంబాలను వీధిన పడయొద్దని హెచ్చరించారు. పిఠాపురం పట్టణంలో బంగారమ్మ రావి చెట్టు సెంటర్, ఉప్పాడ బస్టాండ్ లో ట్రాఫిక్ అంతరాయం సమస్య ఎక్కువగా ఉందని సూచించారు. ఆటోలు రోడ్లపై క్రమశిక్షణ పద్ధతులో ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణం ఎస్సై మణికుమార్, ఆటో డ్రైవ ర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దవులూరి లచ్చ బాబు, కార్యదర్శి బండి సత్తిబాబు, వేణు శ్రీనుబాబు ఎమ్మెస్‌రాజు,బండిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రోడ్ ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గింది : ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్

**జగ్గంపేట , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గింది అని ఏలూరు రేంజ్ ఐజీ జి.వి. జి అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తో కలిసి వార్షిక తనిఖీల్లో భాగంగా జగ్గంపేట లో సర్కిల్ కార్యాల యాన్ని సందర్శించారు. సర్కిల్ కార్యాలయం ఆవరణ లో ఏర్పాటు చేసిన పోలీస్ సంక్షేమ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ ప్రమాదా లను అరికట్టడానికి తమ వంతు సహాయక చర్యలు చేపడుతున్నా మన్నారు. అదే విధంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే లారీ డ్రైవర్లను చల్లటి నీళ్లతో ముఖాలు కడుక్కోవాలని , కొద్దిసేపు విశ్రాంతి తీసుకో వాలని అవగాహన తెలియజేయాలని




తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్పి శ్రీ హరిరాజ్ జగ్గంపేట సిఐ వై ఆర్ కే శ్రీనివాస్, జగ్గంపేట ,గండేపల్లి , కిర్లంపూడి ఎస్సైలు రఘునాథ రావు , శివనాగబాబు , సతీష్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు

# అమలాపురంలో మిస్సింగ్ అయిన బాలిక ఆచూకీ లభ్యం

### - పరారీలో నిందితుడు
### - తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**అమలాపురం టౌన్ , నవంబర్ 11 ( ప్రభాతవార్త )**

అమలాపురంలో ఒక ప్రైవేట్ స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న బాలిక సోమవారం సాయంత్రం మేనమామ వరస అయిన ఒక వ్యక్తి పాపను తీసుకెళ్లిన ఘటన జిల్లాలో సంచలనగా మారింది. కాకినాడ తీసుకువెళ్లిన కిడ్నాపర్ తిరిగి తన స్వగ్రామం అయిన పి గన్నవరం చేరుకున్నాడు. రాత్రిగం 10.13 నిమిషాలకు సీసీ పుటేజ్ లో గుర్తించారు. అయితే పాపను తీసుకుని 20 ఎకరాల అరటి టోట లోకి వెళ్లి కిడ్నాపర్ దాక్కున్నాడు. అమలాపురం పట్టణ సిఐ వీరబాబు ఆధ్వర్యంలో రాత్రంతా పాప కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. మంగళవారంఉదయం పాపని బెల్లంపూడి వైపు నడిపించుకుంటూ తీసుకు వెళ్తుండగా భవానీలు గుర్తుపట్టారు. పాపను తండ్రి కముజు రమణకు పట్టణ పోలీస్లు అప్పగించారు. నిందితుడు పరార్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు చంటి చెడు వ్యసనాలకు బానిసై పాపను కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. గతంలోనూ పక్క వాళ్ళని బండి అడిగి తాకట్టు పెట్టిన రికార్డ్ ఉన్నట్లు తెలిపారు.

# పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ అన్నారు. మంగళవారం కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద జిల్లా పరిశ్రమలు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశ్రమలు ఉపాధి కల్పన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పి నారాయణ పాల్గొని పలు పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, పరిశ్రమల స్థాపనకు కాకినాడలో ఉన్న ప్రత్యేక వనరులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి, పెదఈర్లపాడు నుంచి కాకినాడ జిల్లాలో 4 ఎంఎస్ఈలకు వర్చువల్ గా శంఖుస్థాపన చేశారు. అనంతరం కాకినాడ పోర్టులో ఎంఏటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారుగేటర్స్ పరిశ్రమ, తునిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ




కాంప్లెక్స్ ల ఏర్పాటుకి శిలాఫలకాలను మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చారన్నారు. ఈ పర్యటనల ద్వారా రాష్ట్రంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారని, దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు పరిశ్రమలు ఎంతో కీలకం అనే విషయాన్ని గుర్తించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, పరిశ్రమల స్థాపనకు కాకినాడలో ఉన్న ప్రత్యేక వనరులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని కాకినాడ పోర్టు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి మార్గదర్శకత్వంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు నూరు శాతం కృషి చేయడం జరుగు తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి 22 జిల్లాల్లో ప్రారంభిస్తున్న ఎంఎస్ఈలకు సంబంధించి కాకినాడ జిల్లా లో పరిశ్రమలకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాకినాడ జిల్లాలో గడిచిన ఆరు నెలలు గా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖా స్తులు ఒకటి కూడా పెండింగ్ లో లేదన్నారు. ఇందు కు ప్రతి నెల సమావేశాలు నిర్వహించి పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అభివృద్ధిని కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరి మితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేలా వివిధ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారన్నారు. కాకినాడ పోర్టు నుంచి జల రవాణా పెరిగిన నేపథ్యంలో కాకినాడ పోర్ట్ అభివృద్ధిపై అధికారి యంత్రాంగం దృష్టి సారిస్తే కాకినాడ మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశం లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు


# బాధితులకు 11 మొబైల్ ఫోన్లు అప్పగించిన పోలీసులు



**రావులపాలెం,నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

రావులపాలెం : వివిధ ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను మంగ ళవారం పోలీసులు యజమానులకు అప్పగించారు. రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టౌన్ సిఐఎం. శేఖర్ బాబు రూ. 4.20 లక్షల విలువైన 11 మొబైల్ ఫోన్లను వారి యజమానులకు అంద జేసారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్‌బాబు మాట్లా డుతూ ప్రజలు ఏ ప్రాంతంలో ఫోన్ పోగొట్టుకున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మొబైల్ ట్రేసింగ్ పద్ధతుల ద్వారా ఫోన్లను కనుగొనడం సాధ్యమవు తుందని స్పష్టం చేశారు. ఫోన్ దొరికిన తర్వాత తప్పు డు ఉపయోగాలు, ఆర్థిక మోసాలు జరుగు తున్నాయన్న విషయాన్ని గుర్తుచేసి, ఇలాంటి సంఘట నలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూ చించారు. తమ మొబైల్ ఫోన్లు దొరుకుతాయని ఊహించలేదని, పోలీసులు తనిఖీలు చేపట్టి తిరిగి అందజేయడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.

# స్కూల్ బస్సు క్రింద పడి చిన్నారి మృతి



**ఆత్రేయపురం,నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

అన్నయ్య పవన్ ను స్కూల్ బస్సు ఎక్కించుటకు అమ్మతో కలసి మూడేళ్ల చిన్నారి హారిణి వరలక్ష్మి తిరిగిరాని లోకానికి వెళ్ళింది. వివరాల్లోకి వెళ్లగా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి హరిణి వరలక్ష్మి అను అమ్మాయి వాళ్ళఅమ్మ తో కలసి అన్నయ్య పవన్ ను స్కూల్ బస్ ఎక్కించటానికి వెళ్ళింది. ఉన్నట్టుండి వేగంగా పరిగెత్తు కొనివెళ్ళిడంతో స్కూల్ బస్సు యొక్క వెనకాల చక్రాల కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం తగలడం వల్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆ అమ్మాయి తల్లి అయిన నాగిరెడ్డి సురేఖ ఇచ్చిన ఫిర్యాదుపై ఆత్రేయపురం ఎస్సై పి, రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు అజరామం : ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు అజరామరమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు .మంగళవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం



వంటి పలు మహోన్నత ఉద్యమాల్లో పాల్గొని దాదాపు 10 సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 11 సంవత్సరాల పాటు విద్యాశాఖామంత్రిగా సేవలందించి దేశంలో విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని ఆయన గుర్తుచేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వం లో..భూ సమస్యల పరిష్కారానికి చర్యలు...రైతులు సద్వినియోగం చేసుకోండి : మండల సర్వేయర్ పెద్దిరాజు




**ఆత్రేయపురం , నవంబర్ 11 ( ప్రభాతవార్త )**

భూ సమస్యల పరిష్కారానికి నామమాత్రం ఫీజుతో జాయింట్ ఎల్పీఎంల ను సబ్ డివిజన్ చేసుకునే అవకాశం కూటమి ప్రభుత్వం ఇస్తుందని దానిని రైతులు సద్వినియోగం చేసుకుని సొంత భూమికి ఎల్ పి ఎం పొందవచ్చునని మండల సర్వేయర్ పెద్దిరాజు అన్నారు. మంగళవారం మెర్లపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ఎం. భాను గ్రామ సభలో రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. మండల సర్వేయర్ పెద్దిరాజు మాట్లాడుతూ గతంలో చేసిన రీ సర్వేలో భాగంగా కొందరు రైతులు రికార్డులను సరిగా అందించకపోవడంతో సర్వే బృందాలు ఆ సర్వే నెంబర్ లో గల మొత్తం భూమికి అందరు రైతులు పేరిట జాయింట్ పార్సెల్ నెంబర్ (ఎల్ పి ఎం) ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ మెర్ల వీరబాబు గ్రామ టిడిపి అధ్యక్షుడు మల్లవరపు నాగరాజు గ్రామ రెవెన్యూ అధికారి వాసు, గ్రామ సర్వేయర్ హేమంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక వన సమారాధనకు విచ్చేయాలి

**అంబాజీపేట , నవంబర్ 11 ( ప్రభాతవార్త ) :**

అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో ఈనెల 14న కాపు యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కాపు వన సమారాధనకు కాపు నాయకులు, సోదరులు, మహిళలు విచ్చేయాలని కాపు సామాజిక వర్గీయులు కోరారు. ఈ



మేరకు కొర్లపాటివారిపాలెంలో వేం చేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికను మంగళవారం విడుదల చేశారు.

## దుర్గమ్మవారి ఆలయానికి

# పటిష్ట భద్రత

● 14 నుండి రూ.500 టికెట్ నిలిపివేత

● దుర్గమ్మకి కంప్యూటర్ పరికరాల విరాళం

ఇంద్రకీలాద్రి, నవంబరు 11 ప్రభాతవార్త: దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులకు పటిష్ఠభద్రత కల్పించే దిశగా ఇఒ చర్యలు తీసుకున్నారు. మహామండపంలో మంగళవారం భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. దుర్గమ్మవారిని కార్తీకమాసం చివరిరోజుల్లో భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశముందని, ఈ నేపథ్యంలో నవంబర్ 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2.30 వరకు రూ.500 టికెట్ నిలిపివేస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా అందరికి బంగారు వాకిలి నుండి మాత్రమే దర్శనం వుంటుందన్నారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఒ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీక మాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఒ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### కంప్యూటర్ పరికరాల విరాళం



దుర్గమ్మవారి ఆలయానికి మంగళవారం ముంబైకు చెందిన హరికృష్ణారెడ్డి,, కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన కంప్యూటర్ పరికరాలను అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు ఇచ్చారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

## పోక్సోకేసులో నిందితుడు అరెస్ట్

తిరుమల, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి: బాలికకు మాయమాటలతో నమ్మించి లైంగికంగా ఇబ్బందిపెట్టిన నిందితుడు ఉపాధ్యాయుడుని పోక్సో కేసులో తిరుపతి పోలీసులు అరెస్ట్‌చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసే జలపతిరెడ్డి అదే పాఠశాలలో చదవుతున్న బాలికను మాయమాటలతో మూడేళ్ళుగా కలసి తిరుగుతున్నాడు. కూతురు మానసిక ప్రవర్తన, ఆమెలో మార్పులు గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో షాక్‌కు గురైన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అరెస్టు చేశారు.

### టిటిడి ఉద్యోగి పేరుతో మోసాలు

## నిందితుడు అరెస్టు

తిరుమల, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఉద్యోగి పేరుతో ఇంజనీరింగ్‌లో మజ్దూర్‌గా పనిచేసే శంకరయ్య దళారులతో కలసి భక్తులను మోసం చేశాడు. శ్రీవారి దర్శనాలు, వసతి కల్పిస్తామని, తోమాల, అర్చన సేవలు తీయిస్తానని నమ్మించాడు. యాత్రికుల నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేశాడు. పైగా తిరిగి ఇవ్వకపోగా దర్శనాలు చేయించలేదు. దీంతో భక్తులు పిర్యాదుతో పరారీలో ఉన్న శంకరయ్యను తిరుమల పోలీసులు అరెస్టుచేశారు. భక్తులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.



### క్షతగాత్రులకు మంత్రి నారాయణ పరామర్శ

నెల్లూరు, నవంబరు 11 ప్రభాతవార్త-వైద్యం: నెల్లూరు ఎన్టీఆర్ నగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు మృతిచెందగా, మరి కొంత మందికి తీవ్ర గాయాలైన సంఘటన విషాదాన్ని నెలకొల్పింది. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హుటాహుటిన మంగళవారం విజయవాడ నుండి నెల్లూరుకు చేరుకున్నారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. వారితో మంత్రి నారాయణ మాట్లాడి వివరాలు అడిగారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు మంత్రి సూచించారు. రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందటం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించి ధైర్యం చెప్పానన్నారు.

# కార్యకర్తే అధినేత




● పార్టీలో ప్రతీ ఒక్క కార్యకర్తకూ న్యాయం జరగాలి ● అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ నిర్వహించాలి ● నెలాఖరులోగా అన్ని పార్టీ, నామినేటెడ్ పదవులూ భర్తీ చేస్తాం ● ఎమ్మెల్యేలతో జోనల్ కోఆర్డినేటర్లు సమన్వయం చేసుకోవాలి ● టీడీపీ జోనల్ కోఆర్డినేటర్లకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

అమరావతి, నవంబరు 11 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అధినేతలని, వారందరికీ న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్ మంత్రులు, జోనల్ కోఆర్డినేటర్లదేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల్నయ ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, జోనల్ కోఆర్డినేటర్లతో నారా లోకేష్ భేటీ అయ్యారు. పార్టీకి కార్యకర్తే అధినేత అనే టీడీపీ విధానం పక్కాగా అమలు కావాలని, ఆ దిశగా ప్రతీ కార్యకర్తకు పార్టీలో ప్రాధాన్యం ఉండేలా చూడాలని జోనల్ కోఆర్డినేటర్లకు తేల్చిచెప్పారు. అధికారంలో ఉన్నామనే నిరక్ష్యం వద్దే వద్దని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత కసిగా పనిచేశారో, అంతకంటే ఎక్కువ పట్టుదలతో పనిచేసి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఇంఛార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల వ్యూహారచన చేయాలని జోనల్ కోఆర్డినేటర్లకు ఆదేశాలు ఇచ్చారు. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట తెలుగుదేశం ఇంఛార్జ్‌ల సమన్వయం ఎంతో కీలకం అని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి వెళ్లి పార్టీ వ్యవహారాలపై జోనల్ కోఆర్డినేటర్లు సమీక్షించాలని సూచించారు. ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు సమన్వయం పెంచే బాధ్యత జోనల్ కోఆర్డినేటర్లదేనని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించి, అర్జీలు తీసుకుని వారి స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వైసీపీ ఐదేళ్లలో పెట్టిన అక్రమ కేసులపై సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దామన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు త్వరితగతిన భర్తీ చేస్తామని లోకేష్ చెప్పారు. జోనల్ కోఆర్డినేటర్లు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి నియోజకవర్గాలలో క్లస్టర్, బూత్, కుటుంబ సాధికారసారథులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్‌లు పెన్షన్ల పంపిణీ, గ్రీవెన్స్, క్యాడర్ మీటింగ్స్‌లో తప్పనిసరిగా పాల్గొనే విధంగా చూడాలన్నారు. వీటన్నింటిపైనా జోనల్ బాధ్యులు ఇచ్చిన నివేదికలు అధిష్టానం సమీక్షిస్తుందని తెలిపారు. ప్రమాద బీమా చెక్కులు తగిన సమయంలోనే బాధిత కుటుంబ సభ్యులకు అందజేయాలని కోరారు. పార్టీ డైరెక్షన్‌లోనే ప్రతి నాయకుడు పనిచేసే విధంగా చూడాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్‌లు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీదా రవిచంద్ర, దామచర్ల సత్య, సుజయ్ కృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెల మూడి రవీంద్ర, వేపాడ చిరంజీవిరావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

## ఎపికి అదనపు నిధులు కేటాయించండి



**ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పీడీఎంసీ స్కీం కింద నిధులివ్వండి**


**కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి**

విజయవాడ, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పీడీఎంసీ స్కీం కింద ఆంధ్రప్రదేశ్‌కి అదనపు నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాదాపు గంటపాటు వీరి సమావేశమైయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం, మైనర్ ఇరిగేషన్ తదితర అంశాలపై వీరిరువురు చర్చించారు. మొంథా తుపాన్ వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. ఇక మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సహకారించాలని చౌహాన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. 2024-25, 2025- 26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి మొత్తం రూ.695 కోట్లు ఇవ్వాలని ఆయనను సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి రైతులకు ఇచ్చిన మద్దతు ధరలో కేంద్ర ప్రభుత్వ వాటాను సైతం విడుదల చేయాలన్నారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. గుంటూరు పర్యటనకు వచ్చిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. అమరావతిలోని క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర పరంగా అండగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో ఆధునీక విధానంలో వ్యవసాయసాగుకు అనుగుణంగా అన్ని రాయితీలు, వాటర్ షేడ్ పథకాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం దిశకు తీసుకుని వెళ్తున్నామన్నారు. ఏపీలో పెద్ద ఆర్థిక వనరుగా వ్యవసాయం ఉందన్నారు. నూతన ప్రత్యామ్నాయం పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. ఒక విజన్‌తో చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అంటూ చంద్రబాబును అభినందించారు.

## విస్తుగొలుపుతున్న పరకామణి చోరీ కేసు

● సిఐడికి దిమ్మతిరుగుతున్న అవినీతి బాగోతం ● చెన్నైలో రవికుమార్ ఆస్తులపై ఫోకస్





తిరుమల, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడు కొండలస్వామికి భక్తులు సమర్పించే కానుకలు పరకామణి లెక్కింపులో విదేశీ కరెన్సీ, నోట్లను చోరీ చేసిన కేసు సిఐడిని విస్తుగొలిపిస్తోంది. నిందితుడైన రవికుమార్ పరకామణి భవనంలో పర్యవేక్షణ చేసే డిప్యూటీ ఇఒ, సూపరింటెండెంట్, విజిలెన్స్ విభాగం అధికారులను మభ్యపెట్టి పెద్దజీయంగార్ అండతో ఆడిందే ఆట చేసిందే చోరీ అన్నట్లు ఎవరినీ లెక్కచేయ నితనంగా వ్యవహరించాడనేది సిఐడి అధికారులు తెలుసుకున్న విషయాలు. ఈ విషయాలతో ఎంత కాలంగా పరకామణిలో చోరీ చేస్తున్నాడనేది మాత్రం ఆరా తీస్తున్నారు. తిరుమలలో 2022 ఆగస్టు వరకు హుండీ కానుకల లెక్కింపు శ్రీవారి ఆలయంలోపల జరిగేది. అక్కడ ఏం జరుగుతోందనేది మరింత నిశితంగా కనిపెట్టేవారే లేకపోయారనేది అందిన సమాచారం. అదేగాక టిటిడి ఉద్యోగులు, శ్రీవారి పరకామణిసేవకులు ఆలయంలోపల పరకామణిలో లెక్కించి ఆ తరువాత మహద్వారం గేట్‌నుండి వెలుపలకు వెళ్ళేవారు. సేవకులు కూడా బయోమెట్రిక్ ప్రవేశంలో ఆలయంలోపలకు చేరుకునేవారు. పైగా కొంత ఇరుకుగా ఉండే ఆలయంలో పరకామణి కేంద్రాన్ని 2022లో విశాలమైన వంద కోట్లు రూపాయలుపైగా దాత సహకారంతో నిర్మించిన భవనంలోకి ఆలయం వెలుపలకు మార్చారు. పరకామణి భవనం మార్చిన తరువాత అక్కడ నాణేల, కరెన్సీ నోట్లు లెక్కింపు స్పష్టంగా తెలిసేలా సిసికెమెరాలు రికార్డు జరుగుతుంది. రోజువారీ దినచర్యల్లో భాగంగా పరకామణిలో గుమస్తా సివి రవికుమార్ కూడా 2023 ఏప్రిల్‌లో విధులు ముగించుకుని తన పంచకు కుట్టించుకున్న రహస్య అరలాంటి జేబుల్లో విదేశీ కరెన్సీని దాచుకుని తనిఖీలు లేకుండా బయటకు వచ్చేసేవాడనేది సిఐడి రాబట్టిన కీలక సమాచారం. ఇలా ఎంతకాలంగా కొన్ని వందల కోట్ల రూపాయలు చోరీచేసి ఆ సొమ్ముతో స్థిరాస్థులు, భవనాలు నిర్మించాడనేది కీలకంగా అందిన విషయాలు. అయితే 2023 ఏప్రిల్‌లో జరిగిన చోరీ కేసులో మాత్రమే విజిలెన్స్ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ పట్టుకోవడం జరిగింది. తదనంతరం పరిణామాలతో ఇప్పుడు ఈ కేసులో హైకోర్టు ఆదేశాలతో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో విచారణ సాగుతోంది. విచారణలో ఐదు టీమ్‌లు క్షేత్రస్థాయిలో విషయాలు సేకరించడం, దాని ఆధారంగా శ్రీవారి కానుకగా టిటిడికి ఇచ్చిన 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి అందించినా, వాటి విలువ మార్కెట్లో 40కోట్లు చేస్తుందని సిఐడి డిజి అయ్యన్నార్ మీడియాకు వెల్లడించడం తెలిసిందే. అయితే తిరుపతి, చెన్నై, కర్నాటక, హైదరాబాద్‌లో రవికుమార్ ఆస్తులు లెక్కించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కేసును రాజీచేసి అరెస్టు కాకుండా తప్పించిన గత టిటిడి బోర్డు పెద్దలు, పోలీసు అధికారులకు చర్యలు తప్పవనే భయం కలుగుతోంది. నిందితుడు రవి కుమార్‌కు సహకరించి వెన్నంటి ఉండి సూత్రధారులుగా సహకరించిన వారిని విచారణ చేసే దిశగా వేగవంతం చేస్తున్నారు. రవికుమార్ విషయంలో సహకరించిన గత విజిలెన్స్, గత టిటిడి పెద్దలు, గత పోలీస్ అధికారుల పాత్రను తేల్చనున్నారు. తదుపరి డిసెంబర్ 2 తరువాత అరెస్టులు కూడా జరిగే అవకాశం ఉందనేది తెలుస్తోంది.

## బీహార్‌లో రికార్డు పోలింగ్ 68.76 శాతం

**కిషన్‌గంజ్‌లో అత్యధికంగా 76 శాతం నమోదు**

**చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం**

**8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ముగిసిన పోలింగ్**

**14న బీహార్‌తోపాటు ఉపఎన్నికల ఓట్ల లెక్కింపు**




న్యూఢిల్లీ/పాట్నా, నవంబరు 11: బీహార్‌లో రికార్డు స్థాయిలో 68.76శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఏ అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు నమోదైన అత్యధిక పోలింగ్ శాతం నమోదు కావడమే కాకుండా మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశముందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. రెండో దశ జరిగిన 20 జిల్లాలో కనీసం నాలుగు జిల్లాల్లో 70శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. కిషన్‌గంజ్ 76.26శాతం, కతిహార్ 75.23శాతం, పూర్నియా 73.79శాతం, సుపాల్ 70.69శాతం నమోదైంది. మొదటి దశలోనూ అత్యధికంగా పోలింగ్ 64.46 శాతం నమోదైన విషయం తెలిసిందే. ఇది 2020లో నమోదైన 62.57శాతం కంటే 2.09శాతం ఎక్కువ. ఇది మొత్తంగా బీహార్‌లో రెండో దశ పోలింగ్ చెదురుముదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సాతామర్హి, మధుబాని, సుపాల్, అరారియా, కిషన్‌గంజ్, గయా తదితర జిల్లాలోని కొన్ని చోట్ల బిజెపి, ఆర్‌జెడి కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జెడియు అభ్యర్థి వాహనంపై ఆర్‌జెడి పార్టీ శ్రేణులు రాళ్లు రువ్వారు. దొంగ ఓట్లు వేస్తున్నారంటూ కాంగ్రెస్- బిజెపి శ్రేణుల మధ్య వాగ్వాదాలు చెలరేగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇక దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 8 అసెంబ్లీ స్థానాలకు మంగళశారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జమ్మూకాశ్మీర్ లోని బుద్గామ్‌లో 48శాతం పోలింగ్ నమోదు కాగా, నగ్రోటాలో 72శాతం నమోదైంది. రాజస్థాన్ లోని అంటా నియోజకవర్గంలో అత్యధికంగా 79.32శాతం పోలింగ్ నమోదైంది. ఒడిశాలోని నుపాడలో 75.39 శాతం, మిజోరంలోని డంపాలో 75.15 శాతం, జార్ఖండ్‌లోని ఘట్‌శిల్‌లో 73.88 శాతం, పంజాబ్‌లోని టర్న్‌టరన్‌లో 60.95 శాతం, తెలంగాణలోని జూబ్లీహిల్స్‌లో 47 శాతం పోలింగ్ నమోదైంది. బీహార్‌తోపాటు 8 అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరుగనుంది.

## 39లక్షల మందికి కేన్సర్ స్క్రీనింగ్

**మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



సచివాలయం, నవంబరు 11 ప్రభాత వార్త: క్యాన్సర్ వా ్యదులను ప్రాథమిక దశలోనే గురి ్తంచేందుకు చేపట్టిన అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నివారణ కార్యక్రమం 4.0 ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రంలో 39లక్షల మందికి స్క్రీ నింగ్ పరీక్షలు చేసి నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మహిళలకు నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు జరుగు తున్నాయి. మగవారికి నోటి క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు జరిగాయి. పరీక్షలు చేయించుకున్న వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ 9,963మంది, సర్వైకల్ క్యాన్సర్ 22,861 మంది మహిళలు అనుమానిత లక్షణాలు కలిగినవారు ఉన్నారు. నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు కలిగినవారు 26,639మంది ఉన్నారు. వీరిని మరో మారు ఆయా ప్రాంతాల పిహెచ్‌సి వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారిని ఆయా జిల్లాల్లోని బోధనాసుపత్రులకు పంపుతున్నారు. అక్కడి అంకాలజిస్టులు మరోమారు క్యాన్సర్ అనుమానిత కేసులను పరిశీలించిన అనంతరం వ్యాధి నిర్ధారణ చేస్తారు. తదనుగుణంగా చికిత్స మొదలవుతుంది. ఈ చికిత్స నిమిత్తం బోధనాసుపత్రుల్లో ప్రత్యేకంగా 222 నెంబర్‌తో ఓపి రూమ్ కేటాయించారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.



## బ్లడ్‌టెస్ట్‌తో కేన్సర్ గుర్తింపు

**శాస్త్రవేత్తల అధ్యయనంలో అద్భుత ఫలితాలు**

న్యూఢిల్లీ, నవంబరు 11: క్యాన్సర్ మహమ్మారి ప్రపంచాన్ని భయపెడుతున్న తరుణంలో వైద్య రంగంలో ముఖ్యమైన పరిశోధనలు వెల్లడి అయ్యాయి. లక్షణాలు బయటపడక ముందే, కేవలం ఒక సాధారణ రక్త పరీక్ష ద్వారా అనేక రకాల క్యాన్సర్లను గుర్తించే సరికొత్త విధానం అందుబాటులోకి రాబోతోంది. ఈ లిక్విడ్ బయాప్సీ పరీక్ష ద్వారా, వ్యాధి ముదిరిపోయి నాలుగో దశకు చేరే కేసులను గణనీయంగా తగ్గించవచ్చని ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకారం, ఒక్క 2020లోనే క్యాన్సర్ వల్ల కోటి మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రొమ్ము, గర్భాశయ, పెద్దప్రేగు వంటి కొన్ని క్యాన్సర్లకు మాత్రమే ప్రామాణిక స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. దీంతో 70 శాతానికి పైగా కొత్త క్యాన్సర్ కేసులు, లక్షణాలు ముదిరిన తర్వాతే బయటపడుతున్నాయి. దీనివల్ల చికిత్స కష్టమవడమే కాకుండా, ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది. అయితే, ఒకే రక్త నమూనాతో పదుల సంఖ్యలో క్యాన్సర్లను గుర్తించే మల్టీక్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ టెస్టులు ఈ పరిస్థితిని మార్చగలవని పరిశోధకులు చెబుతున్నారు. అమెరికన్ క్యాన్సర్ సొసైటీకి చెందిన క్యాన్సర్ అనే ప్రముఖ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. 'క్యాన్సర్‌గార్డ్' అనే టెస్టును ఉపయోగించి ఈ పరిశోధన చేశారు. అమెరికాలోని 50 లక్షల మంది ప్రజల 10 సంవత్సరాల డేటాను తీసుకుని, వారికి ఏటా ఈ రక్త పరీక్ష చేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో సిమ్యులేషన్ ద్వారా అంచనా వేశారు.



ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యకు ధన్యవాదాలు తెలుపుతున్న శ్రీరామ

## దాసరి సంక్షేమ అభివృద్ధి సొసైటి సంచాలకుని మనబోతుల శ్రీరామ

**రాష్ట్రంలో వివిధ సంస్థలకు డైరెక్టర్ల నియామకం**

విజయవాడ, నవంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి: దాసరి సంక్షేమ అభివృద్ధి సొసైటీ సంచాలకుని మనబోతుల శ్రీరామ నియమితులయ్యారు. మనబోతుల శ్రీరామ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సమయం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. పలు పదవులు నిర్వహించారు. ఆయనను ప్రభుత్వం దాసరి సంక్షేమ అభివృద్ధి సొసైటీ సంచాలకునిగా నియమించింది. నందిగామకు చెందిన మనబోతుల శ్రీరామ ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ప్రభుత్వం పలు కార్పొరేషన్లు, బోర్డులకు 122 మంది డైరెక్టర్లను నియమించింది. ఈ మేరకు జాబితా విడుదల చేసింది. తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలకు ఇందులో ప్రాధాన్యత నిచ్చింది. ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డుకు 13 మంది, లేబర్ వెల్ఫేర్ బోర్డుకు 11 మంది, రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు 15, కళింగ కోమటి/ కళింగ వైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు 15, దాసరి సంక్షేమ అభివృద్ధి సొసైటీకి 15, ముదలియార్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు 15 మందితో పాటు మరికొన్ని సంస్థల్లో డైరెక్టర్లను నియమించింది.

### బెట్టింగ్ యాప్‌ల కేసు

## సిఐడి విచారణకు విజయ్ దేవరకొండ



హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా అనేక మందిని బలిగొన్న బెట్టింగ్ యాప్‌ల అక్రమాలపై తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధనా విభాగం సిఐడి తొలిసారిగా విచారణ చేబట్టింది. గత మార్చి నెల 31వ తేదీన బెట్టింగ్ యాప్‌లపై లోతుగా విచారణకు సిట్ ఏర్పాటవడం తెలిసిందే. బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి పంజాగుట్టతో పాటు మియాపూర్ పోలీసు స్టేషన్‌లలో సినీ తారలతో పాటు టివి నటులు, యాంకర్లపై కేసు లుండడం తెలిసిందే. వీరితో పాటు యాప్‌ల యజమానులపైనా కేసులు నమోదు చేయడం తెలిసిందే. కాగా కేసులు నమోదైన యాంకర్లు, నటులలో కొందరు విచారణకు హాజరు కాగా మరికొందరు సమయం కోరారు. బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి సిట్ తన విచారణను 90 రోజుల్లో పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికను అందించాల్సి వుంటుం దని సర్కారు అప్పట్లో ఆదేశించగా దీనికి సంబంధించి ఇప్పటికీ విచారణ ఇంకా సాగుతూనే వుంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా నెలన్నర క్రి తం సోదాలు చేబట్టిన సిఐడి కొన్ని ఆధారాలను సేకరించింది. కొందరికి నోటీసులు ఇచ్చింది. ఇదే క్రమంలో మంగళవారం నాడు సినీ నటుడు వి జయ్ దేవరకొండను గంటన్నర పాటు సిఐడి ఆర్థిక నేరాల విభాగం అధికారులు విచారించారు. విజయ్ దేవరకొండతో పాటు మరో నటుడు ప్రకాష్ రాజ్ కూడా హాజరు కావాల్సి వుండగా ఆయన వ్యక్తిగత పనుల కారణంగా రాలేదు. విచారణ సందర్భంగా విజయ్ దేవర కొండ తాను ప్రమోట్ చేసిన యాప్‌లు చట్టబద్ధమైనవేనని సిఐడి అధికారులకు చెప్పినట్లు తెలిసిది. ఇందులో కొన్ని యాప్‌లు తెలంగాణలో ఓపెన్ అవవని చెప్పినట్లు తెలిసింది. విజయ్ దేవరకొండ వాంగ్మూలం తీసుకున్న తరువాత అవసరం అయితే మరోసారి రావాలని సిఐడి అధికారులు అతన్ని కోరినట్లు తెలిసింది. కాగా ఈ యాప్‌లపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ విచారిస్తుండడం విదితమే. ఇందులో భాగంగా విజయ్ దేవరకొండతోపాటు ప్రకాష్ రాజ్, రానా దగ్గుపాటి తదితరులను ఈడీ అధికారులు పలుమార్లు విచారించారు

## సినీనిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కేసు నమోదు

హైదరాబాద్ (ఫిల్మ్‌నగర్), నవంబరు 11, ప్రభాతవార్త: సినీనిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కేసు నమోదైంది. ఫిల్మ్ నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్ నగర్ రోడ్ నంబర్ 7లో ఉన్న ఒక ఇంటిని బెల్లంకొండ సురేష్ అక్రమంగా ఆక్రమించారంటూ శివప్రసాద్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను కొంతకాలంగా బంధువుల వద్ద ఉంటున్నానని, ఈ సమయంలో బెల్లంకొండ సురేష్ అనుచరులు ఇంటితాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారన్నారు. ఇంటిలోని సామగ్రిని, గోడలను ధ్వంసం చేశారు. ఆయన తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఈ విషయాన్ని గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంపై మాట్లాడ టానికి వెళ్లిన తమ సిబ్బందిని బెల్లంకొండ సురేష్ బెదరించారంటూ శివ ప్రసాద్ ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాకినాడలో రివర్ మొబిలిటీస్టోర్ ప్రారంభం



ఉమ్మడి తూర్పుగోదావరి
**జిల్లా బ్యూరో్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారు రివర్ మొబిలిటీ, ఆంధ్రప్రదేశ్‌లో తన రిటైల్ ఉనికిని విస్తరిస్తూ కాకినాడలో తన ఆరవ స్టోర్‌ను ప్రారంభించింది. 1144 చదరపు అడుగుల విస్తీర్ణంలో, బ్యాంక్ కాలనీ (సర్పవరం జంక్షన్ సమీపంలో)ఉన్న ఈ కొత్త రివర్ స్టోర్‌ను శ్రీ జయ జోషిత్ మొబిలిటీ భాగస్వామ్యంతో స్థాపించారు. వినియోగదారులకు ఆత్మీయమైన బ్రాండ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించిన ఈ స్టోర్‌లో రివర్ యొక్క ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ఇండి, దాని ఉపకరణాలు మరియు వస్తువుల శ్రేణి ప్రదర్శించబడుతుందని స్టోర్ ప్రారంభం సందర్భంగా రివర్ మోబిలిటీ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి తెలిపారు. ఇటీవలి నెలల్లో, రివర్ మొబిలిటీ దేశవ్యాప్తంగా తన ఉనికిని వేగంగా విస్తరించిందన్నారు. ప్రత్యేకంగాపశ్చిమ, మధ్య మరియు ఉత్తర భారతదేశంపై దృష్టి సారించి, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి కొత్త స్టోర్‌లను ప్రారంభిస్తోందన్నారు. తన విస్తరణ ప్రణాళికలలో భాగంగా, కంపెనీ 2026 నాటికి 100 కంటే ఎక్కువ నగరాల్లో ఉనికిసాధిం చాలనే లక్ష్యంతో ఉందన్నారు. అదనంగా, పాండిచ్చేరి, కాలికట్వంటి మార్కెట్ల లో కొత్త స్టోర్‌లను ఏర్పాటు చేసి దక్షిణ భారతదేశంలో తన స్థాయిని మరింత బలపర చనుందన్నారు. కాకినాడ స్టోర్ ప్రత్యేకమైన వాతావరణాన్ని కలిగి ఉంది, రివర్ బ్రాండ్ యొక్క సారాన్ని ప్రతిబిం బించేలా డిజైన్ చేయబడింది. స్టోర్‌లోని ముఖ్య ఆకర్షణగా, ఇండీరోజువారీ జీవితంలో ఎలా కలిసిపోతుందో చూపించే ప్రత్యేకంగా రూపొందించిన నివాస స్థలం ఉందన్నారు. ఇది రివర్ యొక్క సిద్ధాంతానికి అనుగుణంగా, ప్రజలను వారి గమ్యస్థానానికి చేరవేయాలనే భావనను ప్రతి బింబి స్తుందని అన్నారు. "భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలి టీని అందుబాటులోకి తీసుకురావాలనే మా ప్రయాణంలో కాకినాడలోని కొత్త స్టోర్ మరో అడుగు అని చెప్పారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులపై ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం : రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



**అంబాజీపేట, నవంబర్ 11 (ప్రభాతవార్త)** పేదవారు తమ వైద్యం కోసం పెట్టుకున్న ఖర్చును కొంతైనా తిరిగి ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సదుద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులపై నియోజవర్గ వైసీపీ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని కమ్యూనిటీ భవనం వద్ద మండల కూటమి శ్రేణులు మంగళవారం సమావేశ మయ్యారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల జారీలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పైన, కూటమి శ్రేణుల పైన ఆరోపణలు చేయడం సంస్కారహీనమన్నారు. పేద ప్రజలకు అందించే సాయం పై కూడా రాజకీయం చేసి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మీరు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేకుంటే బహిరంగ క్షమాపణకు సిద్ధమవుతారో, మీపై మేము తీసుకునే లీగల్ చర్యలకు బాధ్యులవుతారో తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పి.గన్నవరం నియోజవర్గంలో 16 నెలల కాలంలో సుమారు రూ.4.60 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధిని చెక్కల రూపంలో తెచ్చి పేద ప్రజలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదుకున్నారని తెలిపారు. నియోజవర్గంలో ఎమ్మెల్యేకు, కూటమి పార్టీలకు మంచి పేరు వస్తుందని తట్టు కోలేక నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం హర్షనీయం కాద న్నారు.అంతకుముందు అంబాజీపేట పోలీస్ స్టేషన్ సమీపం లోని పద్మజా గ్రాండ్ ఫంక్షన్ హాల్లో కూటమి శ్రేణులు సమా వేశమై వైసిపి నాయకుడు గన్నవరపు శ్రీనివాస రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో జనసేన,టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు ,సర్పంచులు, వార్డు సభ్యులు, సొసైటీ చైర్మన్లు,పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఫీజురీయంబర్స్మెంట్ ఫీజులు కట్టమని విద్యార్థులను ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ కీర్తి చేకూరి



ఉమ్మడి తూర్పుగోదావరి
**జిల్లా బ్యూరో్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులను ఫీజు రీయంబర్స్మెంట్ కట్టమని కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తున్నారు. ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సమస్య పరిష్కారంచమని గతంలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్య విన్నవించారు. నేటికి సమస్య పరిష్కారం కాకపోవడంతో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు.కలెక్టర్ స్పందించి కాలేజి యాజమాన్యాన్ని పిలిపించి, విద్యార్థులు, ఎస్.ఎఫ్.ఐ నాయకత్వం తో కలిసి మాట్లాడి ఫీజు రీయంబర్స్మెంట్ వచ్చే వరకు విద్యార్థుల వద్ద నుండి ఫీజులు వసూళ్ళ చేయకూడదని ఆదేశాలు ఇచ్చారు. ఫీజు రీయంబర్స్మెంట్ ప్రభుత్వం నుంచి వచ్చే వరకు కన్వీనర్ కోటా విద్యార్థుల నుండి ఫీజులు వసూళ్ళ చేయకూడదని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ యాజమాన్యానికి ( గైట్ ) కలెక్టర్ తెలియజేసారు. ఆందోళన చేసిన విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని గైట్ యాజమాన్యానికి తెలిపారు. ఫీజు రీయంబర్స్మెంట్ బకాయితో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలియజేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు వై. భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ యాజమాన్యం విద్యార్థులతో బలవంతపు ఫీజుల వసూళ్ళకు పూనుకుని గత వారంలో జరుగవలసిన మిడ్ పరీక్షలు నిలిపి వేసి ఫీజుల వసూళ్ల దందాని జరిపిందని అన్నారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులపై ఒత్తిడి చేసినా సమస్యని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థులపైన వేధింపులు గురిచేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, గైట్ యాజమాన్యం నుండి రిజిస్ట్రార్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. గైట్ కళాశాల విద్యార్థులు, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కార్తిక్, సౌమ్య, జ్యోతి, నాగ చైతన్య, హేమంత్ ఎస్.ఎఫ్.ఐ నాయకులు వీరబాబు తదితరులుపాల్గొన్నారు.

# కట్టుంగ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం, నవంబర్ 11 (ప్రభాతవార్త):** కట్టుంగలో రైతు సేవా కేంద్రం నందు.ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు .మంగళవారం మండలంలోని కొనుగోలు కేంద్రం లో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా, రైతులకు అను గుణంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.మొంథా తుఫాను వల్ల పంట నష్టం అధికంగా జరిగిందని, నియోజకవర్గంలో 6614 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారని అన్నారు. రైతులందరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హెక్టార్ వరికి రూ.25వేలు, అరటికి రూ.35 వేలు, మిగిలిన కూరగాయలు పూల తోటలు తదితర పంటలకు రూ.25వేలు నష్ట పరిహారం అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుఫాను ముగిసిపోయిన ఓడల రేవు వచ్చి జిల్లాలో పర్యటించి రైతుల కష్టాలు తెలుసుకున్నారన్నారు. అన్నదాతల ఇబ్బందులను గమనించి గతంలో ఉన్న ఇన్పుట్ సబ్సిడీలను వరికి రూ.17వేల నుంచి రూ.25వేలకు, అరటికి రూ.34వేల వరకూ పెంచారన్నారు. నియోజకవర్గంలో 13 వేల మందికి 25 కేజీల బియ్యం 5 రకాల నిత్యావసర వస్తువులు అందివ్వడం జరిగిందని తెలిపారు. 29 వేల మందికి అగ్నికుల క్షత్రియులకు 50 కేజీల బియ్యం 5 రకాల నిత్యావసర వస్తువులు అందివ్వడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులు ఎవరూ అపోహలు పెట్టు కోవద్దని తెలిపారు. సాధారణ రకాలు పండించడం జరుగుతుం దన్నారు. 100 కేజీలకు రూ.2,369లు, 75 కేజీల బస్తాకు రూ.1,777లు ధాన్యం ఎమ్పీయం 7029, ఎంటీయూ 1318 రకాలు ఎకరాకు రూ.35బస్తాలు కొనుగోలుకు అవకాశం ఉందన్నారు. రైతులందరూ ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకోసం రూ.5వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సమీకరించడం జరిగిందన్నారు. కొనుగోలు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుం దన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ లో ఎటువంటి దుష్ప్రచారాలను నమ్మ వద్దన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేసే వరకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అలాగే కట్టుంగలో స్థానిక సమస్యల గురించి నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఇంటి స్థలాలు, రజక కమ్యూనిటీ హాలు, సిమెంట్ రోడ్లు తదితర అంశాలను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, వ్యవసాయ శాఖ ఏడీ. ఎమ్.వి.రామ రావు, అగ్రికల్చర్ ఏవో భార్గవ్ మహేష్, మండల టిడిపి అధ్యక్షుడు కునపూలి రామకృష్ణం రాజు, దొడ్డపనేని త్రినాథ రావు,కాయల జగన్నాధం, పి.ఎస్ రాజు, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు శ్రీహరి, నరాల శెట్టి వెంకన్న, మద్దింశెట్టి సత్య నారాయణ, మండల సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ కల్యాణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అధికారులు, నాయకులు,రైతులు , రెవెన్యూ సిబ్బంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుపాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కొత్తపేట, నవంబర్ 11 (ప్రభాతవార్త):** మొంథా ప్రభావంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లాలో జరిగిన వ్యవసాయ,ఉద్యాన పంటలు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వ్యవస్థల నష్టాలపై రూపొందించిన నివేదికలు ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా వివరించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని కేంద్ర పంట నష్ట అంచనాల బృందానికి సమగ్రంగా వివరించి నష్టాల నివేదికలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం మద్దుల మెరక గ్రామంలో వరి సాగు క్షేత్రాలు మరియు ఎగ్జిబిషన్ కొత్తపేట గ్రామాలలో అరటి ఉద్యాన సాగు క్షేత్రాలలో కేంద్ర బృందం విస్తృతంగా పర్యటించి పంట నష్టాల పరిస్థితిని సమీ క్షించారన్నారు. ప్రత్యక్షంగా తుఫాన్ ప్రభావిత ప్రాంత నష్టాలు వ్యాప్తిని బృందం స్వయంగా పరిశీలించి నివేదిక ఆధారంగా నష్టపరిహారం సహాయ ప్యాకేజీ నిర్ణయిస్తారని తెలిపారు. మొంథా తుపాన్ ప్రభావంతో తీర ప్రాంతమైన కోనసీమ జిల్లాకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. కేంద్ర బృందానికి జిల్లా వ్యా ప్తంగా 22 మండలాలలో జరిగిన నష్టాలను జిల్లా కలెక్టర్ ఏడు శాఖల అధికారులు బృంద సభ్యులకు సమగ్రంగా వివ రించారన్నారు. తుఫాన్ నష్టా న్ని మదింపు వేయడానికి కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమీబసు నేతృత్వంలోని సి డబ్ల్యూ సి డైరెక్టర్ శ్రీనివాస్ బైరీ , కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తి.సింగ్ గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా రాష్ట్ర పౌరసరఫరాల సంచా లకులు ఢిల్లీరావు తో కూడిన బృందం జిల్లాకు విచ్చేయగా ముందుగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ స్వాగతం పలికి జిల్లా స్థాయి అధికారులతో కలిసి నష్టాలు అంచనాలను నివే దించారు. రైతుల ఆర్థిక పరిస్థితిని బట్టి అవసరమైన పరిహారాన్ని అందించే దిశగా కేంద్రానికి నివేదించడం జరు గుతుందని బృందం తెలిపిం దన్నారు. పంట నష్టానికి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని బృందం తెలిపిందన్నారు. తుఫాన్ కు ముందు తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు పునరావాస కేంద్రాలు తాత్కాలిక సహాయం ఉపశమన చర్యలను జిల్లా కలెక్టర్ బృంద సభ్యులకు విశదీకరించారు. జిల్లాలో చెట్టు పడి ఒక మహిళ చనిపోయా రని తెలిపారు. వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగిందని, పంట కోత నూర్పుళ్ళు దశలో తుఫాన్లు రావడం రైతాంగానికి తీరని నష్టం వాటిలిందన్నారు. ఆర్ అండ్ బి పంచాయతీ ఆక్వా చెరువులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఓహెచ్ఎస్ఆర్లు విద్యుత్తు స్తంభాలు వంటి మౌలికవసతులు దెబ్బతి న్నాయని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన సహా యక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.జిల్లాలో 1,60,000 ఎకరాలలో వరి సాగు చేపట్టగా వీటిలో 70 వేల ఎకరాలలో మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టం వాటిలిందన్నారు. అదేవిధంగా అరటి తోటలు 2500 ఎకరా లలో దెబ్బతిన్నాయని అదే విధంగా కూరగాయలు తీగ జాతి పంటలు కూడా దెబ్బతి న్నాయని తెలిపారు. జియో కోఆర్డినేట్స్ తో సహా బృంద సభ్యులకు పంట నష్టాలను వివరించామన్నారు. వ్యవసాయ,ఉద్యాన, ఆర్ అండ్ బి, పంచా యతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, జాతీయ రహదారులు తదితర శాఖల కు జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు బృంద సభ్యులకు నివేది కలు ఛాయాచిత్రాల ప్రదర్శన ద్వారా క్షుణ్ణంగా అవ గాహన కల్పించా రన్నారు ప్రతి ఏడాది తీర ప్రాంతంలో తుఫాన్ చూపు తుందని అయినప్పటికి మొ%శీ%థా తుఫాను తీవ్ర ప్రభావాన్ని చూపిందన్నారు. కేంద్ర బృందం పంట నష్టాలపై సానుకూలంగా స్పందించిందని సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ముఖ్య మంత్రితో కేంద్ర బృందం మరొక్కసారి సమావేశమై నష్టాలపై సమీక్షించి తుది నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్న దని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి బోసుబాబు, ఉద్యాన అధికారి బి.వి.రమణ, ఆర్డీవో పి శ్రీకర్, ఆర్ అండ్ బి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## అంబాజీపేటలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం

- బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన



**అంబాజీపేట, నవంబర్ 11 (ప్రభాతవార్త):** శివారాధనకు కార్తీకమాసం ఎంతో పవిత్రమైనదని,కార్తీకమాసంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం మరింత పుణ్య ఫలప్రదమని బ్రహ్మకుమారీలు అన్నారు. స్థానిక పెద్ద వీధిలో ఉన్న ఎ. వి.ఆర్ అండ్ వై.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో అమలాపురం శాఖ బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన తిలకించేందుకు భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగములైన శ్రీ సోమనాథుడు, శ్రీ మల్లికార్జునుడు, శ్రీ మహా కాళేశ్వరుడు, శ్రీ ఓంకారేశ్వరుడు, శ్రీ ఘృష్ణేశ్వరుడు, శ్రీ వైద్యనాథుడు, శ్రీ కేదారేశ్వరుడు, శ్రీ భీమ శంకరుడు, శ్రీ త్ర్యంయంబ కేశ్వరుడు, శ్రీ విశ్వేశ్వరుడు, శ్రీ నాగేశ్వరుడు, శ్రీ రామేశ్వరుడు జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశామని,భక్తులు స్వహస్తాలతో పరమశివునికి పాలాభిషేకం చేసుకునే అద్భుతమైన అవకాశం కల్పించామని తెలిపారు. ఆ నిరాకార జ్యోతిర్బిందు పరమపిత శివ పరమాత్ముని యథార్థ పరిచయాన్ని, ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శనని తిలకించి, అనంతమైన ఆనందాన్ని అవినాశి స్వర్గ ప్రాప్తిని పొందాలని కోరారు. మూడు రోజులపాటు నిర్వహించే ద్వాదశ జ్యోతిర్లింగముల దర్శనం సాయంత్రం 6 గంటల నుండి అందరికీ ఉచితంగా ఉంటుందని బ్రహ్మ కుమారీలు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకున్న భక్తులు



**మామిడికుదురు, నవంబర్ 11 (ప్రభాతవార్త)** మామిడికుదురు మండలం మగటపల్లి గ్రామానికి చెందిన పలువురు స్వామి భక్తులు మంగళవారం పాదయాత్ర చేసుకుంటూ వచ్చి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. మగటపల్లి నుంచి బయలుదేరిన భక్తులు ఈదరాడ, కొమరాడ, మాకనపాలెం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల మీదుగా అప్పనపల్లి చేరారు .భక్తులకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా గోవింద నామస్మరణలతో మార్మోగింది.

## రుణాలు తిరిగి చెల్లించకపోతే భారీ జరిమానాలు పడతాయి..మొండి బకాయిదారుగా కోర్టు ప్రకటిస్తుంది

ఉమ్మడి తూర్పుగోదావరి
**జిల్లాబ్యూరో్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** చాలా మంది రుణం తీసుకొని, ఆపై దానిని తిరిగి చెల్లించకుండా ఉండవచ్చని అనుకుంటారు, తీవ్రమైన ఏమీ జరగదని నమ్ముతారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఒక కేసు ఈ ఆలోచన రుణగ్రహీతలను పెద్ద ఇబ్బందుల్లోకి నెట్టివేస్తుందని చూపించిందని నవీ ఎన్ఎఫ్బిసి ప్రతినిధి చెప్పారు. ఆర్థిక సేవల సంస్థ అయిన నవీ ఫిన్‌సర్వ్, తన రుణాన్ని తిరిగి చెల్లించడానికి నిరాకరించిన కస్టమర్‌పై కోర్టుకు వెళ్లింది. కోర్టు నవీకి అనుకూలంగా తీర్పునిచ్చింది మరియు కస్టమర్ రూ. 83,000 జరిమానా చెల్లించాలని లేదా 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించిందన్నారు. చెల్లింపులు మరియు పరిష్కార వ్యవస్థల చట్టం, 2007లోని సెక్షన్ 25 ప్రకారం, ఈనాక్ బౌన్స్ (మీ బ్యాంక్ ఖాతాలో ఆటో డెబిట్‌కు తగినంత బ్యాలెన్స్ లేనప్పుడు ఇది జరుగుతుంది) చెక్ బౌన్స్ లాగానే పరిగణించబడుతుంది మరియు భారీ జరిమానాలు మరియు 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుందన్నారు.

# సస్టైనబుల్ విభాగం..టాప్ 5లో ఒకటిగా ఎంపికైన టాఫే ట్రాక్టర్స్

ఉమ్మడి తూర్పుగోదావరి
**జిల్లా బ్యూరో్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** అగ్రిటెక్నికా 2025లో, ప్రపంచంలోని అగ్రగామి ట్రాక్టర్ తయారీదారులలో ఒకటైన టాఫే ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ తన తదుపరి తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ టాఫే ఏవీ ఎక్స్ 75" ను ఆవిష్కరించింది. అదే సమయంలో, టాఫే ఈవీ28" ఎలక్ట్రిక్ ట్రాక్టర్ సస్టైనబుల్ ట్రాక్టర్ విభాగంలో "ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2026" అవార్డుకు ఫైనలిస్టుగా ఎంపిక కావడంతో సంస్థ మరో ప్రతిష్టాత్మక మైలురాయిని చేరుకుందని టాఫే చైర్మన్ డాక్టర్ లక్ష్మీ వేణు చెప్పారు. టాఫే ఏవీ ఎక్స్ 75" తో పాటు, సంస్థ తన తాజా ఆవిష్కరణలను కూడా ప్రదర్శించింది. వీటిలో కొత్త దృష్టి మార్గదర్శక వ్యవస్థ, ఆధునిక క్యాబ్ మోడల్ ( టాఫే ఏవీ 1015), అలాగే 74 హెచ్ పీ ఆర్చర్డ్ మరియు ఫ్రూట్ ట్రాక్టర్ మరియు 65 హెచ్ పీ కాంపాక్ట్ యుటిలిటీ సిరీస్ ట్రాక్టర్ ఉన్నాయి. నేడు, సబ్-100 హార్స్‌పవర్ ట్రాక్టర్ల విభాగంలో ప్రపంచ నాయకుడిగా అవతరించాలనే దృష్టితో, టాఫే ట్రాక్టర్ తయారీదారు నుంచి సంపూర్ణ వ్యవసాయ పరిష్కారాల సంస్థగా రూపాంతరం చెందిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రైతులను మరింత శక్తివంతం చేయడానికి ఖచ్చితమైన వ్యవసాయ సాంకేతికత ఆటోమేషన్ మరియు ప్రత్యామ్నాయ శక్తి వేదికలలో కంపెనీ గణనీయమైన పెట్టుబడులు పెడుతోందన్నారు. "65 సంవత్సరాలకు పైగా, టాఫే ఇంజనీరింగ్‌లో శ్రేష్ఠత, విశ్వసనీయత మరియు నాణ్యతకు ప్రతీకగా నిలిచి, ప్రపంచ



వ్యాప్తంగా వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకుందన్నారు. 80కు పైగా దేశాల్లో కార్యకలాపాలతో, ప్రపంచంలోని అతిపెద్ద ట్రాక్టర్ తయారీదారుల్లో ఒకరిగా, మేము 'ప్రపంచం కోసం, ప్రపంచంతో' ఆవిష్కరణలను కొన సాగిస్తూ, రైతులకు ఆధునికమైన మరియు విశ్వసనీయమైన పరిష్కారాలను అందిస్తున్నాము అని చెప్పారు. టాఫే మేనేజింగ్ డైరెక్టర్ మల్లికా శ్రీనివాసన్ మాట్లాడుతూ టాఫే యొక్క ప్రపంచ వ్యూహాన్ని నొక్కిచెప్పారు, "ప్రపంచంలో అత్యధిక డిమాండ్ కలిగిన సబ్-100 హార్స్‌పవర్ ట్రాక్టర్ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా నిలవాలనే లక్ష్యంతో టాఫే ముందుకు సాగుతోందన్నారు. 'కల్టివేటింగ్ ది వరల్డ్' అనే మా తత్వశాస్త్రానికి అనుగుణంగా, ప్రపంచవ్యాప్తంగా రైతులకు స్మార్ట్, అందుబాటులో ఉండే మరియు స్థిరమైన యాంత్రీకరణ పరిష్కారాలను అందించేందుకు బలమైన గ్లోబల్ ఉనికిని నిర్మించడం టాఫే యొక్క సమగ్ర దృష్టిలో భాగం అని చెప్పారు.

# ఆంధ్రా శబరిమలైను సందర్శించిన విద్యార్థులు

- విద్యార్థులచే అయ్యప్ప గీతాలు ఆలపించిన శ్రీనివాసరావు గురుస్వామి



**శంఖవరం, నవంబర్ 11 (ప్రభాతవార్త):** శంఖవరం మండలంలోని సిద్ధివారిపాలెం లో కొలువై ఉన్న సిద్ధి పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆంధ్రా శబరిమలైను తొండంగి మండలం రావికంపాడు గ్రామంలో గల శ్రీ విద్యా వికాస్ స్కూల్ కి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి విద్యార్థులచే అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం విద్యార్థుల చేత స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విద్యార్థులు కొండపై నెలకొల్పిన వెంకటేశ్వర స్వామి, శివుడు, హనుమంతుని విగ్రహాలను సందర్శించి పూజలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో అయ్యప్ప శరణు ఘోషతో ఆంధ్రా శబరిమలై మారు మోగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామిని పూజిస్తే ప్రశాంతత చేకూరుతుందని, సుఖవంతమైన శాంతియుత జీవనం సాగించవచ్చునని తెలిపారు.

# భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం..వాడపల్లి వెంకటేశుడు

- నిత్యాన్నదాన ట్రస్ట్ కు,రూ.1,00,116 విరాళం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ, 6.17,లక్షలు




**ఆత్రేయపురం, నవంబర్ 11 (ప్రభాతవార్త):** భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి మంగళవారం వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తరపూజలు, నిత్యా కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మేలుకొలుపు, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ తదితర కారుక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. రాజమండ్రి రూరల్, కొలమూరుకి చెందిన పిన్నమరెడ్డి ఈశ్వర్, లక్ష్మిదేవి, దంపతులు వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116 లు విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ, 6, 17,713లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఉచిత ప్రసాదవితరణ అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

# డిల్లీ లో జరిగిన పేలుడు ఘటనపై బిజెపి అధ్యక్షుడు తీవ్ర దిగ్బ్రాంతి

- మృతి చెందిన కుటుంబాలకు సంతాపం తెలిపిన బీజేపీ నేతలు

**కాకినాడ రూరల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** దేశ రాజధాని ఢిల్లీలో మెట్రో స్టేషన్ వద్ద జరిగిన పేలుడు ఘటనపై కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నిరప రాధుల కుటుంబాలకు కాకినాడ బీజేపీ శ్రేణులు ప్రగాఢ సంతాపం తెలిపి గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. దేశ భద్రత విషయం లో ప్రధాని మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభు త్వం ఎట్టి పరిస్థితి లో నిందితులను వదిలి పెట్టేది లేదని , శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని ,ప్రధాన నగరాల్లో పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టడం జరిగిందని జరిగిందని. జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు అన్నారు



బిక్కిన విశ్వేశ్వర రావు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

### ప్రపంచ ఛాంపియన్‌షిప్..

# తోమర్ ప్రపంచ రికార్డు



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు 2025, పురుషుల పరుగు ఈవెంట్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డును సమం చేశాడు. అలాగే పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌కు నీరజ్ కుమార్ అర్హత సాధించాడు. ఈజిప్టులోని కైరోలో మంగళవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో భారతదేశానికి చెందిన ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ ఫైనల్స్‌కు చేరడమే కాకుండా ప్రపంచ రికార్డు సృష్టించాడు. తోమర్ మొత్తం 597 పాయింట్లు సాధించి అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు, రెండుసార్లు ఒలింపియన్ అయిన 24 ఏళ్ల తోమర్ ప్రారంభం నుండే మంచి ప్రతిభ కనబరిచాడు. అతను ప్రోన్ పొజిషన్‌లో 200 పరుగులకు 400 పరుగులు సాధించాడు. ప్రపంచ రికార్డు సాధించే దిశగా తోమర్ కొంచెం తడబడ్డాడు. కానీ రెండు స్టాండింగ్ సిరీస్‌లలో వరుసగా 98 మరియు 99 పరుగులు చేసి ప్రపంచ రికార్డును సమం చేశాడు. ఇక ఈ ఈవెంట్‌లో పోటీ పడిన మరో భారతీయుడు నీరజ్ కుమార్ కూడా ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతను మొత్తం 592 పాయింట్లు సాధించి ఐదవ స్థానంలో నిలిచాడు. తరువాత రోజు, ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన సామ్రాట్ రాణా ఈషా సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పాల్గొననున్నారు. ఈ ఈవెంట్‌లో సురుచి సింగ్ మరియు శ్రవణ్ కుమార్ రెండవ భారతీయ జంటగా ఏర్పడనున్నారు.



# కార్టింగ్ ఛాంపియన్‌గా అర్షి

**న్యూఢిల్లీ:** భారతదేశపు తొలి మహిళా జాతీయ కార్టింగ్ ఛాంపియన్‌గా 9 ఏళ్ల అర్షి గుప్తా నిలిచింది. మైక్రోమాక్స్ విభాగంలో అర్షి గుప్తా టైటిల్‌ను గెలుచుకుంది. ఎమ్ఇసిఐ-ఎఫ్ఎమ్ఎస్‌సిఐ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో అర్షి జాతీయ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న తొలి మహిళా రేసర్ గా రికార్డు నమోదు చేసింది. మైక్రో మాక్స్‌లో జరిగిన ప్రీఫైనల్స్, ఫైనల్స్‌లో గుప్తా అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఆమె ఈ విభాగంలో జాతీయ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకోవడానికి తగినన్ని పాయింట్లను సంపాదించిపెట్టింది. ప్రీఫైనల్స్‌ను గెలవడానికి ఆమె మిడ్‌గ్రిడ్ నుండి పోరాడినప్పటికీ, అద్భుతమైన ఆరంభంతో రాకెట్‌తో దూసుకెళ్లి కమాండింగ్ విజయాన్ని సాధించిన తర్వాత ఆమె పోల్ నుండి ఫైనల్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. 21 ఏళ్ల రోటాక్స్ మాక్స్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో జాతీయ టైటిల్ గెలుచుకున్న తొలి మహిళా పోటీదారుగా గుప్తా మరో రికార్డును బద్దలు కొట్టింది. జాతీయ ఛాంపియన్‌షిప్ ఫైనల్ స్టాండింగ్స్‌లో సీనియర్ మ్యాక్స్ ఇషాన్ మాదేష్ (బెంగళూరు, పెరెగ్రైన్ రేసింగ్). జట్టు ఛాంపియన్లు పెరెగ్రైన్ రేసింగ్. ఉత్తమ రూకీ గాబ్రియేల్ ఇరిగరే బౌర్ (జైపూర్, పెరెగ్రైన్ రేసింగ్) జూనియర్ మ్యాక్స్ ఎషాంత్ వెంగటేసన్ (చెన్నై, ఎంఎస్‌పోర్టు). జట్టు ఛాంపియన్లుగా ఎంఎస్‌పోర్టు, ఉత్తమ రూకీ అర్మాన్ ధావన్ (ఢిల్లీ, లీప్‌ఫ్రాగ్ రేసింగ్) మినీ మ్యాక్స్: రివాన్ దేవ్ ప్రీతం (చెన్నై, ఎంఎస్‌పోర్టు). టీమ్ ఛాంపియన్స్ ఎంఎస్‌పోర్టు, ఉత్తమ రూకీ యస్విన్‌రామ్ రాజమాణికం (చెన్నై, మొమెంటం మోటార్‌స్పోర్ట్స్) మైక్రో మాక్స్ అర్షి గుప్తా (ఫరీదాబాద్, లీప్‌ఫ్రాగ్ రేసింగ్) నిలిచారు.

# ఎయిర్ పిస్టల్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా రాణా




**న్యూఢిల్లీ:** భారతదేశపు మొట్టమొదటి వ్యక్తిగత ఎయిర్ పిస్టల్ ప్రపంచ ఛాంపియన్‌గా సామ్రాట్ రాణా నిలిచాడు. ఈజిప్టులోని కారియోల్‌లో జరిగిన 2025 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్న తొలి భారతీయుడిగా సామ్రాట్ రాణా చరిత్ర పుస్తకాల్లో తన పేరు లిఖించుకున్నాడు. కాంస్య పతక స్థానానికి నెట్టబడిన తర్వాత తన చివరి ఆరు షాట్లలో అతను రెండు 10.9 సెకన్లు కొట్టాడు. చైనాకు చెందిన హు కైని అధిగమించి బంగారు పతకం సాధించడానికి 10.3 లేదా అంతకంటే ఎక్కువ సమయం అవసరమైనప్పుడు అతను తన చివరి షాట్‌లో అనూహ్యంగా 10.6 అద్భుతమైన షాట్ కొట్టాడు. కాగా మూడు సంవత్సరాల క్రితం 2022లో ఈజిప్టులోని కైరోలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సామ్రాట్ రెండు స్వర్ణాలు, పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ జట్టు మరియు మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పతకాలను గెలుచుకోవడం ద్వారా అతను అతిపెద్ద బ్రేక్ త్రూ సాధించాడు. 2025 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్, సీనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో సామ్రాట్ అరంగేట్రం చేయగా, సీనియర్ స్థాయిలో అతని మొదటి అంతర్జాతీయ పతకం కావడం విశేషం.

# 'ఆరు' కోసం ముగ్గురి పోటీ

## దక్షిణాఫ్రికాతో టెస్టుకు టీమిండియా సిద్ధం







**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో తలపడేందుకు టీమిండియా సిద్ధమవుతోంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఈ నెల 14వ తేదీ నుండి దక్షిణాఫ్రికాతో ప్రారంభం కానున్న తొలి టెస్టుకు టీమ్ ఇండియా తుది జట్టు ఎంపిక జరుగుతోంది. టీమ్‌లో చాలా మంది స్థానాలు దాదాపు ఖరారైనా, ఆరో స్థానం (నం.6) కోసం ముగ్గురు కీలక ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. ధ్రువ్ జురెల్, అక్షర్ పటేల్, యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ మధ్య ట్రయాంగిల్ పోటీ నడుస్తోంది. రిషబ్ పంత్ వికెట్ కీపర్‌గా తిరిగి జట్టులోకి రావడంతో, బ్యాటింగ్ డెప్త్, ఆల్‌రౌండర్ల విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ధ్రువ్ జురెల్ ప్రస్తుతం అత్యద్భుతమైన ఫామ్‌లో ఉన్న బ్యాటర్‌గా ఉన్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాఏ పై జరిగిన అనధికారిక టెస్టుల్లో వరుసగా 2 సెంచరీలు (132, 127) నమోదు చేసి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. గతంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో కూడా అతను సెంచరీ సాధించాడు. చివరి 8 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. రిషబ్ తిరిగి రావడంతో, జురెల్ వికెట్ కీపర్‌గా కాకుండా స్పెషలిస్ట్ బ్యాటర్‌గా నం.6 స్థానంలో ఆడాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. ఇక నితీష్ కుమార్ ఒక పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్. ఇది బౌలింగ్ విభాగంలో ఒక అదనపు సీమర్‌ను (మూడవ సీమర్) ఆడించాలనుకుంటే జట్టుకు ఉపయోగపడుతుంది. ఈడెన్ గార్డెన్స్ పిచ్ పేస్ బౌలింగ్‌కు అనుకూలించే అవకాశం ఉన్నప్పటికీ, ఎక్కువగా స్పిన్నర్లకే ప్రాధాన్యత ఇస్తారు. అందుకే, నితీష్ బౌలింగ్ నైపుణ్యం అంతగా అవసరం ఉండకపోవచ్చునని, కేవలం బ్యాటింగ్ ఫామ్ పరంగా జురెల్ మెరుగని సెలక్టర్లు ఆలోచనలో ఉన్నారు. అతను బ్యాటింగ్‌లో కూడా రాణించగలడు. ఇక అక్షర్ పటేల్ నిలకడైన ఎడమచేతి వాటం స్పిన్ బౌలర్. అవసరమైనప్పుడు లోయర్‌ఆర్డర్‌లో ముఖ్యమైన పరుగులు చేయగల సమర్థుడు. భారత పిచ్‌లపై రవీంద్ర జడేజాతో పాటు, అదనపు స్పిన్నర్ అవసరమైతే అక్షర్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుత జట్టులో జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ వంటి స్పిన్ ఆల్‌రౌండర్, స్పెషలిస్ట్ స్పిన్నర్లు అందుబాటులో ఉండటంతో, కేవలం ఒకే స్పిన్నర్‌కు (జడేజా) ప్రాధాన్యత ఇచ్చి, ఆరో స్థానంలో బ్యాటింగ్ బలాన్ని పెంచడానికి (జురెల్‌ను) తీసుకోవచ్చు. దీంతో అక్షర్‌కు ఈ టెస్ట్‌లో చోటు దక్కడం కష్టంగా మారవచ్చు.



### ఆర్చరీ ఛాంపియన్‌షిప్

# సెమీఫైనల్‌కు దీపిక

### ఫైనల్‌కు కాంపౌండ్ టీం

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి సెమీఫైనల్‌కు చేరుకుంది. అలాగే భారత పురుషుల కాంపౌండ్ జట్టు కూడా ఫైనల్‌కు చేరుకుంది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో మంగళవారం జరిగిన మహిళల రికర్వ్ సెమీఫైనల్స్‌లో ముగ్గురు భారతీయులు విజయం సాధించడంతో, క్వార్టర్ ఫైనల్స్‌లో దీపిక 7-3 తేడాతో దక్షిణ కొరియాకు చెందిన లీ గహ్యున్‌ను ఓడించింది. ఇరాన్‌కు చెందిన రేహానే జారేపై 7-1 తేడాతో విజయం సాధించిన సంగీత, దీపికతో పాటు దక్షిణ కొరియాకు చెందిన జాంగ్ మిన్హీపై 6-4 తేడాతో విజయం సాధించిన అంకితా భకత్ కూడా సెమీఫైనల్లో చేరింది. ఈ మూడు విజయాలతో మహిళల రికర్వ్ విభాగంలో భారత్‌కు కనీసం రెండు పతకాలు ఖాయం అయ్యాయి. మరోవైపు మహిళల కాంపౌండ్ ఆర్చరీలో అనుభవజ్ఞులైన జ్యోతి సురేఖ వెన్నం, ప్రితికా ప్రదీప్ కూడా సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. క్వార్టర్స్‌లో జ్యోతి 147-145తో దక్షిణ కొరియాకు చెందిన ఓ యూహ్యున్‌ను ఓడించగా, ప్రితిక 148-146తో చికితా తనిపర్తిని ఓడించింది. ఇక పురుషుల విభాగంలో ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. ధీరజ్ షూట్‌ఆఫ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అమిర్ఖోన్ సాడికోవ్‌ను ఓడించాడు. మరోవైపు, రాహుల్ చైనీస్ తైపీకి చెందిన లిన్ జిహ్‌సియాంగ్‌ను 6-2 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. కాగా జాదవ్, ఫుగే, అభిషేక్ వర్మలతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్స్‌లో రెండు జట్లు 235-235తో సమంగా నిలిచిన తర్వాత, ఈ త్రయం షూట్‌ఆఫ్‌లో థాయిలాండ్‌ను ఓడించింది.

**వాణిజ్యం**

# ఈక్విటీ ఫండ్స్ టర్నోవర్

# రూ. 79.87 లక్షలకోట్లు




**ముంబయి, నవంబరు 11:** ఈక్విటీ రంగంలోకి మూచువల్‌ఫండ్స్ పెట్టుబడులు రాక క్రమేపీ పెరుగుతుండటంతోమొత్తం ఫండ్ సంస్థల నిర్వహణ ఆస్తులు 79.87 లక్షలకోట్ల రూపాయలుగా తేలింది. అంతకుముందునెలలో 75.61 లక్షలకోట్లనుంచి కొంతమేర వృద్ధిని నమోదుచేసింది. ఈక్విటీ ఫండ్స్‌లోకి ఇన్వెస్టర్లు పెట్టుబడులకు కొంత వెనుకంజవేసారు. అయితే నికరంగా ఇన్‌ఫ్లోస్ కూడా 19శాతం క్షీణించి 24,690 కోట్లు వచ్చాయి. అదే సెప్టెంబరులో 30,422 కోట్లవరకూ ఉన్నాయి. మొత్తం ఈక్విటీ ఫండ్స్ ఆస్తుల నిర్వహణ 33.7 లక్షలకోట్ల నుంచి 35.16 లక్షలకోట్లకు పెరిగాయని ఆంఫీ వెల్లడించింది. అలాగే సిప్ పరంగా కూడా ఇన్‌ఫ్లోలు కొత్త గరిష్టాలను తాకాయి. 29,361 కోట్లనుంచి 29,529 కోట్లకు పెరిగాయి. దీనితో సిప్ నిర్వహణ ఆస్తులు ఆంఫీ సంస్థల పరంగా చూస్తే 20.3శాతం ఫండ్స్‌లో వాటాగా మొత్తం 16.25 లక్షలకోట్లుగా ఉన్నాయి. అలాగే ఫండ్స్ నిలిపివేత నిష్పత్తికూడా 76.3 నుంచి మెరుగుపడి 75శాతానికిచేరింది. 2024తో పోలిస్తే 50 నుంచి 60శాతంగా ఉంది. దీన్నిబట్టి చూస్తే సిప్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ల రద్దుకూడా క్రమేపీ తగ్గుతోంది. 2025 తొలినాళ్లలో ఈ నిష్పత్తి భారీగాపెరిగింది. 109నుంచి ఏప్రిల్‌లో ఏకంగా 296శాతానికి చేరుకుంది. అలాగఏ సిప్ ఖాతాలు కూడా 9.73 కోట్లనుంచి 9.88 కోట్లకు పెరిగాయి. నికరంగా 60 లక్షల ఖాతాలు వచ్చిచేరాయి. అయితే మూసివేసిన ఖాతాలు కూడా 45 లక్షలవరకూ ఉన్నాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన నిల్వప్రాజెక్టు!

## వచ్చే యేడాదికల్లా ప్రారంభించేందుకు ఆదానిగ్రూప్ కసరత్తు




**ముంబయి, నవంబరు 11:** ఆదానిగ్రూప్ బ్యాటరీ ఇంధననిల్వ వ్యవస్థల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. బెస్‌గా పిలుచుకునే ఈ వ్యవస్థ మార్కెట్ 1126 మెగావాట్ల నుంచి 3530 మెగావాట్ల వరకూ ఉంటుంది. 2026 మార్చికల్లా ఈప్రాజెక్టుపూర్తి అవుతుందని 700కిపైగా బెస్ కంటైనర్లలో ఈ నిల్వసామర్థ్యం ఉంటుందని వెల్లడించింది. ఇంధన నిల్వ కేంద్రంగా అతిపెద్ద యూనిట్ భారత్ పారిశ్రామిక చరిత్రలో ఇదే మొదటిది అవుతుందని వెల్లడించింది. 3530 మెగావాట్ల నిల్వసామర్థ్యంతో తమ ప్రాజెక్టు వస్తుందన్నారు. అలాగే 1126 మెగావాట్లు మూడు గంటలకోసం విడుదలచేయగలదని కూడా వెల్లడించింది. పునరుత్పత్తి ఇంధన విభాగానికి ఈ నిల్వ కేంద్రాలు కీలకంగా మారతాయి. విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానంతోనే ఈ ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని అన్నారు.

ఈప్రాజెక్టుతో ఆదానిగ్రూపు ప్రపంచంలోనే అత్యంత భారీఇంధన సామర్థ్యం ఉన్న గ్రూప్‌గా నమోదవుతుంది. ఖవ్‌డా ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఈ బెస్ ప్రాజెక్టు అతిపెద్ద పునరుత్పత్తి ఇంధన కాంప్లెక్స్‌గా నిలుస్తుంది. లిథియం ఇయాన్ బ్యాటరీ వ్యవస్థలతో లివేరేజి ఉంటుంది. అధునాతన ఇంధన నిర్వహణ టెక్నాలజీతో వీటిని నిర్వహిస్తారు. ఈ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుతోపాటు ఆదానిగ్రూప్ మరో 15 గిగావాట్ల బెస్ కెపాసిటిని 2027 మార్చినాటికి మెరుగు పరుచుకుంటుంది. దీనితో వచ్చే ఐదేళ్లలో 50 గిగావాట్ల ఇంధన నిల్వసామర్థ్యం ఉంటుంది. దీనివల్ల పీక్‌లోడ్ ఒత్తిళ్లను కూడా సడలిస్తుందని ఆదానిగ్రూప్ చెపుతోంది.



# తులం పసిడి రూ.1,23,830

## కిలో వెండి రూ.1,57,100

**న్యూఢిల్లీ, నవంబరు 11:** దేశీయ బులియన్ మార్కెట్లలోగ్రాము బంగారం మంగళవారం రూ.12,383 రూపాయలకు చేరింది. పెరిగినట్లే పెరుగుతూవస్తున్నా ప్రస్తుతం స్థిరంగాఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లలో పెరుగుతున్న అనిశ్చితులు కొంత తోడవుతున్నాయి, అలాగే వడ్డీరేట్లలో తేడాలు, కరెన్సీ విలువల్లో మార్పులు వంటివి ఇన్వెస్టర్ల సెంటి మెంట్‌పై ఒత్తిడి పెంచుతుంది. దేశీయంగా వినియోగ డిమాండ్ కూడా స్థిరంగానే ఉంది. పండుగలు పెళ్లిళ్ల సీజన్ల కారణంగా మరికొంత పెరిగే అవకాశం ఉంది.బంగారంతోపాటే వెండి కూడా గ్రాముకు 157.10 రూపాయలవద్ద నిలిచింది. అంటే కిలో ఒక్కింటికి 1,57,100గా ట్రేడ్‌అయింది. ఢిల్లీలో 24క్యారెట్లు గ్రాముకు 12,398, ముంబయిలో 12,383, కోల్‌కత్తాలో 12,383, చెన్నైలో 12,525, బెంగళూరులో 12,383రూపాయలుగా ట్రేడ్‌అవుతోంటే 22 క్యారెట్ల బంగారం ఢిల్లీలో రేట్లు రూ.11,366లుగాను, ముంబయిలో 11,351, కోల్‌కత్తాలో 11,351, చెన్నైలో 11,481, బెంగళూరులో 11,351 రూపాయలుగా ఉంది. ఇక 18 కేరట్ల పరంగాచూస్తే ఢిల్లీలో రూ.9303, ముంబయి, కోల్‌కత్తా, చెన్నై లలో 9288 రూపాయలుగా ట్రేడ్‌అయింది. ఇక వెండి ధరలపరంగా చూస్తే కిలో ఒక్కింటికి 1,57,100గా ఢిల్లీలో ట్రేడ్ అయింది.

# ప్రైవేటురంగ పెట్టుబడులు పెంచాలి

## ఆర్థికమంత్రికి ఆర్థికవేత్తల బడ్జెట్ సూచనలు



**న్యూఢిల్లీ,నవంబరు 11:** కొత్తసంవత్సర బడ్జెట్ రూపకల్పనలో భాగంగా వివిధ రంగాల నిపుణులు,మేధావులతో భేటీ అవుతున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆర్థికవేత్తలు కీలక సూచనలు చేసారు. ప్రైవేటురంగ పెట్టుబడులు పెరిగేవిధంగా విధానాలు రూపకల్పన చేయాలని, అలాగే ఆర్థిక పరిపుష్టి, లోటు కట్టడి వంటి వాటికి కట్టుబడి ఉండాలని సూచించారు. ఆర్థికేతర రంగంలో మరిన్ని సంస్కరణలు అవసరమవుతాయని అలాగే సమగ్ర ఉత్పత్తిరంగ విధానం అవసరం అవుతుందని వెల్లడించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు ప్రధాన ఆర్థిక సలాహాదారు అనంతనాగేశ్వరన్‌లు దేశంలోని ఆర్థికవేత్తలతో సమావేశం అయ్యారు. ఆర్థిక సమన్వయం, సంతులనం అవసరమవు తుందని, అలాగే లోటు కట్టడి చేయడంతోపాటు ఆర్థికేతర రంగాల్లోసంస్కరణలు బహుముఖంగా తీసుకురావాలని సూచించారు. ప్రైవేటు రంగ పెట్టుబడులకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని కోరారు. ఎక్కువమంది ఆర్థికవేత్తలు సమగ్రపారిశ్రామిక ఉత్పత్తి విధానం తీసుకురావాలని ఎంఎస్‌ఎంఇ రంగానికిమరింత ఊతం ఇచ్చేవిధంగా పాలసీలు ఉండాలన్నారు. వీటివల్ల విదేశాలపై ఆధారపడటం తగ్గుతుందని, స్థానిక టెక్నాలజీతోనే వృద్ధిని నమోదుచేయగలమని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్లగ్ అండ్ ప్లేమోడల్‌లో ఉత్పత్తిరంగ యూనిట్లు తీసుకురావాలని దీనివల్ల ఎంతో మేలుజరుగుతుందని స్వదేశీ జాగరణ్‌మంచ్ కోకన్వీనర్ ఆర్థికవేత్త అశ్వని మహాజన్ సూచించారు. అలాగే ఖాళీ స్థలాలపై పన్ను విధించాలని దీనివల్ల యజమానులకు భద్రతతోపాటు ఖజానాకు మేలు జరుగుతుందన్నారు. పట్టణ ఉపాధిరంగంలో చిరువ్యాపారులు ప్రధాన వనరు అని వీరికి అవసరమైన ప్రాంతాల్లో కొంత స్థలంకేటాయించాలని, స్థానికవేధింపులు లేకుండా వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉండాలని గ్రామీణ ఉపాధిపరంగా గ్రామీణ క్లస్టర్లు బ్లాక్‌స్థాయిలో ఏర్పాటుచేస్తే గ్రామీణ పరిశ్రమలు మరిన్ని వస్తాయన్నారు. క్రిసిల్ ఆర్థికవేత్తలు డా.కె.జోషి, మోర్గాన్ స్టేన్లీ ఎండి రిధమ్ దేశాయి, యాక్సిస్‌బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త నీలకంఠ్ మిశ్రాతదితరులు హాజరయ్యారు.



# హీరోనుంచి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లు

**ముంబయి, నవంబరు 11:** టూవీలర్ దిగ్గజ ఉత్పత్తిసంస్థ హీరో మోటోకార్ప్ మరో సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. కంపెనీ తమ ఎలక్ట్రిక్ వాహనాలను విడా బ్రాండ్‌తో మార్కెట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు వీఎక్స్2 ప్లస్ వేరియంట్‌లో మాత్రమే 3.4కిలోవాట్ల బ్యాటరీఆప్షన్ లభిస్తోంది. తాజాగా 3.4కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో వీఎక్స్2 గోను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.1.02 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. ఈనెలనుంచే డెలివరీలు ప్రారంభించనున్నట్లు కంపెనీ వర్గాలుతెలిపాయి. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ మోడల్‌లో విడా వీఎక్స్2 గో 3.4కిలోవాట్ స్కూటర్‌ను కొనుగోలు చేస్తే ధర రూ.60 వేలకు దిగి వస్తుంది. ఆ తర్వాత సబ్ స్క్రిప్షన్ ఫీజు కింద కిలోమీటరుకు 90పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఈస్కూటర్‌లోనిమోటార్ 6కెవి పవర్‌ను, 26 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఒకసారి ఛార్జింగ్‌చేస్తే 100 కి.మీ మైలేజీ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. గరిష్ఠంగా గంటకు 70 కి.మీ. వేగంతో దూసుకెళ్లవచ్చని తెలిపింది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, నవంబరు 11:** భారత స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోసెషన్‌లోనూ లాభపడ్డాయి. ప్రపంచ మార్కెట్‌లో సానుకూల పవనాల మధ్య మార్కెట్లు దూసుకెళ్లాయి. ఉగ్రదాడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురవడంతో ఆరంభంలో మార్కెట్లు ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. అయితే, మధ్యాహ్నం సెషన్‌లో ఆటో, మెటల్, ఐటీ రంగంలో కొనుగోళ్లతో లాభాల్లోకి దూసుకెళ్లాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,671.52 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,124.03 పాయింట్ల కనిష్టానికి చేరుకున్న సెన్సెక్స్ గరిష్టంగా 83,936.47 పాయింట్లకు పెరిగింది. చివరకు 335.97 పాయింట్ల లాభంతో 83,871.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.6 పాయింట్లు పెరిగి 25,694.95 వద్ద ముగిసింది. బీఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఆటో, ఎంఅండ్‌ఎం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభాలను ఆర్జించాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఓఎన్‌జీసీ, టీఎంపీవీ, పవర్ గ్రిడ్ నష్టపోయాయి. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ ఒక్కొక్కటి 0.3శాతం తగ్గాయి. టెలికాం ఇండెక్స్ 1.5 శాతం పెరిగితే ఐటీ ఇండెక్స్ ఒకటిశాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.7 శాతం, ఆటో ఇండెక్స్ ఒకశాతం, మెటల్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది. రెండోత్రైమాసిక రాబడుల తర్వాత బజాజ్ ఫైనాన్స్ షేర్ ధర 7 శాతం పడిపోయాయి. క్యూ 2 నష్టాలు తగ్గడంతో వోడాఫోన్ ఐడియా షేర్లు 8 శాతం పెరిగాయి. యూఎస్‌తో వాణిజ్య ఒప్పందంపై గోకుల్దాస్ ఎక్స్‌పోర్ట్స్ షేర్లు 5 శాతం వృద్ధి చెందాయి. రెడెరియట్ స్టెనర్సన్ ఏఎస్‌తో ఎల్ఓఐపై సంతకం చేయడంతో స్వాన్ డిఫెన్స్ షేర్ ధర 5 శాతం పెరిగింది. సీఈవో రాజీనామాతో బ్రిటానియా ఇండస్ట్రీస్ షేర్ ధర 3శాతం పతనమైంది. కూ2 నష్టాలు తగ్గడంతో అథర్ ఎనర్జీ షేర్లు 7శాతం వృద్ధిని నమోదు చేశాయి. క్రాఫ్ట్స్‌మన్, భారత్ ఫోర్జ్, బీహెచ్‌ఈఎల్, నాల్కో, అశోక్ లేలాండ్, హిటాచి ఎనర్జీ, ఎం అండ్ ఎం, అసహి ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, క్యాన్ ఫిన్ హోమ్స్, ఐటీసీ, శ్రీరామ్ ఫైనాన్స్, టోరెంట్ ఫార్మా, ఎంసిఎక్స్ ఇండియా వంటి వందకంటే ఎక్కువ స్టాక్‌లు ఐఎస్ఇలో 52 వారాల గరిష్ట స్థాయిని తాకాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.